# ప్రభాత్


***ఈ సంచికలో....***

- నిర్బంధ కొలిమిలో ఉడుకుతున్న తెలంగాణా... 8
- విషమిస్తున్న పోలీసు అత్యాచారాలు
  గడ్చిరోలి ప్రజల ప్రతిఘటన... 12
- దోపిడీ వ్యవస్థ ఫలితమే అవినీతి కుంభకోణాలు
  తెల్గీ స్టాంప్ పేపర్ల కుంభకోణం... 15
- విదర్భ ఒక వాస్తవం
  నేటి విదర్భ నేతల పోరాటం మాత్రం ఒక మోసం 18
- ముంబాయి ప్రతిఘటన - 2004 ప్రకటన... 21



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక**

**సంపుటి - 17 | సంచిక - 1 | జనవరి - మార్చ్ 2004 | వెల - 10 రూపాయలు**


## బిజెపి ఊదరగొడుతున్న 'ఫీల్ గుడ్ ఫ్యాక్టర్' ఒక బూటకం – తిరిగి అధికారంలోకి రావడానికి ఆడుతున్న నాటకం

# రాబోయే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించండి!

## గ్రామగ్రామాన ప్రజా రాజ్యాధికార సంస్థల (జనతన సర్కార్ల)ను నెలకొల్పుతూ, వాటిని బలోపేతం చేస్తూ, విస్తరింపజేస్తూ ప్రజాయుద్ధాన్ని దృఢంగా కొనసాగిద్దాం!

ప్రియమైన ప్రజలారా,

మళ్లీ ఎన్నికల బాగోతం మొదలైంది. త్వరలో 14వ లోక్‌సభకు ఎన్నికలు జరుగబోతున్నాయి. మన దేశానికి బూటకపు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952 నుండి కొనసాగుతున్న ఎన్నికలలో చాలా సార్లు కాంగ్రెస్‌కే అధికారం దక్కగా గత ఎనిమిదేళ్లుగా బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ మన దేశాన్ని ఏలుతూ వస్తున్నది. ఈసారి తిరిగి మరింత మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని బిజెపి, చేజారిన అధికార పీఠాన్ని ఎలాగైనా మళ్లీ దక్కించుకోవాలని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ ప్రధానంగా పోటీ పడుతున్నాయి. మిగతా పార్టీలన్నీ తమలో తాము కీచులాడుకుంటూనే, మరో వైపు ఏదో ఒక ముఠాతో చేతులు కలిపి అవకాశవాద పొత్తులు ఏర్పాటు చేసుకొని అధికారంలో వాటా పొందాలని నానా అగచాట్లు పడుతున్నాయి. అయితే సాధారణ ప్రజలు మాత్రం "ఏ పార్టీ గెల్చినా మాకొచ్చేదేముంది" అంటూ ఎన్నికల పట్ల తమ అనాసక్తినీ, అయిష్టతనూ ప్రకటిస్తున్నారు. ఎన్నికల ద్వారా తమ బతుకు మారదనీ, ఈ వ్యవస్థలో మౌలిక మార్పేదీ రాదనీ ప్రజలు నానాటికీ మరింతగా గ్రహిస్తున్నప్పటికీ, సరైన ప్రత్యామ్నాయం ఏమిటో తెలియక పోలింగ్‌లో పాల్గొంటూ ఎవరో ఒకరికి ఓట్లేస్తున్నారు. అలాగే మరోవైపు గత 35 ఏళ్లుగా బూటకపు ఎన్నికలను బహిష్కరించాలనే ప్రత్యామ్నాయ విప్లవ మార్గం ప్రజలలో రోజురోజుకూ విశ్వాసాన్ని పొందుతున్నది. గత పదేళ్లుగా విప్లవోద్యమ ప్రాంతాల్లో కుళ్లిన దోపిడీ పాలనా వ్యవస్థ స్థానంలో ప్రజల ప్రజాస్వామిక పాలనకు ప్రతీకలైన 'జనతన సర్కార్' సంస్థలు ప్రారంభమై సంఖ్యలోనూ, విస్తృతిలోనూ పెంపొందుతున్నాయి. **బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించి దండకారణ్యం, ఆంధ్ర, బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా తదితర ప్రాంతాల ప్రజానీకం ఆవిష్కరిస్తున్న ఈ నూతన ప్రత్యామ్నాయ మార్గాన్ని అనుసరించాల్సిందిగా మేం దేశ** ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

## ఈ ఎన్నికల నేపథ్యం

నిజానికి లోకసభకు ఈ ఎన్నికలు ఇప్పుడు జరగాల్సింది కాదు. అక్టోబర్ నాటికి 13వ లోక్‌సభ గడువు పూర్తవాల్సి ఉండె. కానీ అప్పటి దాకా ఆగితే పరిస్థితి ఎలా విషమిస్తుందోనన్న భయంతో బిజెపి నాయకత్వంలోని 24 పార్టీల జాతీయ ప్రజాతంత్ర కూటమి (ఎన్‌డిఏ) ఫిబ్రవరి 6న లోక్‌సభను లాంఛనంగా రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు సిద్ధమైంది. దీనికి ఒకే ఒక్క కారణం ఇటీవల రాష్ట్ర విధానసభలకు జరిగిన ఎన్నికల్లో బిజెపికి అంచనాకు మించిన విజయం చేకూరడంతో దేశమంతటా ప్రస్తుతం తమకు అనుకూల పవనాలు వీస్తున్నాయని అది భావిస్తుండడమే. రానున్న ఏడాది కాలంలో దేశంలోని మరో ఐదు రాష్ట్రాలలో – మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, సిక్కిం, ఒరిస్సా – విధానసభలకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. ఈ రాష్ట్రాలలో అధికారంలోనున్న ఎన్‌డిఏ భాగస్వామ్య పార్టీలు ఈ అవకాశాన్ని జారవిడుచుకోగూడదని విధానసభలను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు దిగుతున్నాయి. వీళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అందరికన్నా ముందున్నాడు. గత అక్టోబర్‌లో పిజిఏ గెరిల్లాలు వీడిపై దాడి చేయగా చావుతప్పి కన్ను లొట్టపోయినట్టుగా బతికి బైటపడి ప్రజల నుండి సానుభూతి దొరుకుతుందన్న భ్రమతో ముందస్తు ఎన్నికలకు దిగాడు. ముందస్తు ఎన్నికలకు దిగుతున్న బిజెపి గానీ, దాని ఇతర మిత్రపక్షాలు గానీ నిజానికి "గాలివాటం"తోనే గెలవాలని వెంపర్లాడుతున్నాయి.

ఎన్నికల పార్టీల సమీకరణలు రోజురోజుకూ ఊపందుకుంటున్నాయి. ఎవరు ఎవరితో కలవడం ద్వారా ఎంత లాభమో లెక్కించుకుంటూ పొత్తులు కుదుర్చుకుంటున్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు ప్రధాన పోటీదార్లుగా ఎన్నికల రంగం సిద్ధమవుతోంది. మూడవ ఫ్రంట్‌కు అవకాశం లేదని

రివిజనిస్టులు చేతులెత్తారు. ఎవరి నినాదాలు వాళ్లు ముందుకు తెస్తూ అంతా "అభివృద్ధి" పాటే పాడుతున్నారు. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సాధించలేనిది తాము ఐదేళ్లలోనే సాధించామని (50 వర్సెస్ 5 అంటూ) బిజెపి చంకలు గుద్దుకుంటూ "ఫీల్ గుడ్ ఫ్యాక్టర్(అంతా ఆనందమయం)" అంటూ "ఫీల్ గ్రేట్ (చాలా గొప్పగా ఉంది)" అంటూ ప్రచార దుమారం రేపుతోంది. అటల్‌ను ఆకాశానికెత్తుతూ ప్రతిపక్షానికి ప్రధాని కాగల్గే మనిషే కరువయ్యాడని ఆట పట్టిస్తోంది. అటల్ సందేశ్ యాత్ర, రథయాత్రలు, బస్ యాత్రలు, విజయ యాత్రలు, పాదయాత్రలు ఊపందుకుంటున్నాయి. ప్రధాని కావడానికి ఈ దేశంలో పుట్టినవారే అర్హులని వాదిస్తూ బిజెపి సోనియా గాంధీపైన తన దాడిని ఎక్కుపెట్టింది. ఇప్పుడు ప్రియంక, రాహుల్‌లు రాజకీయ రంగం మీదకు వస్తూండడంతో ఈ దేశ సంతతి వారై కూడా ఉండాలని వాదిస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లను బుట్టలో వేసుకోవడానికి జనవరిలో 10 కోట్ల రూపాయల రాబడినిచ్చే పన్నులను మినహాయిస్తున్నట్టు ప్రకటించింది. రోజుకో కొత్త పథకాన్ని ప్రకటిస్తూ ఎన్నికలు దగ్గర పడుతూండడంతో రాయితీల వర్షాన్ని కురిపిస్తోంది. మరోవైపు అనేక చీలికలు పేలికలకు గురైన కాంగ్రెస్ సమర్థవంతమైన నాయకత్వం లేక, బిజెపి చేస్తున్న 'అగ్రెసివ్' ప్రచారానికి ధీటుగా జవాబివ్వలేక తిరిగి అధికార పీఠాన్ని దక్కించుకోవడమెలా అని తన్నుకు చస్తోంది. పలు రాష్ట్రాల్లో కదులుతున్న పునాదులను చూసి బెంబేలెత్తుతోంది. ఇలాంటి స్థితిలో తిరిగి బిజెపి అధికారంలోకి రావడమంటే అది ప్రతిపక్షాల బలహీనతకే నిదర్శనమవుతుంది తప్ప జనామోదంతో గెల్చినట్టు మాత్రం కాదనేది స్పష్టం.

ప్రస్తుతం ఎన్నికల బరిలోకి దిగిన అధికార, ప్రతిపక్షాలేవీ ప్రజల మౌలిక సమస్యలేవీ ఎత్తుకోలేపోతున్నాయి. కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం వగైరా ప్రజల మౌలిక సమస్యలను తన యాభై ఏళ్ల పాలనలో కాంగ్రెస్ గానీ, తన ఐదేళ్ల పాలనలో బిజెపి గానీ పరిష్కరించలేకపోయాయన్నది దాచేస్తే దాగని సత్యం. ఈ దోపిడీ వ్యవస్థలో ఇవేవీ పరిష్కారం కాకుండా రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నాయి. **పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలొగ్గుతూ అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ముందు అప్పుల కోసం మోకరిల్లుతూ ఉన్నంత కాలం నిజమైన అభివృద్ధికి అవకాశమే ఉండదు. పాలకవర్గాలు చెపుతున్న 'అభివృద్ధి' పిడికెడు మంది దోపిడీదార్ల అభివృద్ధి మాత్రమే. అసంఖ్యాకులైన ప్రజలు నిత్య దారిద్ర్యంలో బతుకులీడుస్తున్నారు. కనుక 'అభివృద్ధి' పాచి పాట పాడుతూ ఓట్ల కోసం వచ్చే ఎన్నికల పార్టీలను తన్ని తరమాలని మేం ప్రజలను కోరుతున్నాం.**

## రైతుల ఆత్మహత్యలూ 'అభివృద్ధి'లో భాగమేనా?

మనది అర్ధ వలస అర్ధ భూస్వామ్య దేశం. ఇక్కడ నూటికి 70 మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 55 ఏళ్ల కాలంలో రైతుల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కాలేదు. రైతాంగం సమస్య అంటే భూమి సమస్యే. ఇప్పటికీ నిజమైన రైతుల చేతుల్లో భూమి లేదు, ఉన్నా అరకొరగానే. భూసంస్కరణ చట్టాలన్నీ చేసినా అవి ఉన్నోళ్ల చుట్టాలుగానే ఉండిపోయాయి. ముఖ్యంగా గత పదిహేనేళ్లుగా ఇక్కడి వ్యవసాయాన్ని సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలకు బలి చేస్తుండడంతో రైతుల బతుకులు మరింత హీనంగా మారాయి. సబ్సిడీలన్నీ ఎత్తివేశారు. పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. చెరకు, పత్తి పండించే రైతులు దేశంలో పలు ప్రాంతాలలో గిట్టుబాటు ధరల కోసం ఉద్యమాలు నడిపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కరెంటు కోతతో పంటల దిగుబడిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వాలు కరెంటు చార్జీల్లో పెంపుదలతో 'షాక్' ఇస్తున్నాయి. వ్యవసాయంపై పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయి. ఎరువుల ధరలు, క్రిమిసంహారక మందుల ధరలు, నీటి తీరువా, ఇంధనం ఖర్చులు ఏటేటా పెరుగుతున్నాయి. వ్యవసాయ పెట్టుబడుల, ధరల కమిషన్ రిపోర్టు ప్రకారం 1996-97 నుండి 2001-02 మధ్య విద్యుత్తు, డీజిల్ ధరలు ధాన్యం కనీస ధరతో పోలిస్తే 40 శాతం, గోధుమ కనీస ధరతో పోలిస్తే 30 శాతం పెరిగాయి. లాభాల వేటలో మందుల, విత్తనాల కంపెనీలు నకిలీవి అమ్ముతుండడంతో రైతులకు గొడ్డలిపెట్టే అవుతోంది.

ఇప్పటికీ మన దేశంలో వ్యవసాయం చాలా వరకు వర్షాలపైన్నే ఆధారపడి ఉండడం 'అభివృద్ధి' పాట పాడే పాలకుల దారుణ నిర్లక్ష్యానికి మచ్చు తునక. అనేక రాష్ట్రాలు చాలా సంవత్సరాలుగా తీవ్రమైన కరువుతో సతమతమవుతున్నాయి. రాజస్థాన్ గత నాలుగేళ్లుగా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లు గత మూడేళ్లుగా, ఆంధ్రలోని అనేక ప్రాంతాలు గత చాలా కాలంగా తీవ్రమైన కరువునెదుర్కుంటున్నాయి. గత సంవత్సరం మొత్తంపై 16 రాష్ట్రాలు కరువు బారిన పడగా ప్రభుత్వం వారిని ఆదుకున్న పాపాన పోలేదు. మరోవైపు, **ప్రభుత్వ గోదాముల్లో 6 కోట్ల 20 లక్షల టన్నుల ధాన్యం మురిగిపోతుంటే ఒరిస్సా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల ప్రజలు పట్టెడన్నం దొరకక ఆకలితో చనిపోతుండడం "ఫీల్ గుడ్"ను కాదు, "ఫీల్ ఆకలి"ని సూచిస్తోంది.**

వ్యవసాయ రంగంలో ప్రపంచీకరణ విధానాల దుష్ఫలితంగా, హరిత విప్లవం జయప్రదమైందని చెప్పుకునే పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, కర్నాటక (పాక్షికం)లతో పాటు అనేక రాష్ట్రాల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 'హైటెక్ ముఖ్యమంత్రి'గా చెప్పుకునే చంద్రబాబు పాలనలో ఆంధ్ర రాష్ట్రంలో 3,500 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్న చేదు వాస్తవాన్ని బట్టి 'సమాచార విప్లవం'తో రైతులకు ఒనగూరిందేమిటో, అట్లాగే ఇప్పుడు ఊదరగొడుతున్న 'కిసాన్ వాణి', 'రైతు కాల్ సెంటర్ల' స్థాపనతో ఏం ఒరుగగలదో అంచనా వేయడం కష్టమేమీ కాదు. ఇటీవల హైదరాబాద్ నగరంలో కేంద్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి "ఫీల్ గుడ్ ఫ్యాక్టర్" అంటూ ప్రచారానికి లంకించుకున్న బిజెపి అదే రాష్ట్రంలో రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో చెప్పగలదా? మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో గత మూడేళ్లలో 175 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డట్టు ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయి. వాస్తవ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందనేది స్పష్టమే. మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో అప్పుల పాలైన ఎందరో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే మరెందరో తిండి దొరక్క ఆకలితో మాడి చనిపోతున్నారు. **నిజానికి రైతుల ఆత్మహత్యలన్నీ, ఆకలి చావులన్నీ ప్రభుత్వ హత్యలే.**

డబ్ల్యుటివో షరతులు రైతుల బతుకుల్ని మరింతగా దుర్భరం చేస్తున్నాయి. ఈ షరతులు ఎంత ఘోరంగా ఉన్నాయంటే కేంద్ర ప్రభుత్వం ఒకవైపు అమెరికాలోని పందుల కోసం కిలోకు 4.50 రూపాయల చొప్పున గోధుమలను ఎగుమతి చేస్తూ, మరోవైపు దిగుమతి చేసుకున్న గోధుమలను చౌక దుకాణాల ద్వారా కిలోకు 6.50 చొప్పున అమ్ముతోంది. ఒక వైపు అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు తమ తమ దేశాలలో వ్యవసాయరంగానికి లక్షల కోట్ల డాలర్ల సబ్సిడీలనిస్తూ డబ్ల్యుటీవో ద్వారా పేద దేశాలపై వత్తిడి తెచ్చి సబ్సిడీలను ఎత్తివేయిస్తున్నాయి. ప్రజల నిరసనకు భయపడి భారత పాలకవర్గాలు ధనిక దేశాలు కూడా సబ్సిడీలివ్వడాన్ని మానుకోవాలని హీనస్వరంతో కోరుతున్నాయే తప్ప దేశ సార్వభౌమత్వానికే అవమానకరమైన డబ్ల్యుటీవో నుండి నిర్ద్వంద్వంగా వైదొలిగి స్వావలంబనపై ఆధారపడి మన దేశ ఆర్థికవ్యవస్థను పటిష్టం చేయడానికి మాత్రం సిద్ధంగా లేవు. పైకి చూస్తే సామ్రాజ్యవాదాన్ని సవాలు చేస్తున్నట్టు నటిస్తున్న మన దేశ పాలకవర్గాలు సారాంశంలో సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి నమ్మిన

బంట్లుగా వ్యవహరిస్తున్నాయి. **మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 50 శాతం నుండి 24 శాతానికి పడిపోయిందన్న ఒక్క ఉదాహరణ చాలు బిజెపి చెప్పే "ఫీల్ గుడ్ ఫ్యాక్టర్" బోగస్ అని చెప్పడానికి!**

అందుకే ఈ దోపిడీ వర్గాల బూటకపు ప్రకటనలకు మోసపోవద్దనీ, ఓట్లడిగే పార్టీలను తన్ని తరమాలనీ మేం రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నాం. **దేశంలోని పలు ప్రాంతాలలో సాగుతున్న సాయుధ వ్యవసాయ విప్లవంలో చేరిపోయి "దున్నేవారికే భూమి" నినాదంతో పోరాడి మన దేశాన్ని సామ్రాజ్యవాద, భూస్వామ్య సంకెళ్ల నుండి విముక్తి చేయడమొక్కటే రైతుల ముందున్న మార్గం.**

## నూతన ఆర్థిక విధానాల విషవలయంలో చిక్కుపడిన కార్మికవర్గం

1991 నుండి మన దేశంలో నూతన ఆర్థిక విధానాల పేరిట సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల అమలు ప్రారంభమైంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించగా బిజెపి ప్రభుత్వం వీటిని దృఢంగా అమలు చేస్తూ వస్తోంది. 1999లో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా రెండవ విడత ఆర్థిక సంస్కరణలను ప్రారంభించడంతో అన్ని రంగాల్లో వీటి అమలు తీవ్రతరమైంది. ఈ విధానాల ఫలితంగా కార్మిక వర్గానికి ఉపాధి అవకాశాలు కరువై పోతున్నాయి. 1991లో ఉపాధి కేంద్రాలలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల సంఖ్య 3.5 కోట్లు కాగా ఇప్పుడు 4.5 కోట్లకు చేరింది. వీరు కాక గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగుల సంఖ్య ఇంతకు అనేక రెట్లు ఎక్కువ ఉంటుంది. ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల ఫలితంగా లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఉదాహరణకు రైల్వే శాఖలో కార్మికుల సంఖ్య 22 లక్షల నుండి 14 లక్షలకు పడిపోయింది. 1998-2002 మధ్య వివిధ పరిశ్రమల్లో పనులు నిలిపివేయడంతో 60 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్ ఉక్కు పరిశ్రమలో ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులుండగా ఇప్పుడు వారి సంఖ్య 40 వేలకు పడిపోయింది. ఇంకా అనేక పరిశ్రమలలో లాకౌట్ల పేరిట, స్వచ్ఛంద పదవీ విరమణ పేరిట, రిట్రెంచ్‌మెంట్, డౌన్‌సైజింగ్ పేరిట కార్మికులను ఉద్యోగాల్లోంచి తొలగిస్తున్నారు. పలు ప్రభుత్వ రంగ కంపెనీలను ప్రభుత్వం కారుచౌకగా అమ్మేయడంతో కూడా వేలాది కార్మికులు వీధుల పాలవుతున్నారు.

ఎన్‌డిఏ తాను అధికారంలోకి వస్తే ఏటా కోటి మందికి ఉద్యోగాలిస్తానని నమ్మబలికింది. కోటి మందికి ఇవ్వలేకున్నా ఏటా 84 లక్షల మందికి ఇస్తున్నామని అది ఇటీవల ప్రకటించింది. కానీ ఒక వైపు లక్షల మందిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తూ, సంఘటిత రంగంలో అనేక ఉద్యోగాలను శాశ్వతంగా తొలగించడం ద్వారా ఉపాధి అవకాశాలను దారుణంగా కుదిస్తూ ఉద్యోగాలిస్తున్నామని ప్రకటించడం ప్రజలను మోసగించడానికే తప్ప వేరే ఏమీ కాదు. 1999లో మన దేశంలో సంఘటిత రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగుల సంఖ్య 2.89 కోట్లు ఉండగా ఇప్పుడది 2.77 కోట్లకన్నా తక్కువకు పడిపోయింది. సంవత్సరానికి 84 లక్షల ఉద్యోగాలిస్తున్నామని చెప్పే వాజపేయి దీనికేం జవాబిస్తాడు? ఇకపోతే ప్రభుత్వం ఇస్తున్నానని చెబుతున్న ఉద్యోగాలు చాలా వరకు పొద్దున పనికి కుదుర్చుకొని సాయంత్రానికల్లా బర్తరఫ్ చేసే అస్థిరమైన ఉద్యోగాలే. ఇంకా సమాచార సాంకేతిక రంగంలో అది ఇస్తున్నామని చెబుతున్న ఉద్యోగాలు సామ్రాజ్యవాదులు తమ ఖర్చును తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా చౌకగా పనివాళ్లు దొరికే పేద దేశాలకు తమ కంపెనీల కార్యకలాపాలను మరల్చడం వల్ల వచ్చి పడినవే. ఇవి తుమ్మితే ఊడిపోయే ముక్కు వంటి ఉద్యోగాలు. వీటిని చూపిస్తూ బిజెపి "ఫీల్ గుడ్ ఫ్యాక్టర్" అంటూ విపరీతరమైన ప్రచారానికి దిగింది. నిజానికి ఈ ప్రచారానికి ప్రభుత్వం నీళ్లలా ఖర్చు చేస్తున్న వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని గనుక ఉత్పాదక రంగానికి తరలిస్తే వేలాది మందికి వాస్తవంగా ఉపాధిని కల్పించవచ్చు.

ఉద్యోగాలు కోల్పోయి, అప్పుల పాలై, ఉపాధి దొరకక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడమనేది మనకు ప్రపంచీకరణ ఇచ్చిన మరో "కానుక". ముంబాయిలోని టాటా విద్యుత్ కంపెనీలో పని చేసే అనంత్ దల్వీ, అఖ్తర్ ఖాన్ అనే ఇద్దరు కార్మికులు గత అక్టోబర్ నెలలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పనిలోంచి అక్రమంగా తొలగించినందుకు వ్యతిరేకంగా ఈ ఇద్దరు కార్మికులు కోర్టుకు వెళ్లగా, కోర్టు తీర్పు వీళ్లకు అనుకూలంగా వచ్చినప్పటికీ యాజమాన్యం ఖాతరు చేయనందుకు నిరసనగా ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలాంటివి దేశమంతటా నిత్యం అనేకం జరుగుతున్నాయి.

ఒకవైపు కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ వాళ్ల కనీస హక్కైన సమ్మె హక్కును కూడా కాలరాచి వేయడానికి పాలకవర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇటీవల తమిళనాడులో సమ్మె చేసిన రెండు లక్షల మంది ప్రభుత్వోద్యోగులను జయలలిత ఫాసిస్టు ప్రభుత్వం బర్తరఫ్ చేయడం, ఆ వెనువెంటనే కార్మికులు సమ్మె చేయడం అక్రమమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం వంటివి దీనికి తాజా ఉదాహరణలు. బూర్జువా, రివిజనిస్టు ట్రేడ్ యూనియన్లు అప్పుడప్పుడు ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు పిలుపునిస్తున్నప్పటికీ నిలకడగా, దృఢంగా ఉద్యమాన్ని కొనసాగించకుండా మధ్యలోనే ద్రోహానికి పాల్పడడం లేదా ఉద్యమం ప్రభుత్వ అణచివేతకు బలైపోయేలా చేయడం వంటివి ఒక పెద్ద కుట్రలో భాగంగా కొనసాగిస్తున్నాయి. పోరాడి ఏదీ సాధించుకోలేమనే నిస్సహాయతను కార్మికులకు వీళ్లు తమ "పోరాటాల" ద్వారా ప్రత్యక్షంగా నూరిపోస్తున్నారు. **ప్రపంచీకరణ దోపిడీ విధానాలను అమలు చేయడంలో అన్ని పార్టీలూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎన్‌డిఏకు సహకరిస్తున్నాయన్నది వాస్తవం.**

కనుక ఈ దోపిడీ వ్యవస్థను సమూలంగా మార్చే పోరులో తన చారిత్రక బాధ్యతను నిర్వహించడానికి పూనుకోవడమా లేక పాలకవర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ విధానాలకు నిస్సహాయంగా బలయిపోవడమా అన్నది కార్మికవర్గం తక్షణం తేల్చుకోవలిసిన అవసరం ఉంది. **దోపిడీ పాలకవర్గాల ఎన్నికల నాటకాన్ని బహిష్కరించి దేశంలో ఆంధ్ర, దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగమవడం ద్వారానే కార్మికవర్గానికి నిజమైన విముక్తి లభిస్తుంది.**

## విద్యను వ్యాపారం చేస్తూ యువతరం భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న దోపిడీ పాలకవర్గాలు

మూడేళ్ల కింద రాజ్యాంగ సవరణ ద్వారా నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి "అందరికీ విద్య" అంటూ చెవులు చిల్లులు పడేలా పాలకవర్గాలు ప్రచారం చేస్తున్నప్పటికీ మన దేశంలో అక్షరాస్యత ఇప్పటికీ 58 శాతాన్ని దాటలేదన్నది కాదనలేని సత్యం. ఇది కడు పేద ఆఫ్రికన్ దేశమైన సూడాన్‌తో సమానం. మహిళల్లో ఈ శాతం 40కన్నా తక్కువే. చాలా దేశాల్లో విద్యకు రక్షణ బడ్జెట్‌తో సమానంగా బడ్జెట్ కేటాయిస్తుండగా మన దేశంలో స్థూల జాతీయోత్పత్తిలో 3.98 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా ప్రాథమిక విద్యతో సహా అన్ని స్థాయిలలో విద్య ప్రైవేటీకరణ చాలా వేగంగా సాగుతోంది. విద్య

లాభదాయకమైన వ్యాపారం అయ్యింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఫీజుల పెంపుదల, ఫ్రీ సీట్లను పే సీట్లుగా మార్చడంతో పై చదువులకు వెళ్లడం సాధ్యం కాని పరిస్థితులు నెలకొన్నాయి. నత్తనడకగా సాగుతున్న ప్రభుత్వ విద్యాలయాల తీరు చాలా దయనీయంగా ఉంది. ప్రభుత్వాలు విద్యార్థులకు కనీస సదుపాయాలు సమకూర్చడం లేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల నియామకం జరగడం లేదు. జరిగినా తాత్కాలిక ప్రాతిపదికన ''విద్యా వలంటీర్లు''గానో, ''శిక్షా గ్యారంటీ టీచర్లు''గానో చేస్తున్నారు తప్ప శాశ్వత ప్రాతిపదికన నియామకం చేయడం లేదు. టీచర్లకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. వీరి పని వెట్టి పనివాళ్లకంటే ఘోరంగా ఉందంటే ఆశ్చర్యం లేదు. ప్రపంచ బ్యాంకు నుండి పెద్ద ఎత్తున నిధుల్ని తెస్తూ ఆర్భాటంగా పథకాల్ని ప్రవేశపెట్టా వాటిని మధ్యలోనే ఆపెయ్యడం పాలకవర్గాలకు ఆనవాయితీగా మారిపోయింది. చదవడానికి సరైన అవకాశాలు లేక, చదివిన వాళ్లకు ఉద్యోగాలు దొరక్క యువతరం భవిష్యత్తు అయోమయంగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితులలో పెచ్చుపెరిగిపోతున్న సామ్రాజ్యవాద విశృంఖల సంస్కృతి ప్రభావానికి గురై చాలా మంది సంఘవ్యతిరేక శక్తులుగా, నేరగాళ్లుగా, బ్రోకర్లుగా, వేశ్యలుగా మారిపోతున్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం మాత్రం ఈ కఠిన వాస్తవాలను మరుగుపరుస్తూ ''షైనింగ్ ఇండియా (భారత్ వెలిగిపోతోంది)'' అంటూ బుకాయిస్తోంది.

**యువతరం దేశానికి కళ్ళు, కాళ్ల వంటి వారు.** దేశ భవిష్యత్తు వాళ్ల చేతిలోనే ఉంది. తమ స్వప్నాలెందుకు ఫలించడం లేదో గ్రహించి ఈ రుగ్మతలన్నింటికీ కారణమైన భూస్వామ్యాన్నీ, దళారీ పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్నీ కూలదోసేందుకై సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో పాలు పంచుకోవడం తప్ప వాళ్లకు మరో దారి లేదు. **ఓట్ల కోసం వచ్చే దోపిడీ పార్టీలను తిరస్కరించాలనీ, ''ఫీల్ గుడ్'' అంటూ వాస్తవాలకు మసిబూసి మారేడుకాయ చేస్తున్న బిజెపి పాలకుల ముసుగును చించెయ్యాలనీ మేం దేశ యువతరానికి పిలుపునిస్తున్నాం.**

## దేశ ప్రజల విలువైన ఆస్తులను తెగనమ్మడమే బిజెపి చెబుతున్న "అభివృద్ధి"

నెహ్రూ కాలం నాటి మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు కాలం చెల్లిపోయింది. అంతా ప్రైవేటుపరం చేసే, ప్రజల ఆస్తులను విచ్చలవిడిగా తెగనమ్మే ప్రక్రియ కాంగ్రెస్ హయాంలో 1991లో ప్రారంభం కాగా బిజెపి హయాంలో హద్దులు దాటిపోయింది. ప్రజల ఆస్తులను ఇలా తెగనమ్మడానికి ప్రత్యేకించి ఒక మంత్రిత్వ శాఖను (పెట్టుబడుల ఉపసంహరణ శాఖ) ప్రారంభించిన ''ఘనత'' బిజెపికే దక్కుతుంది. ఒకవైపు బిజెపి మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ''స్వదేశీ జాగరణ్ మంచ్'' ముసుగులో బహుళజాతి కంపెనీల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూనే మరో వైపు బిజెపి ప్రభుత్వంతో ''పెట్టుబడుల ఉపసంహరణ''కు ప్రత్యేకంగా ఒక మంత్రిత్వశాఖనే ఏర్పాటు చేయించింది. ఇంతకన్నా వంచన మరొకటి కనిపించదు. ఎంతో కొంత దేశభక్తి కలిగి ఉండి సంఘ్ ముఠా రాజకీయాలను విశ్వసించేవాళ్ల కోసం ''స్వదేశీ జాగరణ్ మంచ్'' పేరిట ఒక వేదికను కల్పించడం, వాళ్లను కూడా తమ దోపిడీ రాజకీయాలతో నిలిపి ఉంచుకోవడం కోసమే ఈ నాటకమంతా. వీరెవరూ కూడా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కోకాకోలా, పెప్సీలను మాత్రం మన దేశాన్నుండి తరిమెయ్యలేరు లేదా ఎన్నెన్నో ప్రజల ఆస్తులు బహుళజాతి కంపెనీల పరం కావడాన్ని అడ్డుకోలేరు! ఇదీ వీళ్ల ''స్వదేశీ'' నాటకం.

బహుళజాతి కంపెనీలకు తలుపులు బార్లా తెరిచిన పాలకవర్గాలు వాటికి లెక్క లేనన్ని రాయితీలు ప్రకటిస్తున్నాయి. కోకాకోలా, పెప్సీ వంటి అమెరికన్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన కోట్లాది రూపాయల రాయితీల ఫలితంగా వందల సంఖ్యలో దేశీయ బాట్లింగ్ కంపెనీలు మూతబడ్డాయి. అనేక మంది చిన్న, మధ్య తరగతి పెట్టుబడిదార్లు దివాళా తీశారు. పర్యావరణానికి హాని చేకూరుస్తున్నాయంటూ మహానగరాల్లోని లఘు, మధ్య రకం పరిశ్రమలను బలవంతంగా మూయించి లక్షలాది కార్మికుల, వేలాది దేశీయ పెట్టుబడిదార్ల పొట్టలు కొట్టే పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల కంపెనీలు మాత్రం పర్యావరణానికి తీరని నష్టం చేస్తున్పటికీ కిమ్మనడం లేదు. కోక్, పెప్సీ కంపెనీల శీతల పానీయాల్లో ప్రాణాంతక క్రిమిసంహారక మందులున్నాయని పరీక్షలలో బైటపడి దేశ ప్రజలంతా తీవ్ర నిరసన తెల్పినప్పటికీ వాటిపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం మన దేశ పాలకవర్గాల దళారీ స్వభావానికి ఒక ఉదాహరణ మాత్రమే.

కేంద్ర ప్రభుత్వం 2001లో ఐదున్నర వేల కోట్ల రూపాయల విలువ చేసే బాల్కోను కేవలం 551 కోట్లకే తెగనమ్మివేసింది. అలాగే 2200 కోట్ల విలువ చేసే మాడర్న్ ఫుడ్స్‌ను 150 కోట్లకే వేలం వేశారు. 80 వేల కోట్ల రూపాయల విలువ చేసే మహారాష్ట్ర విద్యుత్ బోర్డును కేవలం 30 వేల కోట్లకే అమ్మే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే సరళిని అనుసరిస్తూ విద్యుత్ బోర్డులను, రవాణా సంస్థలను ప్రైవేటు కంపెనీలకు అమ్మేసే ప్రక్రియను చాలా వేగంగా కొనసాగిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఒక నదిని కూడా అమ్మేశారు. ఈ ప్రజా వ్యతిరేక చర్యల పట్ల గతంలో ప్రతిపక్ష పార్టీలైనా పైపై వ్యతిరేకతను కనబర్చేవి. ఆఖరుకు కాంగ్రెస్ నూతన ఆర్థిక విధానాల సృష్టికర్తే అయినప్పటికీ బిజెపి బాల్కోను తెగనమ్మినప్పుడూ, మరి కొన్ని సందర్భాల్లోనూ మాటల్లోనే అయినప్పటికీ వ్యతిరేకించింది. కానీ ఇప్పుడు సరళి మారింది. ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిలు రెండూ ప్రైవేటీకరణను ప్రారంభించింది మేమంటే మేమని వాగ్వివాదానికి దిగుతూ, దేశ ప్రజలకు తలపెడుతున్న తీరని ద్రోహాన్ని కూడా మరుగుపర్చే పెద్ద కుట్రకు పాల్పడుతున్నాయి.

ఇటీవలి నెలల్లో బిజెపి ''ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్'' అంటూ పెద్ద ఎత్తున ప్రచారాన్ని ప్రారంభించింది కూడా ప్రధానంగా ఆర్థికవ్యవస్థలో అది సాధించానని చెబుతున్న అభివృద్ధి ఆధారంగానే. బిజెపి అంకెల గారడీయే ఇదంతా తప్ప వాస్తవాలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. తన పాలనలో 10,000 కోట్ల డాలర్ల విదేశీ మారక ద్రవ్యం పోగుపడిందని అది డబ్బా కొట్టుకుంటున్నది. నిజానికి మన దేశ ఎగుమతుల ద్వారా పోగుపడిన డబ్బు కాదిది. ఎగుమతుల్లో గానీ, విదేశీ ప్రత్యక్ష మదుపుల్లో గానీ పెద్ద పెరుగుదల ఏమీ లేకుండానే పోగుపడ్డ ఈ ధనాన్ని చూసి మురిసిపోవడమంటే వాపును చూసి బలుపనుకోవడమే. అంతర్జాతీయ వడ్డీ రేట్లకన్నా మన వడ్డీ రేట్లు మెరుగ్గా ఉండడం వల్లా, బంగారం ధరల్లో పెరుగుదల ఫలితంగానూ చేరిన డాలర్లున్నాయి. వీటినే 'హాట్ మనీ' అంటారు. రాత్రికి రాత్రే ఈ డబ్బు ఎక్కడికైనా తరలిపోగలదు. ఆర్థిక అభివృద్ధి రేటులో పెరుగుదలగా చెబుతున్నది కూడా ప్రధానంగా అనుత్పాదక రంగంలో చోటు చేసుకున్నదే. సెప్టెంబర్ 11 ఘటనల తర్వాత కుప్పగూలిన సమాచార సాంకేతిక రంగం కాస్త పుంజుకోవడం వంటి తాత్కాలిక కారణాల వల్లా, గత సంవత్సరం కొన్ని ప్రాంతాలలో వర్షాలు బాగా కురవడం వల్లా వచ్చినట్టు కనిపిస్తున్న ఈ అభివృద్ధి నిజమైంది కాదు, నిలకడైంది కాదు. "అంతా ఆనందమయమే" అయితే దేశంలో ఆకలి చావులెందుకు ఆగకుండా జరుగుతున్నాయో బిజెపి చెప్పదు. వరుసగా అనేక ఏళ్లుగా కరువుకాటకాలు నెలకొనడానికి కారణాలేమిటో అది చెప్పదు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవలి సంవత్సరాల్లోనే విపరీతంగా ఎందుకు పెరుగుతున్నాయో

అది మాట్లాడదు. విదేశీ అప్పు 5 లక్షల కోట్లను దాటిపోయిన విషయాన్ని అది తెర మరుగు చేస్తుంది. నిరుద్యోగుల ఊసెత్తదు. కానీ అంకెల గారడీలతో ప్రజలను మోసం చేసి ఎలాగైనా రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారం సంపాదించాలని బిజెపి ప్రచార దుమారాన్ని ప్రారంభించింది. ఇందుకోసం అది చాలా పకడ్బందీగా ''మిషన్ 2004''ని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం సాధించిన ఉత్తుత్తి అభివృద్ధిని గోరంతలు కొండంతలు చేసి ప్రచారం చేయడానికి అది వందల కోట్ల ప్రజా ధనాన్ని ప్రత్యేకంగా కేటాయించింది. తాను అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అది ''100 రోజుల ఎజెండా'', ''నెల రోజుల ఎజెండా'' వగైరా పేర్లతో ఓటర్లను మాయజేసి వెంటనే తమ బుట్టలో వేసుకునే చౌకబారు ఎత్తులెన్నో వేస్తున్నది.

దేశ ప్రయోజనాల గురించి చింతించే ప్రజలంతా పాలకుల కుట్రలనూ, జిమ్మిక్కులనూ అర్థం చేసుకోవల్సిన అవసరం ఉంది. **మన దేశంలోంచి సామ్రాజ్యవాదులనూ, వాళ్ల దళారులనూ తన్ని తరిమేసి స్వంత కాళ్లపై నిలబడే నూతన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోకుండా మన దేశం నిజమైన అభివృద్ధిని సాధించలేదు. అందరికీ కూడు, గూడు, గుడ్డ, గౌరవప్రదమైన ఉపాధి, విద్యా, వైద్య సదుపాయాలు లభించి దోపిడీ, పీడనలకు ఎలాంటి అవకాశం లేని వ్యవస్థ ఏర్పడిన నాడే నిజమైన అభివృద్ధి.** ఈ అభివృద్ధిని సాధించాలంటే దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాయుద్ధంలో మీ వంతు భాగస్వామ్యాన్ని నెరవేర్చడం ఈనాటి తక్షణ అవసరం. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించి, గ్రామీణ ప్రాంతాలను కేంద్రంగా చేసుకొని సాగుతున్న ప్రజాయుద్ధంతో మమేకమై నూతన వ్యవస్థ నిర్మాణానికి నడుం బిగించాల్సిందిగా మేం మీ అందరికీ పిలుపునిస్తున్నాం.

## ప్రజా ఉద్యమాలపై పంజా విసురుతున్న ఫాసిస్టు బిజెపి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజలు అనేక విషమ సమస్యలెదుర్కొంటున్నారు. అన్ని సెక్షన్ల ప్రజలు వీటికి వ్యతిరేకంగా ఉద్యమ బాటను చేపడుతున్నారు. ప్రజల నిరసన జ్వాలలను అణచడానికి నిర్బంధాన్ని ప్రయోగించడంలో బిజెపి తనకన్నా ముందటి ప్రభుత్వాలను మించిపోయింది. ఒకప్పుడు కాంగ్రెస్ టాడా చట్టాన్ని తీసుకొస్తే, బిజెపి ఇప్పుడు అంతకన్నా పదింతలు అప్రజాస్వామికమైందీ, ప్రమాదకరమైందీ అయిన పోటాను అమలులోకి తెచ్చింది. అయితే ప్రజా ఉద్యమ ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం టాడాను ఎత్తివేసిన్నాడు బిజెపి వ్యతిరేకించిందన్న విషయం గమనార్హం. డబ్ల్యుటీసీ, పెంటగాన్‌లపై దాడుల తర్వాత అమెరికా ప్రారంభించిన ''ఉగ్రవాద వ్యతిరేక ప్రపంచవ్యాప్త క్యాంపెయిన్''లో ఎన్‌డిఏ ప్రభుత్వం చాలా దూకుడుగా పాలు పంచుకుంటున్నది. కాశ్మీరీ ప్రజల ఊచకోత ఆగకుండా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికి 80 వేలకు పైగా కాశ్మీరీయులు ప్రభుత్వ హత్యాకాండకు బలయ్యారు. 2002లో అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం విచ్చలవిడి హత్యాకాండకూ, అవకతవకలకూ పాల్పడినప్పటికీ అత్యధిక శాతం ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. కానీ ప్రభుత్వం మాత్రం ప్రజలపై తాను సాగించిన నిర్బంధాన్ని మరుగుపరుస్తూ ప్రజాస్వామ్యానికి ఘన విజయం ఇదని ప్రచారం చేస్తోంది.

ఈశాన్య ప్రాంతంలోని అనేక జాతీయ ఉద్యమ సంస్థలను చర్చల పేరుతో పక్కదారి పట్టించి లొంగతీసుకోవడంలో కూడా బిజెపి ఓ మేరకు విజయం సాధించింది. ఒక పక్క లొంగదీసే ప్రయత్నాలు చేయడం, బూటకపు అభివృద్ధి పథకాలను అమలు చేయడం, పోరాడేవాళ్లను హతమార్చడం అనే విధానాన్ని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఇటీవల భూటాన్ ప్రభుత్వంతో చేతులు కలిపి ఉల్ఫా తదితర మిలిటెంట్ గ్రూపులపై తీవ్రమైన దాడుల్ని జరిపించి వందల మందిని హతమార్చింది.

ఇకపోతే విప్లవోద్యమంపై ఎన్‌డిఏ ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. నక్సలైటు ఉద్యమం గల తొమ్మిది రాష్ట్రాలతో జాయింట్ ఆపరేషనల్ కమాండ్‌ను ఏర్పాటు చేసి తరచుగా పోలీసు అధికార్లతోనూ, మంత్రులతోనూ సమావేశాలు జరిపి విప్లవోద్యమాన్ని తుదముట్టించాలని పడరాని పాట్లు పడుతోంది. బిజెపి అధికారం గల రాష్ట్రాలకూ, ఎన్‌డిఏ భాగస్వాముల అధికారం గల రాష్ట్రాలకు అడిగిందే తడవుగా విపరీతమైన డబ్బు, తదితర సహాయాన్ని అందిస్తోంది. కాంగ్రెస్ పార్టీ నక్సలైట్లతో కుమ్మక్కైందన్న దుష్ప్రచారాన్ని ఒక పథకం ప్రకారమే తీవ్రతరం చేసింది. డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ ఎన్నికల సందర్భంగానూ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనూ బిజెపి, తెలుగుదేశం పార్టీలు దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలన్నీ పక్కకు పెట్టి నక్సలిజాన్నీ, ఉగ్రవాదాన్నీ అతి పెద్ద ప్రమాదంగా చూపుతూ తాము కొనసాగిస్తున్న అణచివేత చర్యలకు సాధికారతను పొందాలని ప్రయత్నిస్తున్నాయి. భవిష్యత్తులో విప్లవోద్యమంపై అమలు జరపబోయే పాశవికమైన ఫాసిస్టు అణచివేతకూ, హత్యాకాండలకూ ఆమోదం పొందాలనే పాలకవర్గాలు ఈ విధంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారానికి దిగుతున్నాయి. అసలు ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కానందువల్లే వివిధ ఉద్యమాలు కొనసాగుతున్నాయన్న వాస్తవాన్ని మరుగుపర్చాలని ప్రయత్నిస్తున్నాయి. పైకి మాత్రం అప్పుడప్పుడు నక్సలిజం సామాజిక, ఆర్థిక సమస్య అని వల్లిస్తూనే వాస్తవంలో మాత్రం దీన్ని పూర్తిగా శాంతిభద్రతల సమస్యగానే చూస్తూ దమనకాండ కొనసాగిస్తున్నారు. నక్సలైటు ఉద్యమం కొనసాగుతున్న ప్రతి రాష్ట్రానికి కేంద్ర రిజర్వు పోలీసు బెటాలియన్లను ఏర్పాటు చేసుకోవడానికి సహాయం చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. బూటకపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, చిత్రహింసలు, మహిళలపై అత్యాచారాలు ఉద్యమ ప్రాంతాలలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి అండతో చంద్రబాబు ప్రభుత్వం విచ్చలవిడి హత్యాకాండలకు పాల్పడుతున్నది. విప్లవోద్యమ అణచివేతకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక నమూనాగా తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు పాలనలో 1475 మంది విప్లవకారులనూ, ప్రజలనూ పోలీసులు పొట్టనబెట్టుకున్నారు. పోరాటకారులనూ, సానుభూతిపరులనూ, సాధారణ ప్రజలనూ పాలకవర్గాలు తమ ఫాసిస్టు కోర్టుల ద్వారా కూడా శిక్షిస్తున్నాయి. బీహార్, ఝార్ఖండ్ రాష్ట్రాలలో భూస్వామ్య పీడకులపై ప్రజలు జరిపిన వీరోచిత దాడుల కేసుల్లో కొందరికి ఉరిశిక్ష కూడా విధించారు. ఈ విధంగా చేయడం ద్వారా రైతాంగంపై భూస్వామ్య పీడన, అణచివేతలను యథావిధిగా కొనసాగించగలమని పాలకులు భ్రమపడుతున్నారు. అయినా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు పట్టు విడవకుండా పోరాడుతున్నారు. మా పార్టీ సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], మా సోదర పార్టీ ఎంసిసిఐల నాయకత్వంలో సంఘటితమై ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పే దిశగా ధైర్యంగా ముందడుగు వేస్తున్నారు.

## బిజెపి పాలనలో పడగవిప్పి బుసకొడుతున్న హిందూ మతోన్మాదం

2002లో గుజరాత్‌లో జరిగిన అమానుష హత్యాకాండ భారత చరిత్రలోనే మాయని మచ్చగా నిలిచిపోతుంది. దేశ విభజన సమయంలో జరిగిన హత్యాకాండనూ, అత్యాచారాలనూ మరిపించేలా సంఘ్ ముఠా పథకం ప్రకారం సాగించిన హత్యాకాండలో 2,500 మందికి పైగా ముస్లిం ప్రజలు ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది నిలువ నీడ లేకుండా అయ్యారు. అనేక మంది మహిళలపై సామూహిక అత్యాచారాలు జరిపారు. గోధ్రాలో సంఘ్ ముఠా కార్యకర్తలు ప్రయాణిస్తున్న రైలుకు ముస్లింలు నిప్పు పెట్టారన్న సాకుతో ప్రారంభించి, పథకం ప్రకారం కొనసాగించిన ఈ హత్యాకాండలో నరేంద్ర మోది మంత్రివర్గంలోని చాలా మంది

మంత్రులు, పోలీసు అధికార్లు, ప్రభుత్వాధికార్లు స్వయంగా పాల్గొన్నారన్న వాస్తవం ఈ వ్యవస్థ ఎంత ఫాసిస్టుగా మారిందో తెలియజేస్తుంది. త్రిశూలధారులైన కాషాయ మూకలు అనేక మసీదులనూ, ఇతర చారిత్రక చిహ్నాలనూ, సమాధులనూ ధ్వంసం చేశాయి. గుజరాత్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో క్రైస్తవులపైనా, చర్చిలపైనా, మత గురువులపైనా, సన్యాసినులపైనా కూడా దాడులు జరిగాయి. ఒరిస్సాలో గ్రాహం స్టైన్స్, అతని కుమారులిద్దరినీ సజీవంగా కాల్చి చంపిన దారాసింగ్ విశ్వ హిందూ పరిషత్ కార్యకర్త. సంఘ్ ముఠా మధ్యప్రదేశ్‌లో భోజ్‌శాల, కర్నాటకలో బాబా బుడాన్‌గిరిలలో ముస్లింల ప్రార్థనాస్థలాలను కూలగొట్టి హిందూ దేవాలయాలను నిర్మించాలని ప్రజలను రెచ్చగొడుతున్నది. రెండు మతాల ప్రజల మధ్య విద్వేషాగ్నిని రాజేస్తున్నది.

హిందుత్వ ఎజెండాను పక్కన బెట్టాననీ, ఎన్‌డిఏ ఉమ్మడి ఎజెండాకు మాత్రమే కట్టుబడి ఉన్నానని చెబుతూనే బిజెపి తన హిందుత్వ ఎజెండాను కూడా పథకం ప్రకారమే కొనసాగిస్తున్నది. రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, ఉమ్మడి పౌరస్మృతి వంటి అంశాలను పక్కన బెట్టానని చెప్పుకుంటున్న బిజెపి నాయకులు వివిధ వేదికలపై రామమందిర నిర్మాణానికి కట్టుబడే ఉన్నామని ప్రకటిస్తున్నారు. తాజాగా ఎన్నికల ప్రచారం మొదలుపెడుతూ వాజపేయి కూడా రామమందిర నిర్మాణం చేసి తీరుతామని ప్రకటించాడు. ప్రజల భావాలను బట్టి బిజెపి ఎప్పటికప్పుడు మాట మారుస్తూ, పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు చేస్తూ దేశంలో మతోన్మాదాన్ని ఒక పథకం ప్రకారమే రెచ్చగొడుతోంది.

ఆదివాసులపై సంఘ్ ముఠా దాడులు తీవ్రమయ్యాయి. వివిధ ఆశ్రమాల ద్వారా ఆదివాసులను హిందువులుగా మార్చే ప్రక్రియ పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. సంఘ్ శాఖలు, వాటి కార్యకర్తలు మూలమూలనా ప్రవేశిస్తూ హిందుత్వవాదానికి బలమైన పునాదిని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో క్రైస్తవాన్ని స్వీకరించిన ఆదివాసులను ప్రలోభ పెట్టి ''ఘర్ వాపసీ'' పేరుతో హిందూ మతంలోకి లాగుతున్నారు. ఏ మతానికీ చెందని ఆదివాసులను హిందువులుగా చిత్రిస్తూ తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారు.

ఫాసిజాన్ని వ్యవస్థీకృతం చేసే పెద్ద కుట్రలో భాగంగా పాఠ్యాంశాలలో లౌకికవాద భావనలను తొలగించి హిందుత్వ భావజాలాన్ని నింపుతూ విద్యార్థులను తరగతి గదుల్లోంచే ఛాందసవాదులుగా తయారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా బిజెపి అధికారం చేపట్టిన రాష్ట్రాలలో ఇది కొట్టొచ్చినట్టు కనిపిస్తుండగా, కాంగ్రెస్ కుహనా లౌకికవాదం, రివిజనిస్టు పార్టీల మెతక లౌకికవాదాల పుణ్యమా అని ఇతర రాష్ట్రాలకు కూడా ఇది వ్యాపిస్తోంది. చరిత్రను వక్రీకరించి రాస్తున్నారు. ప్రగతిశీల సాహిత్యాన్ని సిలబస్‌లోంచి తొలగిస్తున్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం చరిత్ర కాంగ్రెస్ సహా ముఖ్యమైన అకాడమిక్ సంస్థల నుండి లౌకికవాద, ప్రజాస్వామ్య భావాలు గలవారిని తొలగించి సంఘ్ ముఠా సమర్థకులను చేర్చుకుంటోంది. ఇలా హిందూ ఫాసిజాన్ని పకడ్బందీగా వ్యవస్థీకృతం చేస్తూనే అవసరమైన చోట తన గూండా గ్యాంగులను, శివసైనికులను వినియోగించి పాశవిక దాడులు కూడా చేయిస్తోంది. ఇటీవల పూనేలోని ఒక గ్రంథాలయంపై జరిగిన దాడినీ, ఎంఎఫ్ హుస్సేన్ చిత్ర ప్రదర్శనపై దాడినీ, తమకిష్టం లేని సినిమా షూటింగ్‌లను నిలిపివేసిన ఘటనలనూ – ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

బిజెపి అనుసరిస్తున్న హిందూ ఫాసిస్టు విధానాలకు అంతర్జాతీయంగా అమెరికన్ సామ్రాజ్యవాదం మద్దతు ఉంది. దక్షిణాసియా ప్రాంతంలో జూనియర్ సూపర్ పవర్‌గా ఎదగాలనే భారత పాలకవర్గాల ఆకాంక్షలకు బిజెపి ప్రాతినిధ్యం వహిస్తోంది. దక్షిణాసియాలోని ప్రజా ఉద్యమాలకూ, విప్లవోద్యమాలకూ భారత విస్తరణవాదం పెద్ద ముప్పుగా తయారైంది. మన పొరుగు దేశమైన నేపాల్‌లో మావోయిస్టుల నాయకత్వంలో ఉధృతంగా సాగుతున్న ప్రజాయుద్ధాన్ని అణచివేయడానికి భారత ప్రభుత్వం అక్కడి అభివృద్ధి నిరోధక రాచరిక ప్రభుత్వానికి వీలైన సహాయమంతా చేస్తున్నది. మన మరో పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో గత ఐదేళ్లలో అనేక సార్లు యుద్ధం చేసినట్టే చేసి విరమించుకుంది. పాకిస్తాన్ బూచిని చూపి వేల కోట్ల రూపాయల్ని ఖర్చు చేస్తూ తన యుద్ధ సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచుకుంటోంది. అమెరికాకు నమ్మినబంట్లుగా ఉన్న భారత్, పాకిస్తాన్‌లు రెండూ చీటికి మాటికి కయ్యానికి కాలు దువ్వడం, మరుక్షణమే స్నేహానికి చేయి చాచడం ఇటీవలి నెలల్లో ఒక ప్రహసనంగానే మారింది. ఈ రెండు దేశాల మార్కెట్లనూ తమ గుప్పిట్లో ఉంచుకోవడం కోసం, ఇంకా ఈ ప్రాంతంలో తమ వ్యూహాత్మక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం సామ్రాజ్యవాదులు ఈ రెండు దేశాల పాలకుల జుట్లను తమ చేతిలో ఉంచుకొని కోతుల్లా ఆడిస్తున్నారన్నది నగ్నసత్యం. ఈ రెండు దేశాల్లోనూ నెలకొన్న సంక్షోభం మూలంగా రెండు దేశాల పీడిత ప్రజలు చెప్పనలవి కాని ఇక్కట్లకు గురవుతూ జీవనం గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలలో పెంపొందుతున్న అశాంతి సామాజిక విప్లవానికి దారితీయకుండా ఉండాలనే ఈ రెండు దేశాల పాలకవర్గాలు తమ తమ దేశాల ప్రజలను ఒకరిపై ఒకరిని ఎగదోస్తూ ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు.

బిజెపి పాలనలో పెచ్చరిల్లిపోయిన హిందూ ఫాసిజం మూలంగా మతపరమైన మైనారిటీల, ఆదివాసుల అస్తిత్వమే ప్రమాదంలో పడింది. నిజమైన లౌకికవాదులపైనా, ప్రగతిశీల భావాలు గల రచయితలపైనా, మేధావుల పైనా తీవ్రమైన దాడులు సాగుతున్నాయి. **కనుక దేశంలోని ప్రజాస్వామిక వాదులంతా, నిజమైన లౌకికవాదులంతా, మైనారిటీ మతాల ప్రజలంతా, ఆదివాసులంతా హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల వేదికపైకి రావల్సిన అవసరం ఎంతో ఉంది.** ఈ సందర్భంగా మేం మీ అందరికీ వచ్చే లోక్‌సభ ఎన్నికలను నిర్ద్వంద్వంగా బహిష్కరించి దేశంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం కావాలనీ, జాతులకూ సమాన హక్కుల్ని గ్యారంటీ చేసే, కుల పీడననూ, లైంగిక వివక్షనూ రద్దు చేసి ఎలాంటి అసమానతలు ఉండని ఒక కొత్త వ్యవస్థ నిర్మాణానికై ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## ఎన్నికలను బహిష్కరించి "జనతన సర్కార్" నిర్మాణాలను పెంపొందించుకుంటూ, బలోపేతం చేసుకుంటూ ప్రజాయుద్ధాన్ని నూతన స్థాయికి పురోగమింపజేయడమే నిజమైన ప్రత్యామ్నాయం!

ఇప్పటికి ఎన్నో సార్లు ఎన్నికలు జరిగి, ఎందరో మంత్రులూ, ప్రధానులూ అయ్యారు. ప్రతి పార్టీకీ ఎప్పుడో ఓసారి ఏదో మేరకు అధికారం దక్కింది. అధికారంలోకి వచ్చిన ప్రతి నాయకుడూ లెక్కలేనన్ని అవినీతి కుంభకోణాలకు పాల్పడి కోట్ల కొద్ది ప్రజల డబ్బును కొల్లగొట్టిన వాడే. తాను ''క్లీన్'' పార్టీనని బిజెపి ఎంతగా డబ్బా వాయించుకున్నప్పటికీ తాజాగా జూదేవ్ ఉదంతంతో దాని స్వచ్ఛత ఎలాంటిదో ప్రజలు కళ్లారా చూశారు. కాంగ్రెస్ పాలనలో బోఫోర్స్ కుంభకోణం, హవాలా కుంభకోణం, సెక్యూరిటీల కుంభకోణం, యూరియా కుంభకోణం వంటివి బైటపడగా, గత ఐదేళ్ల పాలనలో శవపేటికల కుంభకోణం, రక్షణ శాఖ కొనుగోళ్ల కుంభకోణం, తహల్కా కుంభకోణం, పెట్రోల్ పంపుల కుంభకోణం, తాజాగా జూదేవ్ కుంభకోణం, స్టాంపు పేపర్ల కుంభకోణాలతో పాటు మరెన్నో వెలుగు చూశాయి. మరెన్నో వెలుగు చూడకుండానే మరుగున పడిపోయాయి. కానీ ప్రజలకు మాత్రం ఆకలి, కరువు, దారిద్ర్యం, నిరుద్యోగం, ఆత్మహత్యలు – ఇవే దక్కాయి. కనుక ఎన్ని సార్లు ఓట్లేసినా మన బతుకెందుకు మారడం లేదో, మన మౌలిక సమస్యల పరిష్కారం ఎందుకు కావడం లేదో ప్రజలంతా తప్పక ఆలోచించాలి.

మన దేశాన్ని పరిపాలిస్తున్నది భూస్వామ్య, దళారీ బూర్జువా వర్గాలకు చెందినవాళ్లే. వీళ్ల పార్టీలే బిజెపి, కాంగ్రెస్, జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, బిఎస్‌పి, తెలుగుదేశం, డిఎంకె, అన్నా డిఎంకె – ఇవన్నీ. వీళ్లందరూ

ప్రాతినిధ్యం వహించేది ఈ దోపిడీ వర్గాలలోని వివిధ ముఠాలకు మాత్రమే. వీళ్లకు సామ్రాజ్యవాదుల, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల అండదండలున్నాయి. ఎర్రజెండా ముసుగులో ఉన్న నకిలీ కమ్యూనిస్టులైన సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్‌ల మాటల్లో మాత్రమే తేడా తప్ప ఆచరణలో వీళ్లకూ ఇతర దోపిడీ వర్గ పార్టీలకు తేడా ఏమీ లేదు. అందుకే ఎన్నికల పార్టీలన్నీ దోపిడీ పార్టీలే. అంతా తోడు దొంగలే. వీరిలో ఎవరికి ఓట్లేసినా ఈ వ్యవస్థలో మౌలిక మార్పేమీ రాదు. ఎవరు గెల్చినా మన బతుకులు మారవు. వ్యవస్థ మారకుండా ఎన్నికల వల్ల ఒరిగిదేమీ లేదు. అందుకే ఈ దోపిడీ వ్యవస్థనూ, దాని అన్ని అంగాలనూ సమూలంగా మార్చడానికి విప్లవం తప్ప మరో మార్గం లేదని మేం ప్రజలకు మరోసారి విన్నవించుకుంటున్నాం. ప్రజలు సాయుధమై తమ స్వంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని పోరాడడం ద్వారానే ఈ విప్లవం జరుగుతుంది. మన దేశంలో ఈ విప్లవం దీర్ఘకాలిక పంథాలో గ్రామీణ ప్రాంతాలను ప్రధాన కార్యరంగంగా చేసుకొని ప్రాంతాల వారీగా ప్రజా రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేస్తూ దేశవ్యాపితంగా విస్తరించే క్రమాన్ని తీసుకుంటుంది. భూస్వామ్య విధానాన్ని, దళారీ బూర్జువా వర్గాన్నీ, వీటికి అండగా ఉన్న సామ్రాజ్యవాదాన్నీ కూల్చి వేసి కార్మిక-కర్షక సమైక్యతా పునాదిగా చిన్నా, మధ్యా పెట్టుబడిదారీ వర్గాలను కలుపుకొని ఏర్పడే ఐక్య సంఘటన రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుంటుంది. ఇది అత్యధికులైన శ్రామిక ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యంగానూ, పిడికెడు మంది దోపిడీదార్లకు నియంతృత్వంగానూ ఉంటుంది. ప్రజలు స్వేచ్ఛగా తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎన్నుకోవడమే కాదు, తాము ఎన్నుకున్న వ్యక్తి సరిగా పనిచేయడం లేదని భావించిన పక్షంలో తమ ఓటును వెనక్కి తీసుకొని సదరు వ్యక్తిని తొలగించే హక్కు కూడా ప్రజలకుంటుంది. ఈ ప్రజాస్వామిక పద్ధతిలో ప్రజా రాజ్యాధికార నిర్మాణ ప్రక్రియ నేడు మన దండకారణ్యంలో చురుగ్గా కొనసాగుతున్నది. అనేక గ్రామాల్లో దోపిడీ పాలనా వ్యవస్థ స్థానంలో శ్రామిక ప్రజల ఉమ్మడి అధికార సంస్థగా "జనతన సర్కార్" (ప్రజా ప్రభుత్వం) ఏర్పాటైంది. మరెన్నో గ్రామాలకు ఈ సంస్థలు విస్తరిస్తున్నాయి. మొత్తం దండకారణ్యమంతటా వీటిని విస్తరింపజేసి దండకారణ్య వ్యాప్తంగా ప్రజా రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో, అంటే విముక్తి ప్రాంతాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో నేడు ప్రజాయుద్ధం పురోగమిస్తున్నది. **మన దండకారణ్యంలో సాగుతున్న ప్రజా పోరాటం, ఇక్కడ బీజ రూపంలో ఏర్పడుతున్న ప్రజా రాజ్యాధికారం మొత్తం దేశ ప్రజలందరికీ ఆదర్శంగా, నమూనాగా నిలుస్తున్నది. దేశ ప్రజలందరూ అనుసరించాల్సిన మార్గంగా ముందుకు వస్తున్నది.**

అయితే పాలకవర్గాలు ఇక్కడి ప్రజా రాజ్యాధికారాన్ని మొగ్గలోనే తుంచి వేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వేల కొద్ది పోలీసు బలగాలను దించి మన ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నాయి. పాశవిక నిర్బంధకాండను ప్రయోగించి ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచాలని ప్రయత్నిస్తున్నాయి. పాలకులు గత డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల సందర్భంగా వేలాది సిఆర్‌పి బలగాలను దించి బస్తర్ ప్రాంతంలో యుద్ధ వాతావరణాన్ని నెలకొల్పారు. సైనిక హెలికాప్టర్లు తెచ్చి గగనతలంలోంచి గస్తీ నిర్వహించారు. అయినా ప్రజలు లెక్క చేయకుండా ప్రజాయుద్ధాన్ని దృఢంగా కొనసాగించారు. ఎన్నికలను పెద్ద ఎత్తున బహిష్కరించారు. పిజిఏ గెరిల్లాలు అనేక ప్రతిఘటనా చర్యలను నిర్వహించి సిఆర్‌పి బలగాలను నిద్రపోనివ్వకుండా చేశారు. అయితే ఎలాగైనా పోలింగ్ శాతాన్ని ఎక్కువ చేసి చూపించాలని ముందే నిర్ణయించుకున్న ప్రభుత్వ, పోలీసు అధికార్లు చాలా గ్రామాలకు రాకుండానే తామే ఓట్లు వేసి ఎన్నికల తంతు నిర్వహించారు. మరెన్నో పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక సంఖ్యాకులు ఓట్లను బహిష్కరించగా అధికార్లే మిగిలిన ఓట్లన్నీ వేసుకొని పోలింగ్ శాతాన్ని పెంచారు. దీన్నే 'బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం'గానూ, 'ఎన్నికల బహిష్కరణ పిలుపు విఫలమైంద'నీ అంటూ ప్రచారం చేశారు. కానీ వాస్తవంగా జరిగిందేమిటో దండకారణ్య ప్రజలకు బాగా తెలుసు. **ఈ లోక్‌సభ ఎన్నికలను కూడా గత అనుభవాల వెలుగు మరింత పట్టుదలతో బహిష్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజల ప్రజాస్వామిక హక్కైన ఎన్నికలను బహిష్కరించే హక్కును కాలరాచి వేస్తూ అత్యాచారాలనూ, హింసనూ ప్రయోగించే ప్రభుత్వ సాయుధ బలగాలను దృఢంగా ప్రతిఘటించాల్సిందిగా, ప్రజలకు అండగా నిలవాలనీ మేం ప్రజా గెరిల్లా యోధులనూ, కమాండర్లనూ కోరుతున్నాం.**

- ➢ *బూటకపు ఎన్నికలను బహిష్కరించి గ్రామగ్రామాన "జనతన సర్కార్ల"ను నిర్మిస్తూ వాటిని బలోపేతం చేద్దాం !*
- ➢ *ప్రజా గెరిల్లా సైన్యం నాయకత్వంలో పాశవిక పోలీసు నిర్బంధాన్ని ధైర్యంగా ప్రతిఘటిద్దాం !*
- ➢ *దోపిడీ వ్యవస్థను కూలదోసి ప్రజల ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పర్చడానికి ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేద్దాం !*
- ➢ *హిందూ ఫాసిస్టు మూకలను ధ్వంసం చేద్దాం! హిందూ మతోన్మాద బిజెపికి తగిన గుణపాఠం నేర్పుదాం !*
- ➢ *ఓట్ల పార్టీలన్నీ బడా భూస్వాముల, బడా పెట్టుబడిదార్ల కొమ్ముగాసే దోపిడి దొంగల పార్టీలే ! ఓట్ల కోసం వచ్చే దోపిడీ పార్టీలన్నిటినీ తన్ని తరమండి !*
- ➢ *పిడికెడు మంది దోపిడీ దొంగల అభివృద్ధి కాదు "ఫీల్ గుడ్" – ప్రజలందరికీ కూడూ, గూడూ, గుడ్డా, విద్యా, వైద్యం, ఉపాధీ తదితరాలన్నీ సమకూరిన నాడే నిజమైన "ఫీల్ గుడ్"!*
- ➢ *నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!*

*విప్లవాభినందనలతో...*

స్పెషల్ జోనల్ కమిటీ,

**సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]**

**తేదీ : *ఫిబ్రవరి 20, 2004*** **దండకారణ్యం**

# నిర్బంధ కొలిమిలో ఉడుకుతున్న తెలంగాణా – మానసిక యుద్ధంలో నలుగుతున్న జనం

భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) [పీపుల్స్‌వార్] నాయకత్వంలో తెలంగాణలో గత 30 సంవత్సరాలకు పైగా విప్లవోద్యమం కొనసాగుతూ పురోగమిస్తోంది.ఒకనాడు గ్రామాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నిర్వహించిన జనం ఈనాడు విముక్తి ప్రాంత లక్ష్యంతో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రం చేస్తూ 'రాజ్యం'తో దృఢంగా పోరాడుతున్నారు. ఆ వీర ప్రజానీకం తొలినుండి నిప్పులు చెరిగే నిర్బంధం మధ్యనే తమ న్యాయమైన విప్లవ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. 1945-51 నాటి వీర తెలంగాణ విప్లవ రైతాంగ పోరాటాల గుణపాఠాల వెలుగులో నూతన అనుభవాలను సంతరించుకుంటున్నారు. ఒకనాడు భూస్వామ్య గుండాల హంతక దాడులను ప్రతిఘటించాల్సి వస్తే, ఇవాళ అన్ని హంగులు కలిగిన భూస్వామ్య, జాగీర్దార్ల రక్షణకై వచ్చిన రాష్ట్ర, కేంద్ర బలగాలతో నిశ్చయంగా తలపడుతున్నారు.

పోరాడుతున్న తెలంగాణ ప్రజానీకంపై నిర్బంధ-అణచివేత దారుణంగా అమలవుతోంది. ఏనాటికానాడు నూతన రూపాలలో, నూతన పద్ధతులలో ఫాసిస్టు నిర్బంధాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలుచేస్తోంది. నేడు మన దేశంలోని అతి పాశవికమైన బలగాలలో గ్రేహౌండ్స్‌నే ముందుగా చెప్పుకోవాలి. దీని అధికారులు దేశ-విదేశాలలో ప్రత్యేక శిక్షణను పొందుతూ తమలాగే మిగతా రాష్ట్రాల బలగాలను తీర్చిదిద్దడానికి పూనుకుంటున్నారు. ఒకనాటి తెలంగాణ నైజాం రజాకార్లు గానీ, నాజీ గెస్టోపోలు గానీ ఆంధ్ర గ్రేహౌండ్స్ ముందు బలాదూరేననీ ఈ బలగాలు తమ దుర్మార్గాలను చరిత్రలో రికార్డు చేసుకుంటున్నాయి. ఆంధ్ర పోలీసుల దాడులలో వందలాది మంది విప్లవకారులు (పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా గెరిల్లా సైనికులు, విప్లవ సానుభూతిపరులు, సాధారణ ప్రజలు) అసువులు బాసారు. నిర్దిష్టంగా చెప్పాలంటే గత 8 సంవత్సరాల ఒక్క తెలుగుదేశం పరిపాలనలోనే 1,475 మందికి పైగా విప్లవకారులను ఆంధ్ర పోలీసు బలగాలు పొట్టన బెట్టుకున్నాయి. ఇందులో మన ప్రియమైన నాయకులు కా.శ్యాం, మహేశ్, మురళీల నుండి రామకృష్ణ, అనుపమ కొమరయ్య, పద్మ, లలిత,విద్య ల వరకు ఎందరెందరో ఉన్నారు. వీరందరి త్యాగాలను సగర్వంగా ఎత్తిపడుతూ, వారి స్మృతిలో వినమ్రంగా విప్లవ జోహార్లర్పిద్దాం. తెలంగాణా విప్లవోద్యమానికి, వీర తెలంగాణా విప్లవ ప్రజానీకానికి పూర్తి అండగా నిలుద్దాం. ఆంధ్ర, దండకారణ్యాల మధ్య విడతీయలేని పోరాటా లనుబంధాన్ని బలమైన ప్రతిఘటనోద్యమాల ద్వారా నిరూపిద్దాం.

- ★ **ఆంధ్రప్రదేశ్ విప్లవ ప్రజానీకంపై అమలవుతున్న చంద్రబాబు నాయుడి ప్రభుత్వ పాశవిక నిర్బంధకాండను ఖండించండి!**
- ★ **ఆంధ్ర పోరాట ప్రజలారా! మీ వెంట మేమున్నామంటూ నినదిద్దాం!**
- ★ **మార్చ్ 17-23 వరకు ఆంధ్ర పోరాట ప్రజానీకానికి సంఘీభావంగా, అక్కడి నిర్బంధాన్ని ఖండిస్తూ నిరసన వారం పాటించండి!**
- ★ **మార్చ్ 23 దండకారణ్యా బంద్ పాటించండి – పోటాను తిప్పికొట్టండి!**

**– *డికెఎస్‌జడ్‌సి***

నేడు తెలంగాణలో ఏ ప్రజలకు ప్రజాస్వామ్య హక్కులు లేవు. పౌరుల కెలాంటి రక్షణ లేదు. అడవులు, మైదానాలు, పల్లెలు, వీధులు, పట్టణాలు నిర్బంధం నీడలో కుములుతున్నాయి. ఖాకీల చూపు సోకని, ఉక్కుపాదం మోపని పల్లె కానరాదు. అత్యాచారాలకు, హంతక దాడులకు గురికాని కొంప లేదు. అరెస్టుల నుండి మాయం చేయడం వరకు, అత్యాచారం నుండి కాల్చిచంపే వరకు ఏ అఘాయిత్యం ఎప్పుడు, ఎక్కడ విరుచుకుపడుతుందో తెలువని పరిస్థితిలో పల్లె జనం తన్లాడుతున్నారు. రైతు కూలీలు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యప్రియులు ఎవరన్నది లేకుండా పోలీసుల సన్నీల ముందు అందరూ దోషులవుతున్నారు. స్త్రీ-పురుషులు; చిన్నా పెద్ద తేడా లేకుండా జనం అంతా ఈనాడు నేరస్థులే - విప్లవ క్యాంపుకు చెంది పోలీసు ప్రవంతిని సవాలుచేసే అనుమానాస్పదులే. వీరిపై అమలవుతున్న నిర్బంధ-అణచివేత రూపాలలో కొన్ని ముఖ్యమైన వాటి గూర్చి తెలుసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే ఆ పోలీసులే దేశంలోని కమాండోలకు, ప్రత్యేక బలగాలకు ప్రత్యేక శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతున్నందునా, ఆ దుర్మార్గాలన్ని సాధారణమైపోయి వాటి భీభత్స రూపాన్ని అంతటా ప్రదర్శించనున్న నేపథ్యంలో వాటి గూర్చి తెలిసి ఉంటేనే వాటిని ఎదుర్కొని ఓడించగలం. అయితే పోలీసులనుసరించే థర్డ్ డిగ్రీ పద్ధతులు జనరల్‌గా విని ఉండడమో, అనుభవించి ఉండడమో పోరాట ప్రాంత ప్రజలందరికి తెలుసు. కాబట్టి ఇక్కడ వాటిలోకి లోతుగా వెళ్లకుండా కొన్ని విచిత్ర రూపాలనే తెలుసుకుందాం. ఎల్ఐసి లో ఇవీ భాగమేననీ వీటని సైకోవార్‌గా వ్యవహరిస్తారని అర్థంచేసుకోవడానికి ఉపయోగపడుతాయి.

ఇప్పటివరకు సాధారణంగా మనమంతా ఎరిగింది ప్రజా ప్రదర్శనలనే. ప్రజల ర్యాలీలనే. ఒక ప్రదర్శన, ఒక ర్యాలీ ఎప్పుడైనా, ఎక్కడైనా విశాల ప్రజానీకం తమ న్యాయమైన డిమాండ్లను ప్రపంచం ముందుంచడానికి పాలకవర్గాల పట్ల తమ నిరసనను తెలుపడానికి ఉద్దేశించబడి నిర్వహించబడుతుంది. ఇలాంటి సందర్భాలలో పోలీసులు శాంతిభద్రతల పేరుతో హాజరవడం కూడా మనకు తెలిసిందే. కానీ తెలంగాణాలో ఇప్పుడు పూర్తిగా దీనికి ఉల్టాగా జరుగుతోంది. చేను కంచె మేసినట్టుగానే నడుస్తోందక్కడ.

లాఠీలకు ఎప్పుడో స్వస్తిచెప్పన ఆంధ్ర పోలీసులు తమ తుపాకులతో ఊరి జనాన్నంతా ఒక దగ్గర మందవేసి, వారి చేతికి ప్లే-కార్డులు, బ్యానర్లు ఇచ్చి వరుసగా వారిని నిలబెట్టి ప్రదర్శనలను నిర్వహించడం ఒక సాధారణ విషయమైంది. ప్లే కార్డులపై, బ్యానర్లపై విప్లవకారులకు వ్యతిరేకంగా నినాదాలు రాయిస్తారు. నినాదాలన్నీ బండ బూతులతోనే నిండి ఉంటాయి. ప్రదర్శనలోనున్న వారెవరైనా నినదించకుంటే వారి వీపు చిట్లక తప్పదు. ఇలాంటి ర్యాలీలు, ప్రదర్శనలు ప్రధానంగా విప్లవోద్యమానికి అండగా నిల్చిన గ్రామాలలో, విప్లవోద్యమంలో పూర్తి కాలం పనిచేస్తున్న కార్యకర్తల గ్రామాలలోనే నిర్వహిస్తున్నారు. అలాగే ప్రజా తీర్పు ననుసరించి శిక్షలు పొందిన కుటుంబాలకు అండగా కూడా ఇలాంటివి జరుపుతున్నారు. ఈ ర్యాలీలలో, ప్రదర్శనలలో గ్రామస్థులు ఎవరు పాల్గొనకపోయినా వారి పేరు పోలీసు రికార్డులో నమోదై నిరంతరం వేధింపులకు గురవ్వాల్సి ఉంటుంది. ఆ ఇంటివాళ్లు అరెస్టు కావచ్చు, లేదా ఆ ఇంట్లో నక్సల్ సాహిత్యం దొరకవచ్చు లేదా ఆ ఇంట్లో బాంబులు, తుపాకులు లేదా ఆ ఇంటివారి దెవరిదైనా శవం గుర్తు తెలియని నక్సలైటుగా ప్రత్యక్షమవ్వనూ వచ్చు. ఇన్నింటిలో ఎన్నైనా జరగవచ్చు. అన్నింటికి ఆ కుటుంబం సిద్ధపడాల్సి ఉంటుంది. అందుకే

ర్యాలీకి పోవడమో, రానున్న ప్రమాదాలకు సిద్ధమవడమో అన్నది ఇల్లిల్లూ తేల్చుకోవల్సిన ఒక భయంకర ప్రశ్న నేటి తెలంగాణా పల్లెను వేధిస్తోంది.

ఇక్కడే మరోరకమైన ప్రదర్శనా రూపాన్ని చూద్దాం. ఏ ఊరినుండైతే పూర్తికాలం విప్లవకారులుగా విప్లవోద్యమంలో చేరి కామ్రేడ్స్ పనిచేస్తున్నారో, ఆ ఊర్లో లేదా పక్కూరి బడిపిల్లలతో ఈ ప్రదర్శన సాగుతుంది. చిన్నారి బాలల చేతులతో మళ్లీ అలాంటి ప్లేకార్డులు, బ్యానర్లు పట్టిస్తారు. ఇక్కడ నినాదాలు మారుస్తారు. విప్లవకారుల పేరు పెట్టి విప్లవోద్యమం నుండి ఇంటికి రమ్మనే నినాదాలు, జనజీవన స్రవంతిలో కలువాలనే అభ్యర్థనలు, వారి మూలంగా ఊరికి కీడు మూడిందనే నిందారోపణలను ఆ పసి హృదయాలు ససేమిరా అంగీకరించని రకరకాల నినాదాల రూపంలో వారి నోళ్ల నుండి పలికిస్తారు. నిజానికి ఆ పసిగుండెలు ఆ క్షణంలో అనుభవించే క్షోభ ఏ భాషకూ అందనిది. ఏ కలానికి సాగనిది. తమ కలల్లో సహితం కలవరించే తమ అన్నల/అక్కల అపురూప జ్ఞాపకాలను స్మరించుకుంటూనే అందుకు పూర్తి భిన్నమైన నినాదాలను ఇవ్వాల్సివచ్చే ఆ చిన్నారుల గుండెల్లో రగిలే కసికి ఏనాటికైనా పోలీసులు తగిన మూల్యం చెల్లించకుండా ఎలా పోతారు?

అలాగే ఇంకోరకమైన ప్రదర్శనకు వస్తే ఇవి ప్రజా వ్యతిరేక శక్తుల తరపున వకాల్తా పుచ్చుకునే ప్రదర్శనలు. జనం తీర్పుననుసరించి పిజిఏ చేతిలో దేహశుద్ధికో, చావుకో గురైన వారి తరపున పూర్తి బందోబస్తుతో సాగుతుంది ప్రదర్శన. ఇక ఆపై తంతు అంతా షరా మామూలే. ప్లే కార్డులు, బ్యానర్లు, నినాదాలు ఎలాగు ఉంటాయి. వరంగల్ జిల్లా చల్లగరిగె గ్రామంలో షరీఫ్ అనే (వీడు ఒక ఇన్‌ఫార్మర్) వాన్ని చంపినాక పోలీసులు ఇలాంటి ర్యాలీ ఒకటి తీశారు.

మాజీ నక్సలైట్లను, పోలీసుల నిర్బంధానికి జడిసి తమ బతుకు తాము బతకాలని తలచి సంగాల నుండి వైదొలగిన వారిని, విప్లవకారుల కుటుంబాలను, సానుభూతిపరులను గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలకు ముందుంచుతారు. ప్రదర్శన స్వభావాన్ని బట్టి పోలీసులు సివిల్/డ్రెస్సులో ఉంటారు. ఫోటోగ్రాఫర్లు, పత్రికా (పోలీసు) విలేఖర్లు తప్పనిసరి అన్ని రకాల ప్రదర్శనలకు హాజరవుతారు. ఈ ప్రదర్శనల గూర్చి తెల్లారి అన్ని పత్రికల్లో సంచలనాత్మక వార్తలు వచ్చేస్తాయి.

ఇకపోతే మరీ తెలివైన పోలీసు అధికారులు ఏకంగా వాహనాల ర్యాలీలకే తలపడుతున్నారు. ఈ అధికారులు చాలా రద్దీగా ఉండే రోడ్లపై, చాలా రద్దీగానూ సందడిగానూ ఉండే సమయాన్ని ఎంచుకొని కూడళ్ల దగ్గర ప్రత్యక్షమవుతుంటారు. ఎలాగు కూడళ్ల దగ్గర సహజంగానే ఆటోలు, టాక్సీలు, రిక్షాలు ఉంటుంటాయి. ఇక సందడి సమయం కాబట్టి ఆ టైంలో ఈ అధికారులు తమ పటాటోపంతో బెదిరించి ట్రాఫిక్‌ను బంధించేస్తారు. అరగంటో, గంటో గడిచేసరికి రోడ్డంతా వరుసగా వాహనాలు స్తంభించిపోతాయి. (ఈ అధికారిక అక్రమ చెక్కాజాలు ఏ లెక్కలోకి ఎక్కించే సాహసం చేసేవారు ఉండరక్కడ). దీనితో, అధికారులు తమ వెంట తెచ్చిన బ్యానర్‌ను ముందు వాహనానికి అలంకరిస్తారు. కెమెరామెన్‌లకు హుకుమ్ లిస్తారు. అంతే! తెల్లారి తాటికాయంత అక్షరాలతో, జిల్లా ఎడిషన్‌లో ముందు పేజిలో అనేక కథనాలతో వార్త వెలువడుతుంది. అధికార్ల హోదాను, పలుకుబడిని బట్టి ప్రసార సాధనాలకు కూడా వార్తలు విడుదలవుతుంటాయి.

ప్రదర్శనల తీరు ఇలా ఉంటే, దిష్టిబొమ్మల దగ్ధం ఎలా సాగుతుందో చూద్దాం. ఇప్పటివరకు దిష్టి బొమ్మల దగ్ధం అంటే పరమ ప్రజాపీడకులైన, అతి పెద్ద దోపిడిదారులైన క్లింటన్, బుష్, వాజపాయ్ లాంటి వాళ్ల దిష్టిబొమ్మలను దుర్మార్గ పోలీసు అధికారుల, అవినీతి అధికారుల దిష్టి బొమ్మలను దగ్ధం చేయడం వరకు జనాలెరుగుదురు. కానీ, నేడు తెలంగాణ పల్లెల్లో విప్లవకారుల దిష్టిబొమ్మలను పోలీసులు దగ్ధం చేస్తున్నారు. ఇక్కడొక ఉదాహరణ కూడా చూద్దాం.

వరంగల్ జిల్లా టేకులగూడెంకు చెందిన జగన్ అనే కామ్రేడ్ దీర్ఘకాలంగా విప్లవోద్యమంలో ఉన్నాడు. ఇతడిని లొంగదీసుకోవడానికి పోలీసులు వేసిన ఎత్తులు పారక పోయేసరికి అతడినో దుర్మార్గుడిగా చిత్రించి అతడి కుటుంబంపైన, అతినిపైన మానసిక ఒత్తిడి తెచ్చి ప్రజల్లో అభాసుపాలు చేయాలనే చర్యకు ఒడిగట్టారు. ఒకనాడు అతడి దిష్టిబొమ్మను తయారుచేసి అతడి ఊర్లోనే ఆ ఊరి జనం సమక్షంలోనే ఆయన మిత్రుడితోనే ఉరి తీయించారు. ఉబికిపడుతున్న కన్నీళ్ళు, మండుతున్న గుండెలు, చెప్పలేని వేదనతో ఆ క్షణాన ఆ మిత్రుడనుభవించిన గుండె కోత ఆ గ్రామస్థులు, జగన్ తప్ప మరొకరు అర్థం చేసుకోవడం కూడా కష్టమే.

ఇక మనం కౌన్సిలింగ్ గూర్చి తెలుసుకుందాం.

గత కొద్ది సంవత్సరాలుగా కౌన్సిలింగ్ అనే ప్రత్యేక కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జరుగుతున్నాయి. తెలంగాణా వీటికి కేంద్రం. ఉత్తర తెలంగాణ కేంద్రకం. కౌన్సిలింగ్ అంటే విప్లవకారులను పోలీసు స్రవంతిలో కలుపుకోవడం. ప్రజల మధ్య, ప్రజల కోసం పనిచేస్తున్న విప్లవకారులను ఎలాగైనా సరే నిర్వీర్యపరచాలి, తమ దారిలోకి తెచ్చుకోవాలని పోలీసులు పడే పాట్లకే కౌన్సిలింగ్ అని పేరు పెట్టారు. దేశ-విదేశాల్లో శిక్షణ పొందుతున్న పాలకులు ప్రతి దానికి అత్యంత ఆకర్షణీయమైన పేర్లను తగిలించడమనేది ఈ ప్రపంచీకరణ 'యుగం'లో తప్పనిసరవుతోంది. ఈ కౌన్సిలింగు అందులో భాగమే. విప్లవకారుల కుటుంబీకులనో, బంధువులనో,మిత్రులనో లేదా అవసరమైతే అందరినీ చేరుకుంటారు. వారి మీద అనేక రకాల ఒత్తిడులు తెస్తారు. ప్రలోభాలు కల్పిస్తారు. వార్తా పత్రికలలో ప్రకటనలు చేస్తుంటారు. అతి దయనీయంగా, ఆర్ద్రతతో కూడిన ప్రకటనలతో పాటు చూస్తేనే జాలికలిగించే ఫోటోలను ఎంపికచేసి జోడిస్తారు. కుటుంబ సమస్యలన్నింటిని ఏకరువు పెట్టుతారు. విప్లవకారులు ఇంటికి తిరిగి రావడమే ఏకైక పరిష్కారం అన్న సారాంశం వాటిలో ఉంటుంది.

ఇంటివారి ప్రకటన, ఆ పక్కపక్కనే అక్కడి స్థానిక పోలీసు అధికారి కూడా ఓ హెచ్చరిక ప్రకటన విడుదల చేస్తాడు. పార్టీ నాయకులందరూ ఎన్‌కౌంటర్లలో చస్తున్నారు, నీవూ ఏదో ఒక రోజు చావాల్సిందే. మా బలం ముందు మీరెంత? వచ్చి లొంగిపోయి, బతికి పో! అంటూ ఆ ప్రకటన ఉంటుంది. ఇదీ కౌన్సిలింగ్. ఇక్కడా ఓ జరిగిన కథ చూద్దాం.

అది ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా. అక్కడ ఒక దళానికి కా.పద్మ కమాండర్ బాధ్యతలు నిర్వహిస్తోంది. ఆమె తన సహచరుడితో పాటు విప్లవోద్యమంలో చేరింది. వారికొక బాబు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో సహచరుడు ఉద్యమం నుండి వెనక్కి వెళ్లాడు. ఆమె మాత్రం దృఢ సంకల్పంతో ప్రజల మధ్యే, అసలైన జనజీవన స్రవంతిలోనే ఉంది. ఆమెను పోలీసు స్రవంతిలోకి లాగడమెలా అన్నది అక్కడి అధికారల పంతం. దీనితో ఒక దృశ్యాన్ని సృష్టించారు.

ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఆమె బాబు వేసవి సెలవుల్లో ఇంటికొచ్చాడు. ఇది తెలుసుకున్న స్థానిక పోలీసు సర్కిల్ అధికారి రంగంలోకి దిగాడు. ఒక కథనాన్ని తయారుచేసి ఆ బాబుతో పత్రికలకు విడుదల చేయించాడు. 'ఇంటి వద్ద నాన్న సరిగా చూడడం లేదనీ, నన్నెవరూ చూసేవారు లేరనీ, కనీసం ఒక్కసారైనా నన్ను చూడ రావా అమ్మా' అంటూ ఆ బాబు తల్లిని వేడుకుంటున్నట్టుగా సిఐ తయారుచేసిన కథనాన్ని పత్రికల్లో ప్రముఖంగా ప్రచురింపచేశాడు. ఆ పక్కనే సిఐ తన హెచ్చరిక ప్రకటన కూడా వేయించాడు. ఇలాంటి ప్రకటన ద్వారా ముఖ్యంగా మధ్యతరగతి సున్నిత హృదయాలను ఆకట్టుకొని నక్సలైట్లు ఎంతటి కరడుగట్టినవారో ప్రపంచానికి చాటడమే అతడి దురుద్దేశ్యం. తెలుగు వార్తా పత్రికలు చూసేవారికి జిల్లా ఎడిషన్‌లలో ఇవి చాలా తరచుగా ఎదురవుతుంటాయి.

పోలీసులు ప్రదర్శనలు, దిష్టి బొమ్మల దగ్ధం, కౌన్సిలింగ్‌ల మేరకే పరిమితం కాలేదు. సభలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో కొన్ని ప్రత్యేక సభలుంటాయి. కొంత ఇక్కడ సభా స్వరూపాలు - స్వభావం గూర్చి చూద్దాం.

ప్రత్యేకమైన సభలకు ముఖ్యంగా నాలుగు రకాల వారని వేదికపైకి పిలుస్తూంటారు. ఇందులో మొదటిరకం - ఎవరి పిల్లలైతే పూర్తికాలం విప్లవకారులుగా ఉన్నారో వారిని పిలుస్తారు. రెండవ రకం - ఎవరి పిల్లలైతే ఉద్యమంలో అమరులయ్యారో వారిని పిలుస్తారు. మూడవరకం - ఉద్యమంచే శిక్షింపబడినవారు. ఈ మూడు రకాల కుటుంబాలకు చెందిన పెద్దలు సభావేదికపై నుండి తమ భావాలను, దుఃఖాన్ని, కోపాన్ని, ప్రేమను, వ్యతిరేకతను వ్యక్తం చేస్తుంటారు. ప్రధానంగా మొదటి రెండు రకాల వాళ్లు తమ పిల్లలు లేదా తమ కుటుంబ పోషకులు తమతో లేకపోవడంతో పోలీసుల ఒత్తిడితో వారెంతటి బాధలకు లోనవ్వాల్సివస్తోందో హృదయ విదారకంగా చెప్తుతూ ప్రపంచం ముందు తమ గోడునంతా వెళ్లబోసుకుంటారు. మూడవరకం వారు వేదికలెక్కి మా ఇంటివారిని శిక్షించడంతో మాకు ఏ దిక్కూ లేకుండా పోయి మా బతుకులు అధ్వాన్నంగా తయారయ్యామని ఉద్యమాన్ని నిందిస్తూనూ ఉసురు తగలగలదని వేదికపైనే ఏడుస్తుంటారు. ఈ మూడు రకాలకు భిన్నమైన నాలుగో రకం వారు వేదిక మీదకు వస్తారు. వీరు పోలీసు ప్రవంతిని సమర్థించాల్సిన వాళ్లు. పోలీసు చర్యలను పొగిడేవాళ్లు. అధికార్లను దీవించేవాళ్లు. వీరు, ఎవరి పిల్లలైతే 'విప్లవ ప్రవంతి' (ప్రజా ప్రవంతి) నుండి పలు కారణాలతో వైదొలగి పోలీసులకు ఆత్మసమర్పణ చేసుకున్నారో వారి ఇంటి పెద్దలు. తమవారు తమ జీవితపు అంతిమ ఘడియలలో తమతో ఉంటున్నందుకు తమకెంత సంతోషంగా ఉందో చెప్తుతారు. వారి మనస్సుల్లో ఏమున్నా పైకి మాత్రం ఇదే చెప్పి తీరాలి. మా పిల్లల్లాగే ఇతరుల బిడ్డలు కూడా పోలీసులను నమ్ముకొని లొంగిపోవాలని కోరుతారు. ఇలా నాలుగు రకాల వ్యక్తులు సభపై మాట్లాడుతుంటారు. అందరూ ఏదో ఒక రూపంలో సభావేదికపై నుండి ఉద్యమంతో వాటిల్లిన, వాటిల్లుతున్న తమ వ్యక్తిగత నష్టాల గూర్చే వివరిస్తారు. హాజరైన సభికులందరూ - పల్లె జనం - తమతమ స్పందనలను, ప్రతిక్రియలను లోలోనే, బయటోకేనో వెల్లడిస్తుంటారు. అక్కడి వాతావరణం అంతా ఉద్యమం పట్ల ఒక నెగెటివ్-ప్రతికూల-వాతావరణాన్ని కలిగించే విధంగా తయారవుతుంది. ఈ దృశ్యాలన్నీ ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధిస్తే, పత్రకార్లు తమ కలాలకు పని పెడతారు. తెల్లారి పూర్తి మసాలాలు దట్టిస్తూ జిల్లా ఎడిషన్‌లో ప్రముఖ వార్తయి పోతుంది.

మరో రకం సభలు జాతరల్లాగ సాగుతూంటాయి. ఉద్యమం నుండి దిగజారిపోయిన వారికి పునరావాసం కల్పించే మేళాలు ఇవి. ఈ సభలకు ఉన్నాతాధికారులు (సివిల్-పోలీసు) హాజరవుతారు. వారే లొంగిపోయినవారికి డబ్బు అందచేస్తారు. ఆ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని, తాము చెప్పే జనజీవన ప్రవంతిని శక్తి కొద్దీ డబ్బా కొడుతుంటారు. పునరావాసం పొందిన వారు ఉద్యమం పట్ల తమ అక్కసునంత వెళ్లగక్కేవారు కొందరైతే, పోలీసు భయానికి ఆ రూపంలో వెళ్లగక్కక తప్పనివారెందరో ఉంటారు. ఇక్కడ ఒక సంగటన చూద్దాం.

కా.స్వర్ణ సుదీర్ఘకాలంగా వరంగల్ విప్లవోద్యమంలో దళాల్లో భాగంగా ఉంటూ తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో, ఇంటి వద్ద ఉండి పనిచేయాలని నిర్ణయించుకుంది. పోలీసులు ఈమె రాకను పసిగట్టి కౌన్సిలింగ్ నెరపి ప్రవంతిలో కలుపుకోవాలనుకున్నారు. ఓ సభ ఏర్పాటు చేశారు. అధికారులు, మంది మార్బలం అంతా చేరుకున్నారు. స్వర్ణను వేదిక పైకి పిలిచారు. పునరావాసం ఉపన్యాసం అధికార్ల వంతయింది. ఇక చెక్ అందివ్వడమే మిగిలింది. ఇక్కడే కథ అడ్డం తిరిగింది. స్వర్ణ తన బతుకేదే తాను బతుకుతాను గానీ సర్కార్ ఇచ్చే డబ్బు అక్కర్లేదని చెప్పేసింది. దీంతో అధికారుల్లో కలవరం మొదలైంది. చివరకు 'డబ్బు తీసుకోకుంటే నీవు మళ్లీ నక్సలైట్లతోనే పోతావు. నీవు ఇప్పుడు కూడా నక్సలైటువే అని బెదిరించడం మొదలైంది. వారేమన్నా స్వర్ణ మాత్రం డబ్బు వద్దంది. చివరకు సభికుల ముందు తమ నాటకం ఫ్లాప్ (అభాసుపాలు)అవుతుందని అర్థంచేసుకున్న పోలీసులు బలవంతంగా చెక్ చేతిలో పెట్టారు. కానీ, స్వర్ణ మాత్రం చెక్‌ను కాలదన్ని, ఆరోగ్యమైనా అనారోగ్యమైనా విప్లవం లోనే, జనంలోనే, జనంతోనే అని జనజీవన ప్రవంతిలోనే ఉండాలని తిరిగి అడవి గుండెల్లోకి జారుకుంది. జనం ఒడిలోకి చేరుకుంది.

ప్రస్తుతం ఇక పోలీసు పథకాలు చూద్దాం. పోలీసులు రకరకాల రూపాల్లో జనానికి డబ్బివ్వడానికి పూనుకుంటున్నారు. అప్పుల రూపంలో, నగదు లేదా వస్తు రూపేణ అందిస్తున్నారు. ఆదివాసులకైతే అనేక రాయితీలు ఉండనే ఉంటాయి. ఇవి కాకుండా ఆరోగ్య శిబిరాలు, న్యాయ శిబిరాలు పెడుతూనే ఉన్నారు. ప్రజల పట్ల ఒలకబోయాల్సిన దంతా ఒలకబోస్తున్నారు. ఇదెంతవరకు చేరిందంటే పార్టీ నాయకుల వృద్ధ తలితండ్రులను, లేదా భార్యాబిడ్డలను దత్తత తీసుకునే వరకు వచ్చింది. ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కార్యదర్శి కా.జంపన్న వాళ్ల ముసలి తల్లిని ఈ రకంగానే దత్తత తీసుకొని 'కొడుకు లేని లోటు తీరుస్తామని ఆవిడతో కలసి ఫోటోలు తీయించుకొని పత్రికలకు ఎక్కించారు. అలాగే డికె ఎస్‌జడ్‌సి కార్యదర్శి కా.లచ్చన్న వాళ్ల ముసలి తల్లిని దత్తత తీసుకోకపోయినా పత్రికల వారిని పిలిపించి వారి ముందు ఆమె గుండె జబ్బుకు వైద్యం చేయిస్తామని కొన్ని మందులిప్పించి, ఆమె ఏం కోరుకుంటుందో అడిగారు. వాళ్లకు కావలసిన జవాబే 'నా కొడుకు ఇప్పటికైనా ఇంటికొస్తే బాగుండు'నన్న మాటలు చెప్పించారు. అవి పత్రికలకు ఎక్కించారు. ఇలా చాలామంది కామ్రేడ్స్ యొక్క కుటుంబీకులతో చేయిస్తున్నారు. ఇదంతా మాత్రం ప్రపంచానికి ఒక విషయాన్ని తెలుపుతుంది. ఆలోచింపచేస్తుంది. పోలీసుల గోబెల్స్ ప్రచారాన్ని ఎండగడుతుంది. అదేమంటే - ఇన్నాళ్లు పోలీసులు ``నక్సలైట్లు డబ్బులు దండిగా జమచేసి తమ ఇళ్ళకు పంపుతున్నారని" ప్రచారం చేస్తున్నారు. అయితే ఇన్ని లక్షలు పొందుతున్న ఆ కుటుంబాలకు ఇంకా పోలీసుల సహాయం ఎందుకు? వారు అన్ని ఇబ్బందుల్లో ఎందుకుంటున్నారు? విప్లవకారుల కుటుంబాలు ఎందుకు శిథిలమవుతున్నాయి? లాంటి అనేక ప్రశ్నలు జనాల ముందు పోలీసుల చర్యతో ఎదురై, పోలీసు దుర్మార్గాల బండారాన్ని బట్టబయలుచేస్తున్నవి! పిచ్చి వెధవ మంచి పని చేశాడంటే ఇదేనేమో!

విప్లవోద్యమంలో ఉన్న కామ్రేడ్స్ కుటుంబాలతో ఇలా వ్యవహరిస్తున్న పోలీసులు అమరవీరుల కుటుంబాలతో కూడా అంతే నాటకఫక్కీలో వ్యవహరిస్తున్నారు. తమ బిడ్డలను, తమ వాళ్లను కోల్పోయిన కుటుంబీకులకు సహజంగానే పోలీసులపై, ఈ కుళ్ళిన వ్యవస్థపై పగ, ద్వేషం ఉంటాయి. అన్యాయంగా, దుర్మారంగా తమ వాళ్లను పొట్టన బెట్టుకున్న పోలీసులను వారు వ్యతిరేకించడం న్యాయసమ్మతమైనదే. అయితే, పోలీసులు మాత్రం ఆ కుటుంబాలను వదలకుండా, వారి బిడ్డలు ఎంతో తప్పు చేసి వారికి దూరమైనా అండగా ప్రభుత్వం, మేమూ ఉన్నామంటూ సహాయ చర్యలకు దిగుతుంటారు. ఇలాంటి నీచమైన పనులకు దిగే పోలీసులంటే రోమరోమాన వారిలో ఒక అసహ్యం, కోపం ఉన్నా వారున్న పరిస్థితుల్లో దానినంతా నిబ్బరంగా భరిస్తుంటారు. అవకాశం వచ్చినప్పుడు ఆ లావాలో బూడిదై వారు తప్పనిసరి మూల్యం చెల్లిస్తారు.

ఇక మరో రకమైన సభలు ఎలా ఉంటున్నాయంటే, విప్లవోద్యంచే శిక్షింపబడి హతులైన వారిని ఆకాశానికెత్తడం పోలీసులకు అవసరం. ఆ సందర్భంగా పౌరహక్కుల నేతలను దూషించడం మొదలు హతుల స్మృతిలో స్థూపాలు నిర్మించడం వరకు పోలీసులు చేస్తున్నారు. ఇలా వారు తమ దారిలో తాము ఎన్ని చేసినా పట్టించుకునే జనం లేరు సరికదా వాటి అసలు భాగోతం ఎరిగిన జనాలు ఖండిస్తుంటారు కూడా. అయితే ఈ సభలకు విప్లవకారుల కుటుంబాల వారిని పిలవడం, వేదికలపై మాట్లాడించడం, స్థూపావిష్కరణకు ఒత్తిడి కూడా చేయడం ప్రజలకు భరించరానిదిగా ఉంటుంది. ప్రజాశత్రువులై హతులైన వారి

శవ యాత్రలు కూడా పోలీసులే తమ భుజాన వేసుకుంటున్నారు. శవయాత్రల్లో పీపుల్స్‌వార్‌ను, దాని సానుభూతిపరులను బండబూతులు తిట్టడమే వారెరిగింది. ఆ యాత్రల్లో ఏ కంటా చుక్క కన్నీరు కానరాదు. ఏ కడుపు శోకం విన్పించదు. విచారవదనాలు, స్మృతుల వెల్లడింతలు, భారమైన కదలికలు మచ్చుకైనా అగుపడవు. ఒక అహం, ఒక దర్పం, ఒక దుర్మార్గం, ఒక క్రౌర్యం ఆ యాత్ర పొడుగునా వ్యక్తమవుతుంటుంది. ఈ పోలీసులే మరోవైపు విప్లవకారుల శవయాత్రలను ఏదోవిధంగా అడ్డుకోవడానికి పాల్పడుతుంటారు. తమ ప్రియమైన అమరులకు, విప్లవనేతలకు అంతిమ భాష్పాంజలులు ఘటిద్దామని ఉప్పెనలా తరలివచ్చే జనసంద్రాన్ని అడ్డుకోవడానికి కిందా మీదా పడుతుంటారు. గత సంవత్సరం మార్చ్‌లో అసువులు బాసిన కా.ఆర్‌కె శవయాత్రను అడ్డుకోవడానికి పోలీసులు ఎన్నో విఫల ప్రయత్నాలు చేశారు.

పైన పేర్కొన్నవన్నీ పోలీసులే ప్రత్యక్షంగా చేస్తున్నవి. పోతే నల్లదండు ముఠాలచే చేయించే హత్యలు, అత్యాచారాలు ఏ పత్రికాభాష అనుమతించని విధంగా ఉంటాయి. వీరంతా పోలీసులచే పోషించబడుతున్నవారే. ఇందులో మాజీలు అనేకం ఉన్నారు. వీరి పని అంతా పీపుల్స్‌వార్ ఉద్యమంలో భాగమైన వారిని, సమర్థిస్తున్న వారిని, ప్రజా ఉద్యమాల వెంట నిలిచిన వారిని నేరుగా వేధించడం, ఫోన్‌లలో బెదిరించడం, దాడులు చేయడం, కిడ్నాప్‌లు చేయడం, చివరకు ఇవేవీ పనిచేయవని తేల్చుకుంటే భౌతికంగా నిర్మూలించడం వరకు వీరు పాల్పడుతున్నారు. వీరిలో తెలివిమీరిన వారు బహిరంగంగా పార్టీని, వ్యక్తులను, ఇతరత్రా సంస్థలను హెచ్చరిస్తూ, నిందిస్తూ పత్రికలకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. వీరు కోర్టులకు హాజరైతే (ఏదో ఒక కేసులో) దారి పొడుగుతా అరుపులతో బూతుల దండకమే నినాదాలుగా సాగుతుంటుంది. వీటన్నింటిని నిర్దేశించేది ఉన్నత పోలీసు అధికారులే - ప్రజల్లో, ప్రజాస్వామికవాదుల్లో ముఖ్యంగా బుద్ధిజీవుల్లో, వారి కుటుంబ సభ్యుల్లో ఒక అభద్రతా భావాన్ని, ఒక భయానక వాతావరణాన్ని సృష్టించే తలంపుతో ఇవి జరుగుతున్నాయి. నల్లదండు ముఠాలకన్నా తామే నేరుగా పనిలోకి దిగడం అవసరం అనుకున్నప్పుడు పోలీసులే ఏదో ఒక బోర్డు (పేరు) తగిలించుకొని ( గ్రీన్ టైగర్స్....)పైన పేర్కొన్న దుర్మార్గాలన్నింటికి ఒడిగడుతున్నారు. దశాబ్దన్నర క్రితం కరీంనగర్‌లో కామ్రేడ్ జాపా లక్ష్మారెడ్డి (బాపు)ని మొదలుకొని కామ్రేడ్ ఆజం అలి వరకు ఎందరినో వీరు పొట్టన పెట్టుకున్నారు. ఒకనాడు జగిత్యాలలో బాలగోపాల్‌పై చేసిన దాడి మొదలు విప్లవ కవి, గాయకుడైన గద్దర్ పై చేసిన దాడి వరకు ఎందరెందరో కామ్రేడ్స్ వారి విఫల దాడుల్లో బతికి బయటపడి నేటికీ ప్రమాదం అంచుల్లో జీవిస్తున్నారు.

ఇక చివరికి పోలీసులు సృష్టిస్తున్న సాహిత్యం గూర్చి కూడా కొంత చూద్దాం.

పోలీసులు ప్రత్యేక సాంస్కృతిక బృందాలను కూడా ఏర్పర్చారు. ఈ బృందాలు విప్లవ గీతాల బాణీలను అనుకరిస్తూ రియాక్షనరీ పాటలను పాడడం, ఇతర కళారూపాలలో - నాటకం, నాటిక, ఏకపాత్రాభినయం, బుర్రకథలు, డప్పుడాన్సులు, గజల్‌లు, ఒగ్గుకథలు తదితర అనేక జానపద కళారూపాలతో సహా ఆధునిక కళలను జోడిస్తూ - జనరంజకంగా ఉండేలా మొత్తం ప్రోగ్రాంను తయారుచేస్తున్నారు. విప్లవోద్యమంపై విషం గక్కడమే వీరి వస్తువు. దాని రూపం ఏది అయినా సారం మాత్రం ఇదే. వీటి ద్వారా విస్తృతంగా ప్రదర్శనలు ఇస్తున్నారు. అలాగే పోలీసుల్లో, బ్యూరాక్రట్లల్లో చేయి తిరిగినవారు ఏకంగా పుస్తకాలే ప్రచురిస్తున్నారు. కథలు, కవితలు, డాక్యుమెంటరీ నవలలు, నవలలు, అనేక చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తూ రాసి వెలువరించే పుస్తకాలు అనేకం మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. కొంతమంది పనిగట్టుకొని పదేపదే పత్రికలకు ఇంటర్వ్యూలు కూడా ఇస్తున్నారు. ఇదంతా పరమ కాల్పనిక సాహిత్యమనీ, ఫిక్షన్‌కు చెందిందని, అబద్ధాలు ప్రచారం చేయడం అని మాత్రం మరచిపోవద్దు.

ఇక్కడ పేర్కొన్నవన్నీ పోలీసుల బహుముఖ దాడిలో భాగంగా ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ, తెలంగాణాలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇంతకాలం తన్నడం, గుద్దడం, చంపడం, దళాల కోసం వేటాడటం, మాటుగాయడం, జనాలపై-దళాలపై కాల్పులు జరపడం, మాయం చేయడం, మహిళలపై అత్యాచారానికి పాల్పడడం, నీళ్ళల్లో విషం కలపడం లాంటివి అనేకం చేసి, ఇప్పటికీ చేస్తున్న పోలీసులు పైన చెప్పినటువంటివి కూడా ఎందుకు మొదలుపెట్టారన్నది మనం తప్పనిసరి అర్థంచేసుకోవాలి.

పోలీసులు కొనసాగిస్తున్న బహుముఖ దాడిలో మానసిక యుద్ధం ఒక భాగం. దీన్నే `సైకాలాజికల్ వార్ ఫేర్ ' అని కూడా ఆంగ్లంలో అంటున్నారు. విప్లవ ప్రతీఘాతుక చర్యలు విపరీతంగా జరుగుతున్న అనేక దేశాల అనుభవాల్లో పైన పేర్కొన్నటువంటి ఘటనలు, సంఘటనలు సాధారణంగానే జరుగుతున్నయి. ప్రజల మనసులను దెబ్బతీసే చర్యలు ఇవి. మానసికంగా ప్రజలను కుంగదీసేవివి. ప్రపంచీకరణలో భాగంగా సమాజంలో ఒక కొత్త సెక్షన్ చాలా చోట్ల ఉనికిలోకి వస్తోంది. అనుత్పాదక రంగాలు, సర్వీస్ సెక్టార్ విపరీతంగా పెరిగిపోతున్నది. మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగాన్ని మించిన భాగాన్ని సర్వీస్ సెక్టార్ సమకూరుస్తోందంటేనే దాని పోకడ తెలుస్తోంది. మరోవైపు సమాజంలో చదువుకున్న నిరుద్యోగ సైన్యం లక్షల్లో పెరుగుతోంది. సాధారణంగా మధ్య తరగతి, ఉన్నత మధ్యతరగతి కుటుంబాల కిందకే వీరందరు వస్తారు. పట్టణాల్లో, నగరాల్లో వీరు ఎక్కువ శాతం ఉంటుంటారు. భారతదేశ జనాభాలో 25-30 శాతం వీరుంటారు. వీరిని తమవైపు నిలుపుకోవడం పోలీసులకు అవసరం. వీరెవరికి విప్లవ ఛాయలు కూడా తగులవద్దని వారి బాస్‌లు వారిని నిర్దేశిస్తుంటారు. వీరి బాస్‌లు (ప్రపంచ బ్యాంకు-అంతర్జాతీయ ద్రవ్య నిధి లు)రూపొందించిన ఎల్‌ఐసి లో ఇందంతా ఒక భాగం. అందుకే విప్లవం పట్లా ఒక కరడుగట్టుకు పోయే వ్యతిరేకతా భావనను, నకారాత్మక దృష్టికోణాన్ని, ప్రతికూల ఆలోచనలను, రియాక్షనరీ అవగాహనను వీరిలో కల్పించడానికే పోలీసులు ఈ సైకో వార్‌ను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఈ తరగతికి చెందిన మహిళలలో ఒక భయాన్ని, ఒక అభద్రతను, నిత్యం వెంటాడేలా చేయడం వీటి లక్ష్యం. ఈ సెక్షన్ మహిళలలో సాధారణంగా వస్తు వ్యామోహం పెరిగిపోతూ, ఆధారపడే జీవితం, మనస్తత్వాన్ని పెంచుతున్న పరిస్థితుల్లో తమవారు తమకు దూరం అవుతే,. తమ వారికి ఏమైనా ప్రమాదం వాటిల్లితే, తమవారే ఒక నక్సలైటు గావడాన్ని తట్టుకోలేని పరిస్థితికి సమాజం వీరిని నెడుతుంది. ఇలాంటి వారిపై ఈ మానసిక యుద్ధం ఒక భయంకర స్వప్నాన్ని ముందుంచుతుంది. యువతలో కూడా ఇవే భావనలు చోటుచేసుకుంటాయి. మరోవైపు ఎంతటి నేరాన్నైనా వీరోచితం (హీరోయిక్) అనే తీరులో ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారం చేస్తుండడం ద్వారా వీరు అటు సులభంగా ఆకర్షితులవడం మనం చూస్తున్నాం. అలా రోజురోజుకు నేరమయం, లంపెనైజెషన్ పెరుగుతున్న ఈ సమాజం అంచులకైనా నక్సలిజం (విప్లవోద్యమం) తాకకూడదనీ, అదే జరిగితే నేటి విప్లవ పరిస్థితుల్లో అగ్గి భగ్గుమంటుందన్న భయంతోనే ప్రభుత్వాలు, పోలీసులు ఈ సైకో వార్‌ను ముందు చూపుతో పకడ్బందీగా పథకం ప్రకారం కొనసాగిస్తున్నాయి. అయితే రోజురోజుకు తీవ్రతరమవుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభం మూలంగా పాలకవర్గాలు ఎన్ని కసరత్తులు చేసినా అవన్నీ తాత్కాలికంగానే లేపనంలా పనిచేయగలవేమో గానీ శాశ్వతంగా వారికి ఘోరి కట్టకుండా ఆపలేవు. ఈ విషయాన్ని ఎంత లోతుగా విప్లవశక్తులు అర్థం చేసుకుంటే, అంత కౌంటర్‌గా తమ విప్లవ కార్యక్రమాలను తీవ్రతరం చేయడం ద్వారా, అన్ని సెక్షన్‌ల ప్రజలను కలుపుకువచ్చే విధంగా తమ ఎత్తుగడలను రూపొందించుకోవడం ద్వారా ఆ క్రమం త్వరితంగా పూర్తి అవుతుంది. శత్రువు పద్ధతులను, ఎత్తుగడలను అధ్యయనం చేయడం ద్వారానే వాటిని ఓడించడానికి వీలవుతుంది. ఇవన్నీ శత్రువు ప్రజల నుండే నేర్చుకున్నాడన్నది నిర్వివాదాంశం. ★

నిర్బంధం

# విషమిస్తున్న పోలీసు అత్యాచారాలు – గడ్‌చిరోలి ప్రజల ప్రతిఘటన

గడ్‌చిరోలి విప్లవోద్యమం తొలినుండి బూటకపు ఎన్‌కౌంటర్లను ఎదుర్కొంటున్నది. 1980 నవంబర్ 2నాడు కా.పెద్ది శంకర్ నెత్తుటితో ఎరుపెక్కిన విప్లవోద్యమం గత నవంబర్‌కు 23 సంవత్సరాలు పూర్తిచేసుకున్న చరిత్రలో పదుల కొద్ది కామ్రేడ్స్ నెత్తుర్లు ధారపోసిన చరిత్రే వ్యక్తమైతది. ప్రభాత్ పాఠకులెరిగిందే. కాకపోతే ఈ ఎన్‌కౌంటర్ హత్యలు ఏయేటికాయేడు కొత్త రూపంలో పదేపదే ముందుకు వస్తున్నాయి. గడచిన ఆగస్టు 2003 నుండి ఇప్పటి వరకు గడ్‌చిరోలి, గోందియా ఉద్యమాల్లో 10 మంది వరకు కామ్రేడ్స్ అసువులు బాసారు. వీరందరికీ ముందుగా వినమ్రంగా విప్లవ జోహార్లర్పిద్దాం.

జనవరి 2003 నుండి పెచ్చరిల్లిన పోలీసు నిర్బంధానికి జనజాగరణ్ పేరుతో కొనసాగిన గాంవ్ బంధీ అణచివేత రూపం ఒక పరాకాష్ఠ. పోలీసులు ఇప్పటికీ ఒక 150 గ్రామాల్లో ప్రజలు నక్సలైట్లకు గాంవ్ బందీ ప్రకటించారని చాటుకుంటున్నారు. వీరు ప్రకటించిన గ్రామాలన్ని పత్రికల్లో చాటుకోవడానికీ, ప్రపంచాన్ని పక్కదార్లు పట్టించడానికీ, ప్రజా ధనం దుర్వినియోగం చేయడానికే తప్ప అందులో ఏ ఒక్క గ్రామం అయినా నక్సలైట్లను నిషేధించింది లేదని గడ్‌చిరోలి, గోందియా డివిజనల్ పార్టీలు పత్రికా ముఖంగానే ప్రజలకు స్పష్టం చేశాయి. పోలీసులు నానాటికీ తీవ్రతరం చేస్తున్న అణచివేతను నిరసిస్తూ ప్రజలు అనివార్యంగా కొన్ని ప్రతిఘటనా చర్యలు చేపట్టి తమ పిజిఏ మద్దత్తుతో పోలీసులకు బుద్ధి కూడా చెప్పారు.



పోలీసుల హింసలకు గురైన ఓ రైతు

పోలీసులపై పిజిఏ జరిపిన దాడుల్లో ఆగస్టు 28 నాడు గడ్‌చిరోలి జిల్లాలో ఐదుగురు కమెండోలు కుమ్మరిగూడ వద్ద కుక్కచావు చచ్చారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఆ తర్వాత ప్రజలు జరుపుకున్న పిజిఏ 4వ స్థాపనా వారం (26 నవంబర్ - 2 డిసెంబర్)లో రెండు జిల్లాల్లో అనేక చోట్ల పోలీసులు ప్రజల దాడులు ఎదుర్కోవలసి వచ్చింది. ఇందులో ముఖ్యంగా నవంబర్ చివర్లో గోందియా డివిజన్(గడ్‌చిరోలి జిల్లా)లో జరిగిన ఒక మాటు దాడిలో ఒక పోలీసు చావగా మరో ఇద్దరు గాయపడినారు. ఈ దాడులు ప్రధానంగా కమెండోల మీద జరుగుతున్నందున పోలీసులు ఖంగు తింటున్నారు. దశాబ్దం క్రితం మహారాష్ట్ర ప్రభుత్వం గడ్‌చిరోలి రైతాంగ ఉద్యమాన్ని అణచివేయడానికై రూపొందించిన స్పెషల్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రధానంగా స్థానిక ఆదివాసీ యువకులతోనే సి-60 క్రాక్ కమండోస్ అనే పేరుతో ఉనికిలోకి వచ్చిన కమెండోలంటేనే జనాల్లో ఒక భయానక వాతావరణం ఏర్పడింది. విచ్చలవిడి అణచివేత చర్యలకు ప్రతిరూపంగా ఈ బలగాలు నిలిచాయి. అతి నీచమైన, క్రూరమైన అమానవీయ పద్ధతుల్లో ప్రజలపై అణచివేతకు పూనుకునే ఈ కమెండోలు పిజిఏ చేతిలో చస్తున్న ప్రతి సందర్భంలో ప్రజలు సహజంగానే ఎంతో సంతోషిస్తున్నారు. గత పదేళ్లలో జరిగిన ఒక గుర్తించదగిన మార్పేంటంటే పోలీసుల అమానుష నిర్బంధానికి ప్రజలు తమ జీవితంలో అంతర్భాగంగా అలవాటుపడడమే గాకుండా క్రమంగా పిజిఏతో కలసి మాటుదాడుల్లో పాలుపంచుకోవడం పెరిగింది. అన్ని దాడుల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతోంది. ఇది పోలీసులకు మింగుడుపడడం లేదు. అందుకే 1998 తర్వాత నుండి బహుముఖ దాడిని తీవ్రతరం చేస్తున్నారు. హత్యలను ప్రోత్సహిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా రెండు విషయాలను చెప్పుకోవడం ఇక్కడ అవసరం.

ఒకటి. మహారాష్ట్ర పోలీస్ మహాసంచాలక్ (డిజిపి) సుభాష్ మల్హోత్రా సెప్టెంబర్ '03లో జరిపిన తన విదర్భ పర్యటనలో నాగపూర్‌లో ప్రారంభం కానున్న ఉగ్రవాద వ్యతిరేక పోలీసు అకాడమీ గూర్చి మాట్లాడాడు. అలాగే నక్సలైట్లు కనపడిన వెంటనే కాల్చివేయాలని పోలీసులను ఆదేశించాడు. నక్సలైట్ల నుండి తూటా పేలే వరకు ఆగి ప్రాణాలు కోల్పోకూడదని రెచ్చగొట్టాడు. అసలే ప్రజల ప్రాణాల పట్ల ఏమాత్రం జవాబుదారీతనం లేని పోలీసులు ఇప్పటికే బాజీరావు కన్నాకే, చిన్నామెట్టామి లాంటి రైతు యువకులను నక్సలైట్ల పేరుతో కాల్చి చంపారంటే ఇకపై ఉన్నతాధికారుల ఇలాంటి ఆదేశాలతో ఇంకెంతటి వైపరీత్యానికైనా దిగుతారనుకోవాలి. ఒక అమాయక ఆదివాసీ యువకుడైన చిన్నా మెట్టామిని కాల్చి చంపడం నేరమని నాగపూర్ హైకోర్టు బెంచి ఇచ్చిన తీర్పును కూడా ఖాతరు చేయని డిజిపి ఆదేశాలు ఈ దేశ ఉన్నత పోలీసు అధికారుల హంతక స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. తెల్గీ అవినీతి కుంభకోణంలో ఒక ముద్దాయిగా ఆరోపణలున్న ఇలాంటి బద్మాషుల నుండి ఇంతకన్నా ప్రజాహిత వాక్కులను ఆశించలేం కూడా.

మల్హోత్రా మాట అలా ఉంటే లాల్‌క్రిష్ణ అద్వానీ హామీలు కూడా అందుకు భిన్నంగా ఏమీ లేవు. గడ్‌చిరోలి జిల్లాలో రైతాంగ ఉద్యమాన్ని అణచడంలో పోలీసులతో చేయి-గొంతు కలిపి శేష జీవితంలో ప్రజల ముందు దోషిగా నిలబడి నూకలు చెల్లిపోయిన రాజా విశ్వేశ్వర్రావు ప్రతిమను దేశ పోలీసు మంత్రి అధ్వానీ డిసెంబర్ 2003లో అహిరిలో ఆవిష్కరించాడు. నక్సలైట్లను నిర్మూలిస్తామని ఆ సందర్భంగా మరోసారి ప్రకటించాడు. అందుకు తగిన అన్ని విధాలా సహాయం కేంద్రం నుండి అందుతుందనీ, ఇప్పటికే గత మూడేళ్లలో 250 కోట్లు ఇచ్చామనీ మాట్లాడుతూ త్వరలో ఢిల్లీలో పోలీసు ఉన్నతాధికారుల సమావేశం జరిపి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపాడు.

రెండు. అద్వానీ ప్రకటన సరిగ్గా కామ్రేడ్ కోమటి వాచమి అమరత్వం రోజే వెలువడింది. నా కొడుకును పోలీసులే హతమార్చారని కామ్రేడ్ మల్లా వాచమి రోదిస్తూ దోషులైన అధికారులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న సమయమది. ఏ నేరము చేయని యువకుడైన తన 22 సం.ల కొడుకును డిసెంబర్ ఏడవ తేదీనాడు నారుగొండ పోలీసులు అరెస్టు చేశారనీ, గ్రామస్థులందరూ కోమటిని విడిచిపెట్టాలని మొత్తుకున్నా వినకుండా తన కళ్ల ముందే తన కొడుకును విపరీతంగా చిత్రహింసల పాలుజేసి వదిలారని ఆ తండ్రి విలపిస్తున్నాడు. ప్రాణాలు కోల్పోయాడని పత్రికా విలేఖర్ల ముందు బోరుమన్నాడు. కొడుకు శవాన్ని భుజాన వేసుకొని భామ్రాఘడ్ చేరితేె రోగంతో నీ కొడుకు చచ్చాడని శవాన్ని చీర్‌ఫార్ (పోస్టుమార్టమ్) చేసిన డాక్టర్లు అనడాన్ని ముసలి తండ్రి తట్టుకోలేకపోయాడు. పోలీసులు తమ నేరాన్ని పూడ్చుకోవడానికి ఆ శవాన్ని పూడ్చిపెట్టాలని తండ్రి ముఖాన రు.లు 1500/- పడేసి చేతులు దులుపుకున్నారు. ఆదివాసులను ఏళ్ల తరబడి పాలించిన రాజా విశ్వేశ్వర్రావు (భారతదేశ మాజీ పోలీసు మంత్రి) ప్రతిమను ఆవిష్కరించిన రోజే మరో ఆదివాసీ యువకుడి శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా పోలీసులు పాతేయడం దోపిడి వర్గ వ్యవస్థ యొక్క స్వభావాన్ని చాటుతుంది.

కా.కోమటి అమరత్వానికి సరిగా పది రోజుల ముందు అంటే 28 నవంబర్ నాడు సిరొంచ తాలుకాలోని రాయగూడెం ప్రాంతంలో ఐదుగురు జనశక్తి గ్రూపు కామ్రేడ్స్ పోలీసు కాల్పుల్లో అసువులు బాసారు. అదే రోజు మరోవైపు ఛత్తీస్‌ఘడ్ ఎన్నికల కోసం పెద్దెత్తున దిగిన పోలీసు బలగాలు చురియా సమీపంలో బెందాడి గ్రామ సమీపంలో కామ్రేడ్ బీహారిలాల్ శహారే అనే రైతును కాల్చిచంపారు. తర్వాత నక్సలైటుగా ప్రకటించారు.

2 డిసెంబర్, 2003 నాడు గోందియా డివిజన్‌లోని బోదల్‌దండ్ గ్రామ

సమీపంలో చిచ్‌గడ్ పోలీసులు పగలు 3.30కు పిజిఏ సైనికులపై కాల్పులు జరిపి దేవురి దళ కమాండరైన కామ్రేడ్ రఘు (రమేష్, నల్గొండ జిల్లా వెలిశాల గ్రామస్థుడు)ను పొట్టన పెట్టుకున్నారు. కానీ ఇదంతా పోలీసుల కట్టుకథ. కా.రమేశ్ రెండురోజుల ముందే పోలీసులతో జరిగిన కాల్పుల్లో (ఆంబుష్) గాయపడి, ఒటరివాడై, వైద్య సహాయం లేని స్థితిలో ఒక ఖేతుల్ వద్ద పడిపోయి అమరుడైనాడు. అతని శవాన్ని కనుగొని పోలీసులు ఆశవంపై కాల్పులు జరిపి యధావిధిగా కట్టుకథకు ప్రాణం పోశారు. అలాగే ఆంబుష్ సైట్‌లోకి వచ్చిన బీహారిలాల్ శహారేను పిజిఏ సైనికులు అరెస్టు చేసి పెట్టారు. కాల్పుల సందర్భంగా పోలీసులు ఇతన్ని పట్టుకొని సాక్ష్యం ఉండకూడదని కాల్చి చంపారు.



నవంబర్ 2002లో గడ్చిరోలి జిల్లాలోని కోస్‌పూండ్రి గ్రామానికి చెందిన మహరును పోలీసులు గోళ్లల్లో సూదులు గుచ్చి హింసించడంతో అతని వేళ్లు ఇలా శాశ్వతంగా నల్లబడిపోయాయి.

ఈ రకంగా పోలీసులు ఏడుగురు కామ్రేడ్స్‌ను కాల్చి చంపారు. ఇందులో కా.రఘు సంఘటనలో రెండు రైఫిల్‌లను, జనశక్తివారి నుండి 8 రైఫిళ్లను స్వాధీనం చేసుకొని కుమ్మరిగూడలో చచ్చిన పోలీసులకు ప్రతీకారం తీసుకున్నామని ప్రకటించారు. పోలీసు చర్యలను మల్హోత్ర, అద్వానీల ప్రకటనలు ఎలా రెచ్చగొడుతున్నాయో ఈ ప్రాంతంలో విషమిస్తున్న మరిన్ని పోలీసు అత్యాచారాలు వెల్లడిస్తున్నాయి.

ఆ రోజు డిసెంబర్ 8వ తేది. అర్ధరాత్రి దాటిన సమయమది. దుర్మార్గ పోలీసులు సాధారణంగా దాడిని ఎంచుకునే దొంగ సమయమిది. ఆ రోజు రాత్రి గడ్‌చిరోలి పోలీసులు 12 కి.మీ దూరంలో ఉన్న గురువుల గ్రామానికి వెళ్లి మిశ్రాం అనే యువకున్ని అరెస్టు చేసి ఠానాకు తెచ్చి విపరీతంగా బాదారు. గ్రామంలో ఒక దొంగ సారా వ్యాపారిని అడ్డుకున్నారన్న నెపంపై మిశ్రాంను పోలీసులు చావబాది ఆసుపత్రిలో భర్తీ చేశారు.

మరో సంఘటన 20 నవంబర్ 2003 నాడు జరిగింది. గడ్‌చిరోలి జిల్లా కుర్‌ఖేడా తాలూకాలోని పురాడా గ్రామంలో జరిగిందిది. ఆ గ్రామంలో ఒక రోడ్డుపై యువక్ రాజ్ అనేయువకుడు పాన్‌ఠేలా నడుపుతూ ఇల్లు గడుపుకుంటున్నాడు. ఆ ప్రాంతంలో పెరుగుతున్న పోలీసుల అత్యాచారాలని ఖండిస్తూ ఆరోజు రాత్రి గ్రామ యువకులు పోస్టర్లు వేస్తూ ఠేలకు కూడా అంటించారు. ఇంతే. ఈ విషయం తెలిసిన స్థానిక దరోగ అయ్యర్ ఉగ్రుడై పోస్టర్లు వేసిన నేరాన్ని మోపుతూ యువక్‌రాజ్‌ను, అతని సోదరుడి వరుసైన దేవనాధ్ ప్రధాన్‌ను అరెస్టు చేయించాడు. వీరిని స్టేషన్‌కు తెచ్చి విచక్షణారహితంగా బాదడంతో (థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో) ఆ అన్నతమ్ములిద్దరూ అక్కడే ప్రాణాలు విడిచారు.

ఈ రకంగా పోలీసులు ఏ చిన్న అనుమానం కలిగినా, వారికి వ్యతిరేకంగా ఎక్కడ చిన్న నిరసన వ్యక్తమైనా భరించలేకపోతున్నారు. జిల్లా పోలీసు అధికారి రాజవర్థన్ వీటన్నింటికి అగ్రభాగాన నిల్చి సిగ్గు లేకుండా పోలీసు చర్యలన్నింటిని సమర్థిస్తున్నాడు. మరింత రెచ్చగొడుతున్నాడు. ఈ రకంగా పోలీసు ఉన్నతాధికారులు, మంత్రులు నిస్సిగ్గుగా, కనీస ప్రజాస్వామ్య విలువలు, మర్యాదలు పాటించకుండా బహిరంగంగానే పోలీసులను రెచ్చగొడుతుంటే పోలీసులు విచ్చలవిడిగా వారి ఆజ్ఞలననుసరించి ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారు. ఈ రెండు రకాల చర్యలను ప్రజలు ఖండిస్తున్నారు.

పోలీసులు సాధారణ, అమాయక ప్రజలపై నక్సలైటు సానుభూతిపరులంటూ ముద్రవేస్తూ అరెస్టులు చేస్తున్నారని, అరెస్టుకు ముందు కనీసం వారి పరిస్థితి ఏంటో కూడా తెలుసుకోవడం లేదని ఒక విధానసభ సభ్యుడు రామకృష్ణ మడావి పత్రికాముఖంగా పోలీసులను కోరాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అలాగే చాలా మంది రిపోర్టర్లు జిల్లా వార్తలు రాస్తూ పోలీసుల అకృత్యాలన్నింటిని ప్రజల దృష్టికి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. వీరు నక్సలైట్ల చర్యలను ఎలాంటి విచారణ లేకుండా ఖండిస్తున్నప్పటికీ ప్రజలపై జరుగుతున్న పోలీసు చర్యలను పత్రికలకు ఎక్కించడంతో ఒక రకంగా తమ కనీస బాధ్యతను నెరవేరుస్తున్నారు.

కాగా, సైన్యంలో ఆదివాసులు పెద్దెత్తున చేరాలని సైనిక భర్తీ బోర్డు నాగపూర్ వారు చేసిన ప్రకటనను ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇప్పటికే సైన్యంలో చేరిన వారి శవాలు జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల నుండి, ఈశాన్య ప్రాంతాల నుండి గడ్‌చిరోలికి దిగుమతి అవుతుంటే, మరింత మందిని దేశభక్తి పేరుతో సైన్యంలో చేరాలనీ, పోలీసుల్లో చేరాలనీ, అందుకు ఆదివాసులకు అనేక మినహాయింపులు ఇస్తూ ప్రోత్సహించడాన్ని సహించలేకపోతున్నారు. పోలీసుల్లో భర్తీ కావడాన్ని కూడా ఏ తలితండ్రి మనస్ఫూర్తిగా అంగీకరించడం లేదు. పోలీసుల్లో పెరుగుతున్న అసంతృప్తి, నిరాశ, పనిభారం, అవమానాలు సహించలేకపోతూ వారు ఒక ఉద్రిక్త వాతావరణంలో జీవించడాన్ని భరించలేకపోతూ ఎందరెందరో పోలీసులు ఈ మధ్య ఆత్మహత్యలకు పూనుకోవడమో, దుర్మార్గులైన ఉన్నత అధికారులను కసితో కాల్చి చంపడమో చేస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో తలితండ్రులు తమ పిల్లలను పోలీసుల్లోకి పంపడానికి సహజంగానే జంకుతున్నారు. ముఖ్యంగా గడ్‌చిరోలి నుండి పోలీసుల్లోకి భర్తీ అయిన కొద్దిమంది పోలీసులు ఎదుర్కొన్న ఘటనలు కూడా ప్రజలను భయపెడుతున్నాయి. కానీ నిరుద్యోగం అనే భయంకర భూతం కోరల్లో చిక్కుకున్న యువకులు గత్యంతరం లేక పోలీసుల్లోకి, సైన్యంలోకి వెళ్లుతున్నారని గ్రహించిన పిజిఏ, వారిని తమతో కలసి రావలసిందిగా పిలుపు నిచ్చింది. ప్రజాద్రోహుల పక్షాన నిలిచి తుపాకులు పట్టుకొని ప్రజలను కాల్చిచంపడం కాకుండా, ఈ కుళ్లిన వ్యవస్థకు కారణమైన భూస్వామ్య, పెట్టుబడిదారులను, దుర్మార్గమైన ప్రభుత్వ ఉన్నతాధికారులపై పోరాటానికి నడుం బిగించాలనీ, అందుకు పిజిఏలో చేరాలని కోరింది.

ప్రజావిరోధులుగా తయారై పోలీసుల అండచేరి ప్రజలపై దాడులకు పాల్పడితే ప్రజలు క్షమించరని గడ్‌చిరోలి డివిజనల్ కమిటి యువతకు స్పష్టం చేసింది. ఇలా తయారైన పిపిలి కి చెందిన వినోద్ లేకామిని, ఎడంపల్లిలోని మాధవ్ వడ్డెను, కమలాపుర్‌లోని శంకర్ కుడిమెత్‌ను, కురుంవాడకు చెందిన ఆబాజి పూసంను, ఎరంవాడలో దేవీదాస్ నైతాంను, ఈదుర్‌లో (భ్రామ్‌ఘడ్) ఒక ఇన్ఫార్మర్‌ను, మేడిపల్లి వద్ద (భ్రామ్‌ఘడ్) మరో ఇన్ఫార్మర్‌ను, మర్కనార్ (గట్ట)లో దేవును ప్రజాతీర్పుకు లోబడి గత జులై '03 తర్వాత పిజిఏ శిక్షించక తప్పలేదని వారి వివరాలన్నింటిని పార్టీ ప్రజల ముందుంచింది. అలాగే తమతో

*ఈ రిపోర్టు రాస్తున్న సమయంలో (25.1.04) నాగపూర్ ప్రాంతీయ వార్తల్లో గడ్‌చిరోలిలో జరిగిన ఆంబుష్ వార్త చెప్పారు. ఆ వార్త ప్రకారం మాటు దాడిలో ఒక పోలీసు చావగా, నలుగురు గాయపడ్డారు. ఆంబుష్ కండినేండ్‌వాడి ప్రాంతంలో జరిగింది. దారుణ నిర్బంధ అణచివేతలను ఎదుర్కొంటున్న డివిజన్ ప్రజానీకం పోరుదారుల్లో, త్యాగాల సాంప్రదాయాల్లో తమ బిడ్డల నెత్తుటి ధారల సాక్షిగా పిజిఏకు అండగా నిల్చి శత్రు బలగాలతో తలపడుతున్నందుకు జేజేలు చెప్తున్నాం.*

సహకరిస్తే పోలీసులకు ఎలాంటి హాని తలపెట్టమనీ, పోలీసులందరూ తమ శత్రువులు కారనీ, టిప్రాఘడ్‌లో ఒక పోలీసును (ఆగస్టుసెప్టెంబర్‌లో) కిడ్నాప్ చేసి తమ వెంట తీసుకెళ్లి తర్వాత విడుదల చేశామని గుర్తుచేసింది.

పోలీసులు గతంలో డివిజన్‌లో వందలాదిమందిని టాడాకు గురిచేయగా నేటికీ ఎందరో ప్రజలు ప్రత్యేక కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడు పోలీసులు పోటాను అమలుచేస్తున్నారు. పోలీసులు సెప్టెంబర్‌లో తాడిగాం రేంజి లంజవచ్చుకు చెందిన మహరును, భామ్రాఘడ్ రేంజి ఇత్తపాడు రైనును అరెస్టుచేసి నెలల తరబడి విడుదల చేయకుకండా జైల్లు తింపుతున్నారు. టిప్రాఘడ్, దేవురిల నుండి సిరొంచ వరకు నిరంతరం అరెస్టులు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు తాము చేస్తున్న ప్రజావ్యతిరేక చర్యలను సమర్థించుకోవడానికి జిల్లాలోని రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా నుండి ఆదివాసీ వికాస్ రాజ్యమంత్రిగా షిందే మంత్రివర్గంలో ఉన్న ఆత్రం ధర్మారావు ఆదివాసీల అభివృద్ధి గూర్చి మొసలి కన్నీరు కారుస్తూ ఎంతసేపూ ప్రభుత్వ నిధుల వైపు, పార్టీ ఫిరాయింపుల వైపే చూస్తాడు తప్ప తన ప్రాంతంలో పోలీసు అత్యాచారాల మూలంగా దెబ్బతింటున్న ఆదివాసీ జీవితాలను పట్టించుకోవడం లేదు. అలాగే ఆదివాసీ విద్యార్థి పరిషత్‌కు సర్వసేనానిగా ఉన్న నందూ నరోటి నుండి దీపక్ ఆత్రం వరకు చాలా మంది పోలీసు సభల్లో పాల్గొంటూ పబ్బం గడుపుకోచూస్తున్నారు. ఈ ప్రాంతం నుండి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనట్టు చెప్పుకుంటున్న ఏ పార్టీ రాజకీయ నాయకులనైనా ప్రజల గురించి పట్టించుకోనపుడు వారిని ప్రజలు క్షమించరని గుర్తుపెట్టుకోవాలి. అలాగే నక్సలైట్ల ఆత్మసమర్పణ పథకం పేరుతో 2003 డిసెంబర్ నుండి ఆరు మాసాలు ప్రయోగాత్మకంగా సాగే ఒక కొత్త ప్రణాళికను రూపొందించిన పోలీసుల పక్షాన చేరకూడదని నాయకులను పార్టీ కోరింది. ఈ కొత్త పథకం అంతా ఆంధ్ర పోలీసు ఎత్తులతోనే నిండి ఉంది. కమాండర్‌కు రు.5½ లక్షలు, ఉప కమాండర్‌కు రు3½ లక్షలు, దళ సభ్యులకు 2½ లక్షలు మూడు మాసాల్లో పునరావాసానికి ఇస్తామన్నారు. ఇవి కాకుండా ఉండేందుకు భూమి, ఇల్లు ఇస్తారట. పిల్లలకు చదువుతోపాటు లొంగిపోయిన వారికి పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు (ఎవరినుండో రక్షణ!) అనేక ప్రలోభాలకు లోనుచేసి, అయినా లొంగిరాని కుటుంబాలను తీవ్ర ఒత్తిడికి గురిచేసి లొంగుబాట్ల పథకాన్ని పూర్తి చేసుకోవాలని పోలీసులు చేస్తున్న అన్ని కుట్రలను ఓడించాల్సిందిగా పార్టీ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ప్రజలు తీవ్రమైన పోలీసు నిర్బంధాన్ని భరిస్తూనే పార్టీ ఇచ్చిన పోరాట పిలుపులను సఫలం చేస్తున్నారు. ఉత్తర తెలంగాణ ప్రజలపై ఆంధ్ర పోలీసులు కొనసాగిస్తున్న అమానుషమైన నిర్బంధాన్ని ఖండిస్తూ దండకారణ్య పార్టీ ఇచ్చిన పిలుపునందుకొన్న గడ్‌చిరోలి ప్రజలు తమ సంఘీభావాన్ని కూడా ప్రకటిస్తూ వారం రోజులు నిరసన పాటించారు. అలాగే పెప్సి కోకా కోలా కంపెనీలు తమ శీతల పానీయాలు అమ్మకాలు ద్వారా ప్రజల ఆరోగ్యంకు ప్రమాదకరంగా తయారైనాయనీ, బహుళ జాతి కార్పొరేషన్‌లను తన్నితరమాలని ప్రజలు సెప్టెంబర్‌లో ర్యాలీలు జరిపారు. అలాగే బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా డిసెంబర్ 23 నాడు ఉత్తర గడ్‌చిరోలి, గోందియా ప్రజలు బంద్ పాటించి తమ నిరసనను తెలిపారు. పోతే పిజిఏ స్థాపనా వారంలో పెద్దెత్తున ప్రజలు పిజిఏతో కలసి పలు దాడుల్లో పాల్గొని పోలీసులకు కునుకు పట్టకుండా చేశారు. ఇలా ప్రజాపోరాటాలలో రాటుతేలుతూ రాజకీయంగా చైతన్యవంతులవుతున్న ప్రజలకు పార్టీ విప్లవజేజేలు పలికింది. ★

## *ప్రతి విప్లవంలోనూ, రాజ్యాధికార ప్రశ్నే మౌలిక ప్రశ్న ...*

"ప్రతి విప్లవంలోనూ, రాజ్యాధికార ప్రశ్నే మౌలిక ప్రశ్న. ఉపరితలం లోని అన్ని శాఖలలోనూ - భావజాలం, మతం, కళలు, న్యాయ శాస్త్రం, రాజ్యాధికారం - రాజ్యాధికారమే కేంద్ర సమస్య. సర్వం రాజ్యాధికారమే. అది లేకపోతే, మొత్తం చేజారిపోతుంది. అందుచేత రాజ్యాధికారాన్ని గెల్చుకున్న తర్వాత ఎన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చినప్పటికీ కార్మిక వర్గం రాజ్యాధికారాన్ని ఎన్నడూ విస్మరించకూడదు. తన దిశను ఎన్నడూ మరవనేకూడదు. కేంద్ర సమస్యను తన దృష్టిలోంచి పోనీయనే కూడదు. రాజ్యాధికారాన్ని గురించి మరిచి పోవడం అంటే రాజకీయాల గురించి మరిచి పోవడమే. మార్క్సిజపు మౌలిక సిద్ధాంతాన్ని మరిచి పోవడమే. ఆర్థికవాదం, అరాచకవాదం, ఊహా స్వర్గవాదాలకు మళ్ళడమే. మందబుద్ధులవడమే. కార్మిక వర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య సిద్ధాంత రంగం లోని వర్గ పోరాటం అంతిమ విశ్లేషణలో నాయకత్వం కోసమై సాగే పోరాటమే. దోపిడీ వర్గాలు ప్రజల చేతుల్లో నిరాయుధం చేయబడ్డాయి. వారి అధికారం వారి నుండి లాక్కోబడింది. అయితే, వారి అభివృద్ధి నిరోధక భావాలు వారి మెదడుల్లో పాతుకుపోయి వున్నాయి. మనం వారి పాలనను కూలదోశాం, వారి ఆస్తిని జప్తు చేసుకున్నాం. అయితే, వారి బుర్రల నుండి అభివృద్ధి నిరోధక భావాలను కూడా తొలగించి వేశాయనేది దీని అర్థం కాదు. దోపిడీ వర్గాలు, శ్రమజీవి ప్రజానీకంపై తమ వేల ఏళ్ళ పాలనలో, తమ అభివృద్ధి నిరోధక రాజ్యాధికారాన్ని పటిష్ట పర్చుకోడానికిగాను, శ్రమజీవి ప్రజానీకం సృష్టించిన సంస్కృతిపై గుత్తాధిపత్యం నెరిపి, శ్రమజీవి ప్రజానీకాన్ని మోసం చేసి, అవివేకుల్నిగా చేసి, వారి మెదడులను గిడసబారేటట్లు చేయడానికై అదే సంస్కృతిని తిరిగి వాడారు. వేల సంవత్సరాలుగా వారి భావజాలమే పెత్తనం చెలాయిస్తోంది. అది అనివార్యంగానే సమాజంలో విస్తృత ప్రభావాన్ని కలగచేసింది. తమ అభివృద్ధి నిరోధక పాలన కూలదోయబడడాన్ని చూసి సమాధానపడలేక వారు, పెట్టుబడిదారీ విధానపు రాజకీయ, ఆర్థిక పునరుద్ధరణ కోసం సన్నద్ధమవడానికై ప్రజాభిప్రాయాన్ని తీర్చి దిద్దడానికి గతం నుండి కొనసాగుతూనే వున్న యీ ప్రభావాన్ని వాడుకో చూస్తారు. విముక్తి నాటినుండి, 'మూడు కుటుంబాల గ్రామ'పు కటిక పార్టీ వ్యతిరేక, సోషలిస్టు వ్యతిరేక పంథా బహిర్గత పర్చబడిన నేటి వరకూ యీ పదహారేళ్ళలో సిద్ధాంత, సాంస్కృతిక రంగాలలో నిరంతరాయంగా సాగిన పోరాటం, పునరుద్ధరణకై ప్రయత్నిస్తున్న శక్తులకు, పునరుద్ధరణను వ్యతిరేకిస్తున్న శక్తులకు మధ్య పోరాటమే.

"రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోడానికై, బూర్జువా విప్లవకాలంలో బూర్జువాలు యిదే విధంగా బూర్జువా సాంస్కృతిక విప్లవాన్ని ఆరంభించడం ద్వారా సిద్ధాంత సన్నాహాలతోనే మొదలు పెట్టారు. ఒక దోపిడీ వర్గం స్థానం లోకి మరో దోపిడీ వర్గం ప్రవేశించిన బూర్జువా విప్లవం కూడా పదేపదే వెనకడుగు వేయవలసి వచ్చింది. పలు పోరాటాలను చవి చూడవలసి వచ్చింది - విప్లవం, ఆపై పునరుద్ధరణ, అటుపైన పునరుద్ధరణను కూలదోయడం. పలు ఐరోపా దేశాలకు, సిద్ధాంత సన్నాహాలు ఆరంభించినప్పటి నుండి అంతిమంగా రాజ్యాధికారాన్ని గెల్చుకునే దాకా, తమ బూర్జువా విప్లవాలను పూర్తి చేయడానికి వందల ఏళ్ళ కాలం పట్టింది. కార్మిక వర్గ విప్లవం సమస్త దోపిడీ వ్యవస్థలను సంపూర్ణంగా అంతమొందించే లక్ష్యం గల విప్లవం కాబట్టి, దోపిడీ వర్గాలు తమ పరిపాలనను పునరుద్ధరించ యత్నించకుండా, మేక పిల్లల్లా తమ ప్రత్యేక హక్కులనన్నింటినీ తొలగించి వేయడానికి కార్మిక వర్గాన్ని అనుమతిస్తారని అసలు వూహించనే కూడదు. సమాధాన పడని యీ వర్గాలలోని మిగిలి పోయిన సభ్యులు, లెనిన్ చెప్పినట్లుగా, తాము కోల్పోయిన స్వర్గాన్ని తిరిగి చేజిక్కించుకోడానికై సమరంలోకి పదిరెట్లు ఎక్కువగా వుండే క్రోధంతో దూకుతారు. కృశ్చేవ్ రివిజనిస్టు ముఠా సోవియట్ యూనియన్‌లో పార్టీ, సైన్యం, రాజ్యాల నాయకత్వాన్ని దొంగ చాటున చేజిక్కించుకుంది అనే వాస్తవం ప్రపంచమంతటి లోని కార్మిక వర్గానికి ఒక అతి గంభీర గుణపాఠం. నేడు చైనాలోని బూర్జువా ప్రతినిధులు, బూర్జువా 'పండితులు', 'అధికారులు' సరిగ్గా పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించాలనే కలలు కంటున్నారు. వారి రాజ్యాధికారం కూలదోయబడినప్పటికీ, వారు తమ విద్వత్ 'అధికారాన్ని' నిలబెట్టుకోడానికి, తిరిగి అధికారంలోకి రావడానికి ప్రజాభిప్రాయాన్ని తీర్చి దిద్దుకోడానికి, ప్రజలను, యువజనులను, యిప్పటికింకా మనకు జన్మించని తరాలను తమవైపు తిప్పుకోడానికి యిప్పటికి కుక్క పాట్లు పడుతూనే వున్నారు.

"బూర్జువాలు నడిపిన భూస్వామ్య వ్యతిరేక సాంస్కృతిక విప్లవం వారు అధికారం చేజిక్కించుకోగానే ముగిసింది. అయితే, శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం, అన్ని దోపిడీ వర్గాల భావజాలానికి వ్యతిరేకమైన సాంస్కృతిక విప్లవం. ఈ సాంస్కృతిక విప్లవం, బూర్జువా సాంస్కృతిక విప్లవానికి పూర్తిగా భిన్నమైనది. శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న దరిమిలా, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ముందు పరిస్థితులను సృష్టించుకున్న తర్వాతనే శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవానికి అతి విశాలమైన చోట తెరవబడుతుంది."

— కామ్రేడ్ మావో

దోపిడీ వ్యవస్థ ఫలితమే అవినీతి కుంభకోణాలు

# కుంభకోణాల్లోకెల్లా మహా అవినీతి కుంభకోణం – తెల్గీ స్టాంప్ పేపర్ల కుంభకోణం

## ఎవరీ తెల్గీ?

తెల్గీ కర్ణాటక రాష్ట్రానికి చెందిన బెల్గాం జిల్లావాడు. మొదట్లో ఒక హోటల్ వర్కర్‌గా పనిచేస్తూండేవాడు. ఆ రోజుల్లో మార్కెట్లో స్టాంప్ పేపర్లు కొరతగా ఉన్నాయన్న విషయాన్న కస్టమర్ల (హోటల్‌కు వచ్చే గిరాకీదార్ల) ద్వారా అర్థం చేసుకున్నాడు. ఈ పని మనమెందుకు చేయకూడదు? ఈ కొరత తీర్చడం పనిగా పెట్టుకుంటే మంచి లాభసాటి వ్యవహారంగానే ఉండగలదని ఊహించాడు. దానితో రంగంలోకి దిగాడు. అడ్డదారులన్నీ అర్థం చేసుకున్నాడు. తుదకు 1991-92 నాటికి స్టాంప్ పేపర్ల అమ్మకం వ్యాపారంలోకి దిగాడు. మొదట్లో కలకత్తాలోని వ్యాపారస్థులైన అశిష్ తదితరుల నుండి నకిలీ స్టాంపులను పొందేవాడు. క్రమంగా దొంగ నోట్ల (స్టాంప్ వెండర్స్) ముద్రణ గూర్చి తెలుసుకున్నాడు. 1995-96 నాటికి ముద్రణా ప్రెస్ పెట్టుకున్నాడు. దీనికి కావలసిన యంత్రాలన్ని మహారాష్ట్రలోని నాసిక్ ప్రభుత్వ ముద్రణాలయం నుండే చేకూర్చుకున్నాడు. అక్కడ యంత్రాలకు కాలం చెల్లిపోయినట్టుగా అధికార్లచే నమ్మింపచేసి వాటిని మార్కెట్లో వేలం(అమ్మకానికి) పెట్టించాడు. వాటిని తెల్గీయే ధర పలికి కొన్నాడు. యంత్రాలు సమకూర్చుకున్న తెల్గీకి అందుకవసరమైన కాగితాలు కావలసి వచ్చింది. స్టాంపులకు వాడే ప్రత్యేకమైన కాగితం బహిరంగ మార్కెట్‌లో సాధారణంగా దొరకదు. కానీ తెల్గీకి అడ్డేముంది? సాధారణ పరిస్థితుల్లో కానీ ఏ వ్యవహారమైనా ప్రత్యేక పరిస్థితుల్లో పూర్తి చేసుకోగల దిట్ట తెల్గీ. అందుకే ఏకంగా ప్రభుత్వానికి సరఫరా చేసే ఏజంటు నుండే గుజరాత్‌లో ఇంకులు, పేపరు కొనుగోలు ప్రారంభించాడు. యంత్రాలు, కాగితం, ఇంకులు సమకూర్చుకున్నాక ఇక మిగిలింది వాటిని మార్కెట్‌లోకి విడుదల చేయడమే - కాబట్టి ఇందుకు తగిన యంత్రాంగాన్ని కూడా సులభంగానే ఏర్పర్చుకున్నాడు. 'పెట్టుబడిదారీ విధానం నిరుద్యోగాన్ని ఉత్పత్తి చేస్తుంద'న్న వాస్తవాన్ని గ్రహించిన తెల్గీ ఈ దేశంలోని కోట్లాది నిరుద్యోగ సైన్యం నుండే యంత్రాంగాన్ని ఏర్పర్చుకున్నాడు. ముఖ్యంగా లంపెన్ శక్తులు ఇలాంటి పనుల్లో సరిగ్గా ఇమిడిపోతారని తన జీవితానుభవం నుండి అర్థం చేసుకున్న తెల్గీ అలాంటి వారికే పని కల్పించాడు. అందులోనూ పెద్దపెద్ద డిగ్రీలు (యంబిఏ లాంటివి) పుచ్చుకున్నవారు కూడా చేరిపోవడం యాదృచ్ఛికమేమీ గాదు. ఇది వారి దుస్థితిని ఎత్తిపడుతుంది. కుళ్లిన ఈ వ్యవస్థను చక్కగా వ్యక్తీకరించే యంత్రాంగమిది. దేశవ్యాప్తంగా విస్తరించిన వల ఇది. దీని కేంద్రం ముంబాయి. దీని వెనుక మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చగన్ భుజ్‌బల్ నుండి నేర జగత్తునేత దావూద్ ఇబ్రహీం వరకున్నారు. - ఇలా ఇంతటి బందోబస్తు ప్లానుతో, పథకం ప్రకారం నకిలీ స్టాంపు పేపర్లు జనాల్లోకి వెళ్లాయి. అసలు సూత్రదారి మాత్రం అబ్దుల్ కరీం తెల్గీయె. అయితే మొదట తన ప్రాంతానికే చెందిన క్రిస్టోఫర్ అనే సహ వ్యాపారిని లాభాల పంపకాల ఘర్షణలో చంపి శవాన్ని కాల్వలో పడేసిన ఒక హంతకుడు కూడా తెల్గీ. తన కేసులకు సాక్ష్యంగా ఉన్నాడన్న అమీర్ మహమ్మద్‌ను అక్టోబర్ '03లో మరో హత్య కేసులో చంపించాడు. - ఇలా ఎన్ని హత్యలైనా చేయగల నేర్పరి, చేయించగల దిట్టా. ఇది తెల్గీ చరిత్ర.

## స్టాంపు పేపర్లు అంటే...

స్టాంపు పేపర్లు అనేక రకాలుగా ఉన్నాయి. రెవెన్యూ స్టాంపులు, కోర్టు ఫీసు స్టాంపులు, ప్రత్యేక అడ్‌హెసివ్ స్టాంపులు, విదేశీ బిల్లు స్టాంపులు, షేర్ బదిలీ స్టాంపులు, పోస్టల్ స్టాంపులు, భీమా పథకాల స్టాంపులు, నాన్-జుడీషియల్ స్టాంపు పేపర్లు , బ్రోకర్ నోట్లు మొదలైనవి ఇందులో ఉన్నాయి. ప్రజలు ప్రభుత్వంతో గానీ, ప్రభుత్వేతర సంస్థలతో గానీ జరిపే ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధత కల్పించడమే స్టాంపుల ఉద్దేశ్యం. కాబట్టి ప్రజల దైనందిన జీవితంలోని అనేక వ్యవహారాలలో ఈ స్టాంపులు అవసరమవుతాయి. ఆస్థుల అమ్మకాలు-కొనుగోళ్లు నుండి ఉద్యోగస్థులు జీతం పుచ్చుకునే వరకు స్టాంపులను వాడడం ఒక ప్రామాణికంగా వ్యవహరించబడుతోంది. సమస్య లుత్పన్నమైనపుడు వీటి ఆధారంగానే చట్ట భద్రత ఏర్పడుతుంది. అంటే ప్రజల జీవితాల్లో అత్యంత సన్నిహితంగా అల్లుకుపోయిన ఈ స్టాంపుల వ్యవహారంలోకి తెల్గీ దిగాడన్నమాట. ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు ముప్పై కాయలుగా పండించుకోవడానికి ఎలాంటి నేరానికైనా వెనుకాడేవాడు కాడు. ఎంతటి పెద్ద మొత్తంలోనైనా లంచం డబ్బులు చెల్లించి తన పనులను సాఫీగా నడుపుకోవడానికి పూనుకునేవాడు. ఎందుకంటే, తెల్గీ అనుచరులు ఒక్కొక్కరు రోజుకు 50 వేల రూపాయిల నకిలీ స్టాంపులను అమ్మేవారంటే వీటికి గల గిరాకీని అర్థం చేసుకోవచ్చు. వారి లాభాలు ఎంత మొత్తంలో ఉండేవో తేలిగ్గానే ఊహించవచ్చు. నిజానికి ఈ స్టాంపు పేపర్లు అమ్మడానికి ప్రభుత్వ అనుమతి (లైసెన్స్) ఉండాలి. ప్రభుత్వం అందించే స్టాంపు పేపర్లనే కొనుగోలుదార్లకు అమ్మాలి. ఈ వ్యవహారం నడిపినందుకు బ్రోకర్ల(వెండర్స్)కు కమీషన్ లభిస్తుంది. కానీ, ఇపుడు ప్రభుత్వ స్టాంపు కాగితాలు పక్కన పెట్టి ఈ బ్రోకర్లు, ఆఫీసుల్లోని గుమాస్తాలు ప్రభుత్వ నియమాలను ఉల్లంఘిస్తూ ఏకంగా నకిలీ స్టాంపులనే అమ్మడం ప్రారంభించారు. దీనితో వీరికి అదనంగా తెల్గీ అందించే మామూళ్లతోపాటు ప్రభుత్వ జీతం వస్తూ ఆదాయాన్ని అనేక రెట్లు పెంచాయి.

## తెల్గీ వల విసిరే తీరు - వ్యాపార విస్తరణ

తెల్గీ తన వ్యాపారంలో చాల చతురుడని అతిని పనిపద్ధతులు తెలియజేస్తున్నాయి.తెల్గీ ఎక్కడైనా తన వ్యాపారాన్ని మొదలు పెట్టాలంటే ఒకేసారి అనేక మందితో సంబంధాల్లోకి వెళ్లేవాడు కాడు. రాజకీయాల్లో పలుకుబడి ఉన్న వ్యక్తిని ఆశ్రయించేవాడు. ఆపై ఇతనికి తెలవకుండా ఇంకెవరిని కలిసేవాడు కాడు. ఇతడికి తెలిసే తన వ్యాపార విస్తరణకు పూనుకునేవాడు. ఆపై రెండవ దశలో మొదయి వ్యక్తి ద్వారానే `నమ్మకమైన సంబంధాలను' సంపాదించుకొని సంబంధాల గొలుసును నిర్మించుకునే వాడు. వీరే రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులను సరఫరా చేయడానికి కుదిరేవారు. వీరి పనిని బట్టి వీరికి వేతనాలు ఉండేవి. ప్రభుత్వ ప్రెస్ స్టాంపులను వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయడంలో గల అనేక అవకతవకలు తెల్గీ వ్యాపారం బ్రహ్మాండంగా సాగడానికి తోడ్పడినాయి. స్టాంప్ పేపర్ల కొరత మార్కెట్లో ఎంతగా ఉందంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రు.126 కోట్ల స్టాంపు కావాలని ప్రభుత్వం ప్రెస్ వారిని కోరితే కేవలం 10 కోట్ల రు.ల విలువ గల స్టాంపులనే అందించింది. 16 కోట్ల రు.ల కోర్టు స్టాంపులు కావాలంటే రు. 2 కోట్ల విలువ గలవి అందజేసిందంటేనే వీటి కొరత తెలుసుకోవచ్చు. ఇంతటి కొరతే తెల్గీకి కోట్ల పంట పండించింది.

## నకిలీ వ్యాపారంలో తెల్గీకి తోడు దొంగలు ఎవరు?

తెల్గీ దొంగ వ్యాపారం వెనుక ఎందరెందరిదో హస్తం ఉంది. అధికార

పక్షం, ప్రతిపక్షం అనే ఎలాంటి తేడాలు లేకుండా అన్ని రాజకీయ పక్షాల బద్మాషులకు ఈ వ్యవహారంతో బలమైన సంబంధం ఉంది. ప్రభుత్వంలోని కింది స్థాయి ఉద్యోగుల ప్రమేయం ఎలా ఉన్నా అన్ని స్థాయిల్లోని ముఖ్యంగా ఉన్నతాధికారుల జోక్యం బలంగా ఉంది. ఎలాంటి నీతి నియమాలు లేని వీరికి డబ్బే ఒక ప్రపంచం, డబ్బే సర్వస్వంగా తయారై ప్రజల ఆస్తుల వ్యవహారం ప్రమాదకరంగా మారింది. అనేక రాష్ట్రాల ప్రభుత్వ ఆదాయాలనకు గండి పడింది. ఫలితంగా దేశం అట్టుడికిపోతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే 20 మంది వరకు అరెస్టయ్యారు. మరెంతో మందిపై విచారణ కొనసాగుతోంది.

వీరిలో ప్రజల అభివృద్ధి గూర్చి పదేపదే గొప్పగా వాగుతూ తెలుగు ప్రజలను నిత్యం వంచిస్తున్న తెలుగుదేశం పార్టీకి చెంది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సన్నిహితుడుగా పేరొంది మంత్రి పదవి చేజిక్కించుకున్న క్రిష్ణ యాదవ్ ఇప్పుడు పూనేలో కటకటాలు లెక్కిస్తున్నాడు. ఇతగాడు తనతోపాటు ఇంకెందరిదో పొత్తు ఉందంటున్నాడు. కర్ణాటకలో లఘు ఉద్యోగ శాఖామంత్రి రోషన్ బేగం ఈ కుంభకోణం ఫలితంగానే జనవరి 4నాడు రాజీనామా చేశాడు. మహారాష్ట్రలో ధూలే నుండి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన అనిల్ ఘోటే కూడా సలాకాల వెనుకకు చేరిండు. వీరిని మించిన మరో మరాతా మహార్ చగన్ భుజబల్ - ఇతగాడు మొదట ఉగ్ర శివసైనికుడు. తర్వాత శరద్ పవార్ పంచన చేరిండు. ఇప్పటి వరకూ మహారాష్ట్రలోని పొత్తుల సర్కార్‌లో పోలీసు మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా వెలగబెడుతూ వచ్చాడు. ఈ వ్యవహారంలో తన అసలు గుట్టంతా బయటపడనున్న దనుకొని, త్వరలో రానున్న ఎన్నికల్లో సీరియస్ ప్రమాదమే ముంచుకురానుందన్న ముందస్తు అంచనాతో చివరకు డిసెంబర్ రెండవ వారంలో (9.12.03) అన్ని పదవులకు రాజీనామా సమర్పించి ఖాకీల నిలయానికైనా వెళ్లకుండా తప్పించుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన సిందే మంత్రివర్గంలోని 19 మంత్రుల పేర్లు తెల్గీ డైరీల్లో స్పష్టంగా రాసి ఉన్నాయంటున్నారంటే ఇదెంత పెద్దెత్తున జరిగిన అవినీతి, అపరాధ వ్యవహారమో అర్థం చేసుకోవచ్చు. వీరే కాకుండా మహారాష్ట్రలోని 27కి పైగా అత్యున్నత పోలీసు అధికారులు అరెస్టయిన వారిలో ఉన్నారు. ఇంతమంది ఐపిఎస్ అధికారులు ఇలా అరెస్టవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని పత్రికలు రాస్తున్నాయి. అరెస్టయిన వారిలో ముంబాయి పోలీసు కమిషనర్ ఆర్.ఎస్.శర్మ, సహాయ కమిషనర్ శ్రీధర్ వాగలే, పూణే సహాయ పోలీసు కమిషనర్ యం.సి.ములాని లాంటి వారున్నారు. ఇంతేకాదు. మహారాష్ట్ర పోలీసు డిఐజిగా పనిచేసిన సుభాష్ మల్హోత్రా, డిజిపి (సిఐడి)గా పనిచేసిన టికె చౌదరి లాంటి వాళ్లు కూడా ఇందులో భాగస్థులే నసే వార్తలు వెల్లడవుతున్నాయి. నిజానికి తెల్గీ నేర సామ్రాజ్యం 1995-2001 మధ్య ముంబాయిలో విస్తరించడానికి తోడ్పడిందంతా వీరే. వీరికి తెల్గీ ముట్టచెప్పిన - వీరి డబ్బంతా విదేశీ బ్యాంకుల్లో పోగుబడుతోంది. శరద్ పవార్ చలవతో ముంబాయిలో బలపడి ప్రస్తుతం విదేశాలకు మారిన దావూద్ ఇబ్రహీం వరకు తెల్గీ సంబంధాలు ఉన్నట్టు చెప్పుతున్నారు. ఈ పోలీసు అధికారుల్లో చాలా మందికి నేర ప్రపంచంతో నిత్య సంబంధాలున్నాయన్నది బహిరంగం అయినా వీళ్ళెవరూ టెర్రరిస్టులు కారట. - తెల్గీకి తోడ్పడిందంతా

### న్యాయం పోకడ

*దేశంలో గత 15 సంవత్సరాల్లో 14 పెద్దపెద్ద అవినీతి కుంభకోణాలు వెలుగు చూశాయి. ఇక చిన్నవి అనేకం వచ్చాయి. పెద్దవాటిలో బోఫోర్సు (64కోట్లు), జర్మన్ జలాంతర్గాములు (32.55 కోట్లు), ఎయిర్ బస్(120కోట్లు), ఇండియన్ బ్యాంకు (762.92 కోట్లు), షేర్ల కుంభకోణం(4100 కోట్లు),కేతన్ పరేఖ్(3297 కోట్లు), పశువుల దానా (150 కోట్లు), టెలికాం(1200 కోట్లు), యూరియా (133 కోట్లు), గృహ నిర్మాణం (65 కోట్లు) ముఖ్యమైనవి. ఇప్పుడు తెల్గీ కుంభకోణం (32,000 కోట్లు) - ఇది అన్నింటినీ మించింది. వెలుగు చూసిన మొత్తం 15 కుంభకోణాలు 55,456 కోట్ల విలువ గలవి. వీటికి తెల్గీ కలిస్తే 89,456 కోట్లు అన్నమాట. వీటన్నింటిలో (తెల్గీని విడిచి) దోషులుగా తేలిందెవ్వరూ లేరు. కాకపోతే 1200కోట్ల రు.ల టెలికాం కుంభకోణంలో 5 కోట్లు వసూలు అయ్యాయి. ఇదీ ఈ దేశంలో న్యాయం పోకడ. శిక్షల తీరు.*

ఈ అవినీతిమయ పోలీసు ఉన్నతాధికారులేనని ఈ కేసును సమీక్షించిన డిఐజి సుబోద్ జైస్వాల్ అన్నాడు. తొలినుండి తెల్గీ వ్యవహారం సాఫీగా సాగడానికి పోలీసు మంత్రి భుజబల్‌కు 20 కోట్లు ముట్టాయన్న ఆరోపణలు రావడం గమనార్హం. ఇంతేకాదు 2001 మధ్యలో అరెస్టయిన తెల్గీకి జనవరి 2003 వరకు పోలీసు వ్యవస్థ సకల సౌకర్యాలు కల్పిస్తూ వచ్చింది. ఇవి ఏ స్థాయికి దిగజారాయంటే, ఈ దుర్మార్గుడిని జైల్లో కాకుండా ఏడేసి తారల (సెవెన్ స్టార్) హోటళ్లలో, లాడ్జింగ్‌ల్లో తిప్పారు. ఇంటికి వెళ్లడానికి అనుమతించారు. అన్ని పనులు సవరించుకోవడానికి సెల్ ఫోన్ సౌకర్యం కల్పించారు. సొంత కార్లో కోర్టులకు హాజరు పర్చారు. మరీ సిగ్గుమాలిన విషయం ఏమంటే పోలీసులు తెల్గీకి కాళ్ళొత్తడం, మాలిష్ చేయడం వరకు జరిగిందంటే వీడెంతటి రాజమర్యాదలు అందుకున్నాడో తెలుసుకోండి! మహారాష్ట్రలో ప్రజాసేవ కార్యకర్తగా పేరొందిన అన్నా హజారే ఓ దశలో ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని సిబిఐచే న్యాయ విచారణ జరిపించాలని ముంబాయి హైకోర్టులో ఒక ప్రజాహిత రిట్ దరఖాస్తును వేయడంతో విషయం కొంత వేడెక్కింది. అంతే తప్ప కేసు నత్తనడకే నడుస్తోంది.

## ఈ కుంభకోణం వెలుగు చూసిందెలా!

తెల్గీ దొంగ స్టాంపుల వ్యవహారాన్ని మొదటి నుండి లిటిగేషన్‌లతోనే నడుస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో ఎన్నో కేసులు తెల్గీపై నమోదానాయి. కానీ ఆయా రాష్ట్రాల్లోని పెద్ద తలలతోనే, ఖాకీ సాయబులతోనే సంబంధాలు రావడంతో ఎక్కడా, ఏ కేసూ సరిగా నడవలేదు. ఈ క్రమంలో కొన్ని ఎన్‌జిఓలు (ఎగైర్ సర్కారీ సంస్థలు), మహారాష్ట్రలో సంఘ సేవకుడిగా చెప్పుకునే అన్నా హజారే, ఒక ప్రైవేట్ టి.వి. చానల్ వారు రంగంలోకి దిగారు. వీరు ముంబాయి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యానికి శ్రీకారం చుట్టారు. దీనితో కేసుపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఇక ఆ తర్వాత తీగ లాగితే డొంకంత కదలినట్టు అనేక విషయాలు బయటపడుతూ ప్రజల ముందుకు వస్తున్నాయి.

## కేసు సిఐబి విచారిస్తే జరిగేదేంటి?

అనేక రాష్ట్రాలతో ముడిపడిన ఇంతటి భారీ అపరాధ కేసును సిబిఐ దర్యాప్తు చేయాలని ముఖ్యంగా భాజపా నేతలు కొంతమంది డిమాండ్ చేస్తున్నారు. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి) ద్వారానే దర్యాప్తు జరిపిస్తామని షిందే మొండిగా వ్యవహరిస్తున్నాడు. కానీ ఎవరు దర్యాప్తు చేసినా అందరూ ఒకే తానులోని ముక్కలు. ఈ దేశంలో ఇప్పటికి వెలుగు చూసిన ఎన్నెన్నో కుంభకోణాలు సిబిఐ దర్యాప్తు చేసినా అవినీతిపరులు శిక్షింపబడలేదన్నది ఒక నిజం, ఇలాంటి అన్ని కేసులూ నత్తనడకే నడుస్తాయన్నది మరో నిజం. బోఫోర్సు కుంభకోణం గానీ, పశువుల దానా కుంభకోణం గానీ, షేర్ల కుంభకోణం గానీ, తెహల్కా కుంభకోణం గానీ, జుదేవ్ టేప్‌కాండ్ లో గానీ సాధించిన ప్రగతి ఏంటి? వందలాది కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. మరీముఖ్యంగా, ప్రపంచీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా కుంభకోణాల వ్యవహారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నీతి, నిజాయితీ, ప్రజాహిత రాజకీయ విలువలు దినదినం అడుగంటిపోతున్న ఈ కుళ్ళిన వ్యవస్థలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దేశ ప్రధానులపై కూడా అనేక ఆరోపణలు నమోదవుతున్నాయి. కానీ, ఇప్పటివరకు ఈ దేశ 'స్వతంత్ర' చరిత్రలో ఏ అవినీతి కుంభకోణాన్నైనా సిబిఐ నిరూపించగలిగిందా? ప్రత్యేక దర్యాప్తు బృందాలు నిరూపించగలిగాయా? అంటే, ఇవేవీ ఏమి చేయలేదనే చరిత్ర సాక్ష్యం చెబుతోంది. ప్రస్తుతం తెల్గీ వ్యవహారంపై పరిశోధన లోతుగా, వేగంగా జరగకుండా అనేక 'అజ్ఞాత శక్తులు' అడ్డుకుంటున్నాయని ఎస్ఐటి అధికారులే వాపోతున్నారంటే న్యాయానికి చోటెక్కడుంటది?

## ఈ దేశ న్యాయవ్యవస్థను నమ్మేదెవరు?

ఇంతటి దుర్మార్గాలకు ఒడిగట్టిన ఏ ఒక్కరి మీద కూడా పోలీసులు పోటాను పెట్టలేదు. కనీసం మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టాన్నైనా (MCOCA- మకోకా -ను కూడా)ముఖ్యమైన నేరస్థులపై నమోదు చేయలేదు. మరోవైపు జనవరి 17-18 తేదీలలో ఢిల్లీలో జరిగిన ఎస్ఐటి ఉన్నత అధికారుల

సమావేశంలో దేశ ప్రధాని ప్రసంగిస్తూ నేరస్థుల, ఉగ్రవాదుల వ్యవస్థీకృత నేరాల గూర్చి సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని, కఠినంగా శిక్షించాలని అన్నాడు. కానీ, నిజానికి ఇతడి దృష్టిలో తెల్గీ, భుజబల్, ఆర్ఎస్ శర్మ, క్రిష్ణ యాదవ్,అన్నా ఘోటే లెవరు కూడా నేరస్థులు కాదు, వీరెవరూ ఉగ్రవాదులంతకంటేనూ గాదు. కాగా, ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను పరిశీలించినా ఘరానా నేరస్థులెవరికీ శిక్షలు పడవన్న సామాన్యుడి భావన మరింత బలపడుతోంది. అనేక కుంభకోణాలు ఎదుర్కొన్న మాజీ ప్రధాని పివి నరసింహారావును నిర్దోషిగా ప్రకటించింది. ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితను నిర్దోషిగానే తెలిపింది. ఇంకా ఎందరెందరో ఇలాంటి పెద్దలకు ఆ అత్యున్నత న్యాయస్థాన చలవ ఉందనడానికి ఎన్నైనా ఉదాహరణలు ఇవ్వవచ్చు. కానీ ఇదే సుప్రీంకోర్టు ఈ మధ్యనే కార్మికులు, ఉద్యోగస్థుల సమ్మె హక్కును కాలరాచివేసిందంటే ఈ న్యాయవ్యవస్థ ఎవరి పక్షమో తెలిపోయింది.

తమ న్యాయమైన డిమాండ్లపై పోరాడే రైతులను, కార్మికులను, ఉద్యోగస్థులను అక్రమంగా అరెస్టులు చేయడం, వారిపై నల్ల చట్టాలను ప్రయోగించడం నిత్యం చూస్తున్నాం. మరీముఖ్యంగా ఈ వ్యవస్థతో సాయుధంగా పోరాడుతున్న పోరాటకారులపై, విప్లవకారులపై, దుర్మార్గమైన నల్లచట్టాలను ప్రయోగిస్తోంది. తెల్గీ వద్ద 2124 కోట్ల రూపాయిల విలువ చేసే దొంగ పత్రాలను పట్టుకున్నా, అతడి భార్యాబిడ్డల కార్లో కోట్ల విలువ చేసే కట్టల కొద్దీ దొంగ పత్రాలు లభించినా వారిని ప్రశ్నించిన పాపాన పోలేదు. తెల్గీపై 1992 నుండి 2001మధ్య ఎన్నో కేసులు కోర్టుల్లో మూలుగుతున్నా వాటిపై తీర్పు ఇచ్చి వాడిని కఠినంగా శిక్షించడం లేదు. వాడితో సంబంధాలు పెట్టుకున్న వాళ్లను శిక్షించడం లేదు. కానీ, మన దండకారణ్యంలో మాత్రం ఒక సాధారణ ఆదివాసీ పల్లెల్లోని ప్రజలను అక్రమంగా, దౌర్జన్యంగా అరెస్టులు చేయడం వారి ముందే వారి బిడ్డలను థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో హింసించి హతమార్చడం ఖాకీ పోలీసులకు అత్యంత స్వల్ప విషయంగా మారిందనడానికి డిసెంబర్ 15, 2003 నాడు ఖాకీల అరాచకానికి ప్రాణాలు కోల్పోయిన కోంటి వాచామి ఘటనగానీ, జలంతర్‌రామ్‌లో సిఆర్‌పిఎఫ్ కిరాతకానికి బలైన ఇద్దరు రైతుల జీవితాలు గానీ ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ప్రజల ప్రాణాలు తీయడమే గాకుండా, తమ చిత్తం వచ్చిన విధంగా 'పోటాను ప్రయోగిస్తున్నారు. అంటే ఈ వ్యవస్థలో పేద ప్రజలకు, పాలితులకు ఒక న్యాయం, ఉన్నత వర్గాలకు-పాలకులకు మరో న్యాయం అని అడుగడుగునా తెలుసుకోవచ్చు.

ఇది ఒక వర్గ వ్యవస్థ. ఈ వ్యవస్థలో న్యాయం కూడా వర్గ స్వభావాన్నే కలిగి ఉంటుంది. ఈ విషయాన్ని మరుగునపర్చడానికి పాలకవర్గాలు, వారి మీడియా ప్రజాస్వామ్యం గూర్చి ప్రజాస్వామ్యంలో న్యాయం అందరికీ సమానమేనని, రాజ్యాంగం అందుకొక సాక్ష్యం అని, ఎన్నికలు ఒక సాధనమని తెగ ప్రచారం చేస్తూ ప్రజలను ప్రక్కదార్లు పట్టిస్తూ, ప్రజల్లో అనేక దుర్భ్రమలు కలిగించడానికి నిరంతరం కిందామీద పడుతూన్నాయి. కానీ ఇదంతా ఒక బూటకం, ఇక్కడ పీడితులకు ప్రజాస్వామ్యం లేదు. స్వేచ్ఛా లేదు. స్వాతంత్ర్యం లేదు. మౌలిక హక్కులూ లేవు (ప్రాథమిక హక్కులు). ఈ వ్యవస్థలో నిజమైన నేరస్థులను శిక్షించే అవకాశమే లేదు. డబ్బు, హోదాతోనే ప్రతీదీ నిర్ణయించబడుతుంది. అందుకే ఈ వ్యవస్థను అంతం చేయాలి. కార్మిక-కర్షక పునాదిపై ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలి. ఇది పోరాటం ద్వారానే సాధ్యం. ఈ దేశంలోని లక్షలాది భద్రతా బలగాలు పాలకవర్గాల రక్షణకే ఉన్నాయి. సమాజ రక్షణ అంటే వారి రక్షణే. కాబట్టి ఇప్పుడు కొత్తగా చర్చల్లోకి వచ్చిన తెల్గీని గానీ, జుదేవ్‌ను గానీ, పివి నర్సింహారావును గానీ, జయలలితను గానీ ఈ వర్గానికి సంబంధించిన వాళ్లనెవరినైనా గానీ నిజంగా శిక్షించాల్సింది ప్రజలు, ప్రజాకోర్టులే. సరిగాను, న్యాయంగానూ శిక్షించగలిగేది వాళ్లే. వాటి కోసమే మనం పోరాడదాం. ★

---

*(..... 26వ పేజీ తరువాయి)*

చంపుతున్నారు. పీపుల్స్‌వార్, యంసిసిఐలకు చెందిన పలు నాయకత్వ కామ్రేడ్స్ దీర్ఘకాలంగా మయూర్‌భంజ్, సుందర్‌గడ్ జిల్లా జైళ్లలో మగ్గుతున్నారు. బాసదార ప్రాంతంలోని గుడారి గ్రామంలో ఈ మధ్యనే ఇద్దరు రైతుల్ని హతమార్చారు. దక్షిణాన గల 3 జిల్లాల్లో ఈ ఒక్క ఏడాదిలోనే వెయ్యిమంది రైతాంగాన్ని అరెస్టు చేసి జైళ్లల్లోకి నెట్టారు. శత్రువు ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్‌తోనూ, ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక బలగాలతోనూ సన్నిహిత సమన్వయం నేర్పర్చుకొని ప్రత్యక్షంగా సాగిస్తున్న దాడుల ముఖ్య కేంద్రాలలో కోరాపుట్ కూడా ఒకటి. ఒరిస్సా ప్రభుత్వం రాష్ట్ర సరిహద్దుల్లో ఆంధ్ర పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టడాన్ని అనుమతిస్తూనే, ఆంధ్ర గ్రేహౌండ్స్ నుండి ఒరిస్సా పోలీసులకు తిరుగుబాటు అణచివేత చర్యల్లో (కౌంటర్ ఇన్‌సర్జన్సీ ఆపరేషన్స్) ప్రత్యేక శిక్షణను కూడా ఇప్పిస్తున్నది.

కోరాపుట్, తదితర జిల్లాల్లోని పీడిత ప్రజలు తమను నిత్యం వేధిస్తూ చెప్పనలవిగాని దురాగతాలు సాగిస్తున్న శత్రు బలగాల ఈ ఓటమితో అమితానందం పొందారు. కోరాపుట్ దాడుల సన్నాహాలలోనూ, వాటిని జయప్రదంగా నిర్వహించడంలోనూ తమ క్రియాశీల మద్దతును అందించిన ప్రజానీకపు ఆకాంక్షలను కోరాపుట్ దాడులు ప్రతిబింబిస్తున్నాయి.

ప్రజలు ప్రజాయుద్ధాన్ని తుది విజయం వరకు కొనసాగించడానికి గాను శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో తమను తాము సాయుధం చేసుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ దిశలో కోరాపుట్ దాడి ఒక గొప్ప ముందంజ. గెరిల్లా సేనలను బలోపేతం చేసుకోవడానికీ, ఆ క్రమంలో వాటిని ప్రజా విముక్తి సైన్యంగా మార్చుకోవడానికీ ఈ దాడి మన రెండు పార్టీల గెరిల్లా బలగాల్లోనూ, మన దేశ విప్లవ ప్రజానీకంలోనూ అపారమైన విశ్వాసాన్ని కల్గిస్తూ ఉత్సాహపరుస్తుంది.

అచంచలమైన బోల్షివిక్ పట్టుదలతో, విప్లవ సాహసంతో, వీరోచితంగా, ధైర్యంగా మృత్యువును సవాల్ చేస్తూ కోరాపుట్‌లో వరుసగా ఏకకాలంలో ఎత్తుగడలపరమైన ఎదురుదాడులను జరిపిన పిజిఏ వీర గెరిల్లాలకు మేం, అంటే సిపిఐ (యం-యల్) [పీపుల్స్‌వార్] కేంద్ర కమిటీ, యంసిసిఐ కేంద్ర కమిటీలం మరొక్కసారి మా హృదయపూర్వక విప్లవాభినందనలు తెలుపుతున్నాం. అలాగే ఈ దాడులను జయప్రదం గానించడంలో అనేక రూపాలలో గెరిల్లాలకు సహకరించిన విప్లవ ప్రజానీకానికి కూడా మా ఎర్రెర్రని అభినందనలు!

సాయుధ గెరిల్లాలను ఎదుర్కోవడానికి భయపడే కిరాయి సాయుధ పోలీసు బలగాలు, పిరికిపందల్లా నిరాయుధ ప్రజలపై పాశవిక దాడులు జరిపే అవకాశం ఉన్నందున మేం ప్రజలు జాగరూకతతో ఉండాలని కోరుతున్నాం. శత్రువు చేపట్టే ముమ్మరమైన అణచివేత క్యాంపెయిన్లను ప్రజలు మరిన్ని కోరాపుట్‌లను సృష్టిస్తూ, వాడు తన ముఖ్య స్థావరాలలో కూడా జడుసుకు చచ్చేలా చేస్తూ ప్రతిఘటించాలి.

ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగిస్తున్న బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తున్న పోరాట ప్రాంత ప్రజలను అణచివేయడానికి, ముఖ్యంగా సాయుధ పోరాటాలు కొనసాగుతున్న ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ ఝార్ఖండ్, బీహార్, ఒరిస్సా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తదితర ప్రాంతాల్లోని విప్లవోద్యమాలను వేలాది పారా మిలటరీ బలగాలను ఉపయోగించి నెత్తురుటేర్లలో ముంచడానికి పాలకవర్గాలు పూనుకుంటున్నాయి. శత్రువు జరుపుతున్న అణచివేత క్యాంపెయిన్లను, కోరాపుట్‌లో పిజిఏ గెరిల్లాలు జయప్రదంగా సాగించిన దాడుల వలె ధైర్యంగా ప్రతిఘటించి ఓడించాలని ప్రజలకూ, పిజిఏ/పిఎల్‌జిఏ యోధులకూ మేం పిలుపునిస్తున్నాం.

| | |
|---|---|
| **కేంద్రకమిటీ** | **కేంద్రకమిటీ** |
| **సిపిఐ(యం-యల్)[పీపుల్స్‌వార్]** | **యంసిసిఐ** |

# విదర్భ ఒక వాస్తవం – నేటి విదర్భ నేతల పోరాటం మాత్రం ఒక మోసం

## నిజమైన ప్రజాపోరాటాల ద్వారానే ప్రజల కోరుకుంటున్న విదర్భ సాధ్యం!

## అదే మరాఠీ జాతి వికాసానికి ఖచ్చితమైన మార్గం!

### నేపథ్యం

భారత దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. జనాభా రీత్యా 10 కోట్లకు పైగావున్న మహారాష్ట్ర, వైశాల్యం రీత్యా కూడా ఒక పెద్ద రాష్ట్రమే. ప్రస్తుత మహారాష్ట్ర 1957 మే 1నాడు ఏర్పడింది. మహారాష్ట్రను సాధారణంగా నాలుగు ప్రాంతాలుగా విభజించి చెప్పుకుంటారు. విదర్భ, మరట్వాడా, కొంకణ్ మరియు పశ్చిమ్ మహారాష్ట్ర - ఈ నాలుగు ప్రాంతాలలో పశ్చిమ మహారాష్ట్ర గత 45 సంవత్సరాలలో సాపేక్షికంగా అభివృద్ధిచెందిన, సంపద్వంతమైన ప్రాంతంగా ముందుకు వచ్చింది. భారతదేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబాయి మహారాష్ట్ర రాజధాని కావడం, ఆ నగరంతో సహా రాష్ట్రం మొత్తంపైన పశ్చిమ మహారాష్ట్రదే ఆధిపత్యం. దీనికి ప్రధాన కారణం, పశ్చిమ మహారాష్ట్ర తన ఆధిపత్య ధోరణితో ఇతర ప్రాంతాల వనరులన్నింటిని సొమ్ము చేసుకోవడమేనని మిగతావాటి వెనుకబాటుతనమే చాటిచెప్తోంది. విదర్భ ప్రజలు తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని దీర్ఘకాలంగా చేస్తున్న డిమాండ్‌కు పశ్చిమ మహారాష్ట్రీయుల ఆధిపత్యంతో ఉద్యమం మరింత తీవ్రమైంది. ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలలో విదర్భ ఉద్యమానికి దీర్ఘకాల చరిత్రే ఉంది. కానీ నేతల విద్రోహం మూలంగా ప్రజల చిరకాల ఆకాంక్ష మరుగున పడిపోయి ఈ సమస్యపై గతకొద్ది సంవత్సరాలుగా స్తబ్దత నెలకొంది. అయితే గత 5,6 సంవత్సరాలుగా మాత్రం క్రమంగా తిరిగి ఉద్యమం పుంజుకుంటున్నది. ఇందుకు కారణం ఈ దేశంలో ఏనాటికానాడు ప్రజల్లో పెంపొందుతున్న జాతి రాజకీయ చైతన్యమే. ప్రజాస్వామిక వాంఛయే.




### చరిత్ర

చరిత్రలో విదర్భకు ఒక విశిష్ట స్థానం ఉంది. మహాభారత కాలంలోనూ విదర్భ ప్రస్తావన ఉన్నట్టుగా పౌరాణిక గ్రంధాలు తెలుపుతున్నాయి. వేదకాలంలోనూ వైదర్భగా ప్రాచుర్యంలో ఉన్నట్టు వేదాలు సూచిస్తున్నాయి. మధ్య యుగాల్లోనూ విదర్భ ఒక రాజ్యంగా దాని అస్థిత్వాన్ని కలిగే ఉంది. ఆనాడు ఛప్పన్నార్ భారత రాజ్యాలు (56)గా చెబుతున్న వాటిలో విదర్భ ఒకటి. బ్రిటిష్‌వారి హయాంలో కూడా విదర్భ విడిగానే తన అస్థిత్వాన్ని కలిగియుంది. కానీ, 1947లో స్వతంత్ర్యం సిద్ధించిందని చెప్పుకుంటున్న తర్వాత జరిగిన పరిణామాల్లో భాషాప్రయుక్త రాష్ట్రాల అవతరణ ఒక ముఖ్యమైంది - ఏ కాలంలో ఆ కాల పాలకులచే నిర్ణీతమైన ఎల్లలతో ఉంటూ వస్తూన్న విదర్భ 1957తో - భాషాప్రయుక్త రాష్ట్రాల అవతరణతో - దాని గుర్తింపును కోల్పోయింది. అప్పటివరకు మధ్యప్రదేశ్‌లో భాగంగా ఉంటూ వచ్చిన గడ్‌చిరోలి, బండారా, చంద్రపూర్‌లతోపాటు విదర్భ జిల్లాలు కొన్ని కలసి 8 జిల్లాలు మహారాష్ట్రలో విలీనమయ్యాయి. ఈ ఆదివాసీ బహుళ జిల్లాలన్నీ మరాఠీ భాషా ప్రాంతాలుగా నమోదయ్యాయి. సరిహద్దులు చెరిపివేస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఒక రాష్ట్రాన్ని ఏర్పర్చగలిగారే తప్ప భౌతికంగా ప్రజల ఆలోచనల్లో, ఆకాంక్షలలో సచేతనమైన మార్పు ఫలితంగా మాత్రం కాదని నేటికీ ఆరని ప్రజాపోరాటాల చరిత్ర ఘోషిస్తూనే ఉంది.

### సంపదలకు నిలయం విదర్భ

అపారమైన ప్రాకృతిక సంపదలతో తులతూగుతున్న ప్రాంతం విదర్భ. అనేక రకాల గనులు, ఖనిజాలతో విలసిల్లుతున్న ప్రాంతం ఇది. మూడు లక్షల కోట్ల రూపాయిల విలువ కలిగిన ఖనిజ రాశుల నిలయంగా దీనిని లెక్కలు వేస్తున్నారు. మహారాష్ట్రలోని 70 శాతం అడవులున్నది విదర్భలోనే. విదర్భలో మూడింటి ఒక ప్రాంతం అటవీ ప్రాంతం. ఇక్కడి టేకు వనాలు ఆసియా ప్రసిద్ధి చెందినవి. వెదురు వనాలు అనేక సంవత్సరాలుగా పలు కాగితపు పరిశ్రమలకు ముడి సరుకును అందిస్తున్నాయి. ఇందులో దీర్ఘకాలంగా ముడిసరకును అతి చౌకగా అందుకుంటున్న బల్లార్‌పూర్ (బల్లార్షా) పేపరు మిల్లు అతి ముఖ్యమైంది. ఇక్కడి చంద్రపూర్, కోరాడి, పారస్, కోపర్‌ఖేడా విద్యుత్ ప్రాజెక్టులలో పెద్దెత్తున విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. నీటి వనరులకు కొదువే లేదు. నల్ల రేగడి భూములలో ఇక్కడ పండే పత్తి అంతర్జాతీయ ప్రసిద్ధి చెందింది.

ఇక్కడి నారింజ తోటలు దేశ ప్రసిద్ధి చెందాయి. ధాన్ కా కటోరా (ధాన్యాగారం) భండారా వరికి ప్రసిద్ధి. సాంస్కృతికంగా కూడా గొప్ప వారసత్వాన్ని కలిగిన ప్రాంతం ఇది. అనేక సుందర ప్రాకృతిక కేంద్రాలను కలిగి ఉంది. పర్యాటకులను ఆకర్షిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగిన మహ ప్రజాపోరాటంలో విదర్భవాసులు కూడా పాల్గొని తమ వంతు పాత్ర తాము పోషించారు. ఆనాటి నుండే ఇక్కడి ప్రజల్లో తమకంటూ ఒక జాతి రాజ్యం ఏర్పడాలన్న భావన, ఆకాంక్ష వ్యక్తమవుతోంది. కానీ ఆనాడు జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక మహాసంగ్రామంలో దేశ ప్రజలందిరితో కలసి సమైక్యంగా నిలిచి పోరాడారు.

రెండు కోట్ల పది లక్షల జనాభాతో, తగినంత భూభాగంతో, కొన్ని ఆదివాసీ మైనార్టీ భాషలున్నప్పటికీ ప్రధానంగా మరాఠీ భాషను కలిగియుండి ఆర్థికంగా స్వయంపోషకంగా నిలువగలిగే ప్రాంతం విదర్భ ప్రాంతం. చారిత్రికంగా అలా తన అస్థిత్వాన్ని నిలుపుకుంటూ వస్తూన్న ప్రాంతమని పైన వివరంగా చూశాం కూడా.

అయితే స్వాతంత్ర్యానంతరం విదర్భ బృహత్ మహారాష్ట్రలో కలసిపోయాక, ఒక భాషాప్రయుక్త రాష్ట్రంగా మహారాష్ట్ర ఏర్పడినప్పటికీ, నేటికీ మహారాష్ట్రలోని విదర్భ వాసులలో ఎందుకు వేర్పాటు ఉద్యమం తలెత్తుతున్నదన్న సహజమైన ఆలోచన ఎవరిలోనైనా కలగవచ్చు. దీనికి కారణాలు మూలాల్లోకి వెళ్లితే తప్ప అర్థం గావు.

## వేర్పాటువాదానికి మూలాలు

భారత దేశం ఒక అర్థ వలస, అర్థ భూస్వామ్య దేశం. అసమానాభివృద్ధిని కలిగి ఉంది. దేశం అనేక రాష్ట్రాలుగా ఏర్పడినప్పటికీ అన్ని రాష్ట్రాలలోని అన్ని ప్రాంతాలు గత 57 ఏళ్లల్లో సమానాభివృద్ధికి నోచుకోకుండా పోయాయి. ప్రాంతాల మధ్య తీవ్రమైన అసమానతలు పొడసూపాయి. అన్ని రాష్ట్రాల్లో కొన్నిప్రాంతాలు అభివృద్ధి చెందినవిగా, మరికొన్ని ప్రాంతాలు వెనుకబడినవిగా కొనసాగుతున్నవి. ఎక్కడనైతే వెనుకబడిన ప్రాంతాలు అపారమైన వనరులను కలిగి ఉండి, అభివృద్ధి చెందడానికి అన్ని అవకాశాలు ఉండి అభివృద్ధికి నోచుకోకుండా పోతున్నాయో పైగా వివక్షకు గురవుతున్నాయో అక్కడి ప్రాంత ప్రజలలో నిజంగానే ఆయా ప్రాంతాలు తమవిగా తమ ఆధిపత్యంలోనే ఉంటే వాటిని పూర్తిగా తామే అనుభవించగలుగుతామనే ఒక ప్రజాస్వామిక భావన సహజంగానే తలెత్తుతుంది. ఫలితంగా, ఒకే రాష్ట్రంలోనే నివశిస్తున్నప్పటికీ అభివృద్ధిచెందిన ప్రాంతాల ప్రజలకు, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మధ్య తీవ్రమైన విభేదాలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో జరుగుతున్నదిదే. ప్రత్యేక విదర్భ ఉద్యమం దీని పలితమే. తమ కంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండడం ద్వారానే తమ ప్రాంతంలోని వనరులన్నింటిని తామే ఉపయోగించుకొని తమ సంపూర్ణ అభివృద్ధికి వినియోగించుకునే అవకాశాలు ఏర్పడుతాయని విదర్భవాసులు న్యాయంగానే కోరుకుంటున్నారు. గడచిన కొన్ని దశాబ్దాలుగా తలెత్తుతున్న ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలన్నీ భారతదేశ ప్రత్యేక పరిస్థితుల్లో రూపొందుతున్న జాతుల సమస్యలో భాగంగా తలెత్తుతున్న ఉద్యమాలే.

మహారాష్ట్ర రాజకీయాలలో పశ్చిమ మహారాష్ట్ర ప్రాంత బూర్జువా శక్తులు ప్రాబల్యాన్ని కలిగి ఉండడంతో సంపూర్ణ మహారాష్ట్రను వారు యదేచ్ఛగా దోచుకోగలుగుతున్నారు. ఫలితంగా పశ్చిమ మహారాష్ట్ర అభివృద్ధిచెందిన ప్రాంతంగా గణతికెక్కింది. విదర్భలోని అపార వనరులన్నీ రాజకీయాధిపత్యంతో వారే కొల్లగొట్టుకోగలుగుతూ అనుభవిస్తున్నారు. దీనితో విదర్భలో కరువు, పేదరికం, నిరుద్యోగం, ఆకలిచావులు, ఆత్మహత్యలు అధికంగా ఉన్నవి. అనేక వనరులను కలిగి ఉన్నప్పటికీ ఒక వెనుకబడిన ప్రాంతంగా విదర్భ కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్ర అభివృద్ధిలో ప్రాంతాల మధ్య తీవ్రమైన వివక్ష వ్యక్తమవుతున్న ఫలితమిది.

నేటికీ విదర్భలోని వ్యవసాయం ప్రధానంగా వర్షాధారంగానే ఉంది. ఇక్కడ ఎలాంటి నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేయలేదు సరికదా 300 సంవత్సరాలుగా ప్రజలను ఆదుకుంటున్న 7000 పైగా చెరువులు కనీస మరమ్మత్తుకు కూడా నోచుకోకుండా దెబ్బతినిపోయాయి. సాగునీటి వ్యవస్థకోసం ఎన్నడూ తగినన్ని నిధులను ప్రభుత్వం కెటాయించడం లేదని గత 57 ఏళ్ల విదర్భ చరిత్ర తెలుపుతోంది. భండారా జిల్లాలోని ఉమా నదిపై నిర్మించతలపెట్టిన గోసిఖుర్ద్ ప్రాజెక్టు గత 20 సంవత్సరాలుగా ఎలాంటి అభివద్ధికి నోచుకోకుండా పోతోంది. ఈ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తవుతుందని శంఖుస్థాపన చేసిన ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ హామీ ఇచ్చాడు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తయితే 4 లక్షల ఎకరాలకు నీరందుతుంది. కానీ ఇన్నేళ్ల నుండి ఈ ప్రాజెక్టు కోసం కేవలం 3 వేల కోట్ల రూపాయిలనే కెటాయించలేకపోతున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు కృష్ణా నది పరీవాహక ప్రాంతానికి గత ఐదేళ్లలో 21 వేల కోట్లు కెటాయించగలిగిందంటే ఇదెంతటి వివక్షో తెలుస్తోంది. ఈ ప్రాంతంలోని 175 ప్రాజెక్టులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో విశాల అటవీప్రాంతం దెబ్బతింటుందనీ, అటవీశాఖ ప్రాజెక్టుల నిర్మాణానికి అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటోందని సాకులు చూపుతున్నారు. ఒక్క గడ్‌చిరోలిలోనే 12 ప్రాజెక్టులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నవి. ఫలితంగా 2 లక్షల పైగా ఎకరాల భూమికి సాగునీరు అందకుండా పోయింది. విదర్భలో కేవలం 83 కోట్లు ఖర్చుచేస్తే 2½ లక్షల ఎకరాలకు నీరందివ్వవచ్చు. కానీ అందుకు అన్నీ ఆటంకాలే.

మొత్తం మహారాష్ట్రలోని పరిశ్రమల్లో విదర్భలో కేవలం 13.28 శాతం పరిశ్రమలు మాత్రమే ఉంటే, మిగతా 79.50 శాతం మిగిలిన మహారాష్ట్ర ప్రాంతంలో ఉన్నాయి. విదర్భలో ఉన్న పరిశ్రమల్లో అనేక పరిశ్రమలు ఇప్పటికే మూతపడిపోవడమో, లేదా అందుకు దగ్గరిలో ఉండడమో మనకు అగుపడుతుంది. విదర్భలోని 16 చక్కెర మిల్లుల్లో ప్రస్తుతం మూడు మాత్రమే నడుస్తున్నాయి. 15 బట్టల మిల్లుల్లో కేవలం నాలుగు మిగిలాయి. సహకార సంగాలు పూర్తిగా దివాళా తీశాయి. ఇక్కడ గతమూడేళ్లుగా నష్టాల్లో నడుస్తున్న అనేక చిన్నాచితకా ధాన్యం, పప్పు మిల్లులకు ఎలాంటి సహకార విధానాన్ని రూపొందించలేదు కానీ, అదే పశ్చిమ మహారాష్ట్రలోని భూస్వామ్య, పెట్టుబడిదార్ల ద్రాక్ష తోటలకు, ఆ ద్రాక్ష నుండి తీసే సారా కాపు విషయంలో పాలసీలను మాత్రం చక్కగా రూపొందించారు. చివరకు విదర్భను డి + జోన్ (D + Zone) గా గుర్తించారు. అంటే ఇక్కడ కొత్త పరిశ్రమలకు కేవలం 35% మాత్రమే సబ్సిడీ దొరుకుతుంది. ఇంతేకాదు. అనేక ఆధునిక, పెద్ద పరిశ్రమలకు అమ్మకం పన్నును మినహాయించారు గానీ, లక్షలాది కార్మికులకు ఉద్యోగాలు చూపే చిన్న, మధ్య తరహా పరిశ్రమల కెలాంటి పన్నుల మినహాయింపు లేదు. భారీ పరిశ్రమలకు నిలయం బొంబాయి - దాని చుట్టుపక్కల ప్రాంతాలు. విదర్భలో తయారవుతున్న విద్యుత్‌లో కేవలం 45% విద్యుత్ మాత్రమే, ఇక్కడికి వినియోగిస్తుండగా 55% బయటికి పోతోంది. పరిశ్రమలు సరిగా ఏర్పడకపోవడం, ఉన్న పరిశ్రమలు మూతపడడం, దివాళాతీయడంతో నిరుద్యోగం లక్షల్లోనే ఉంది.

విదర్భలో ఎలాంటి రోడ్డు సౌకర్యాలు లేవు. కాకపోతే గడ్‌చిరోలిలో మాత్రం 'నక్సలైట్ల సమస్య'తో మూలమూల రోడ్లు విస్తరించడం, విదర్భలోని అటవీ ప్రాంతాల ముడి వనరులను తరలించుకుపోవడానికి తాత్కాలిక రోడ్లు అటవీశాఖ వారు పోయడం మినహా వందలాది గ్రామాలకు పక్కా రోడ్ల సౌకర్యమే లేదు. కానీ ఈ మధ్యనే ముంబాయి-పూనే మధ్య అద్దం లాంటి అతి విశాలమైన, అందమైన ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డును వందల కోట్ల రూపాయిలు వెచ్చించి నిర్మించారు.

విదర్భలో రైతుల పంటలకు ఎన్నడూ గిట్టుబాటు ధర ఇచ్చిన పాపాన పోవడం లేదు. ఇక్కడ ప్రధాన వ్యాపార పంట పత్తి. అయినా పత్తి రైతులు ప్రతి ఏటా గిట్టుబాటు ధరల కోసం ఆందోళన చేయక తప్పదు. ప్రత్తి కొనుగోలుకు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్‌ను ఏకాధికార సంస్థగా ఏర్పర్చినప్పటికీ అది ఎన్నడూ రైతుల నుండి పూర్తిగా కొనుగోళ్లు చేసి వెంటనే రైతుకు డబ్బు అందించింది లేదు. ఎప్పుడూ వాయిదాల రూపంలోనే చెల్లించే హామీలు ఇస్తుంటుంది. ఈ బకాయి డబ్బుల కోసం మళ్లీ రైతులు బజార్లోకి రావలసిందే. పంటకోసం అప్పుచేసిన పెట్టుబడి-లాగోడి-పై ఈలోగా అనేక రెట్లు వడ్డీ పెరిగిపోతుంది. బయటి మార్కెట్‌లో తమ పంటను అమ్ముకోవడానికి అనుమతి కూడా లేకుండా పోవడంతో బహిరంగ మార్కెట్ ధరలు లభించక రైతు సర్కారీ ధరలకే, ఏకాధికార సంస్థ దయాదాక్షిణ్యాలకే బలికాక తప్పడం లేదు. గత సంవత్సరం(2003) కేంద్రం క్వింటాల్ పత్తికి రు.1,925/- ప్రకటించి చేతులు దులుపుకుంది, ఈ రేటుకు అమ్ముకోలేని రైతాంగం తీవ్ర ఆందోళన చేస్తే గానీ రాష్ట్ర ప్రభుత్వం రు.600/- పెంచలేదు. అలాగే ధాన్యం విషయంలో మాత్రం క్వింటాల్‌కు రు.1,000/- కావాలని విదర్భ రైతాంగం ఎంత డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మాత్రం ససేమిరా ఒప్పుకోవడం లేదు. ధాన్యం కొనుగోలు కోసం తన వంతు వాటాగా 20 కోట్లు ప్రకటించి చేతులు దులుపుకుంది. ఏటేటా పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులు, మార్కెట్ సంక్షోభాలతో గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యవసాయ దేశంలో రైతుకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలు ఉండడం, సాగునీటి సౌకర్యాలు లేని విదర్భలో ప్రకృతి వికటించడంతో గత మూడేళ్లుగా

తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని రైతును అతలాకుతలం చేస్తున్నాయి. పుష్కలంగా విద్యుత్తు తయారవుతున్నా ఎనిమిది గంటలైనా కరెంటు లేకపోవడం, లో వోల్టేజి సమస్యతో మోటార్లు పాడవడం, పంటలు దెబ్బతినడం మామూలైంది. ఇక్కడి రైతాంగానికి కరెంటు కరువు గానీ బడా పరిశ్రమలకూ, బయటికీ మాత్రం ఎంతో కరెంటు క్రమం తప్పకుండా పోతూనే వుంది. వీటన్నింటి ఫలితంగా గడిచిన రెండేళ్లలో దిక్కుతోచని 290 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొని ప్రాణాలు వదిలారు. భారతదేశ రైతాంగంలోనే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా ఇదొక ప్రమాదకర పోకడగా గత దశాబ్దకాలంగా ఏనాటికానాడు పెరిగిపోతోంది. దీనికి ఆంధ్రప్రదేశ్‌లోని హైటెక్ ముఖ్యమంత్రి పాలనే అంకురార్పణ చేసింది. ఇప్పటికీ 90 శాతం విదర్భ రైతాంగం అప్పుల బజార్లో తాకట్టు పెట్టబడి ఉన్నారు. కరువు వాతపడిన రైతాంగం ఏటేటా వలసవెళ్లే సమస్య తప్పడం లేదు. అక్కడ ఎదురయ్యే అగచాట్లు ఎన్నెన్నో!

## ఆదివాసీల దుస్థితి

ఇకపోతే విదర్భలోని ఆదివాసీల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఇక్కడునన 33% అడవుల్లో నివసించే ఆదివాసుల జీవనయానం దుర్భరంగా తయారైంది. అమరావతి, నందుర్‌బీర్, గడ్చిరోలి, గోందియా, భండారా, యావత్‌మాల్, చంద్రపూర్, నాగపూర్ మొదలైన జిల్లాలన్నింటిలో ఆదివాసులు గణనీయంగానే ఉన్నారు. `గ్రీన్ బెల్ట్' గా ప్రసిద్ధి చెందిన ఇక్కడి చంద్రపూర్, గడ్చిరోలి, గోందియా అడవులు భయంకరమైన మలేరియా పీడిత ప్రాంతాలు. చికిత్స తెలియని సికిల్‌సెల్ వ్యాధికి విదర్భ కేంద్రం. ఆదివాసులలో క్షయ, కుష్టు దినదినం ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఇకపోతే పౌష్టికాహార లోపం పిల్లలను, మహిళలను తీవ్రంగా వేధిస్తోంది. ఏటా వందలాది మంది పసిపిల్లలు ప్రాణాలు వదులుతున్నారు. వర్షాకాలం కలరా, డైయేరియా లాంటి అంటువ్యాధులు పెద్ద ఎత్తున ప్రబలుతాయి.అయినా వీరికి తగిన వైద్య సౌకర్యం లేకుండా పోయింది. కరువుతో నకనకలాడుతూ కందమూలలాలతో కడుపు నింపుకుంటున్నప్పటికీ ఆదివాసీల గూర్చి మొసలి కన్నీరు కార్చే ప్రభుత్వం శాశ్వత కరువు నివారణ చర్యలు చేబట్టినది లేదు. ఇదిలా ఉంటే, మరోవైపు పెళ్లి ప్రలోభాలకు మోసపోయిన 500 మంది దళిత, ఆదివాసీ విదర్భ యువతులు అమ్మకం పాలైనారనీ, ఝూన్సీలో దొరికారని పత్రికలు సంచలనాత్మకంగా రాయడాన్ని బట్టి ఇక్కడి మహిళల దుస్థితిని అర్థంచేసుకోవచ్చును. గడ్‌చిరోలిలోని మాడ్ ప్రాంతంలో నివసిస్తున్న 12 గ్రామాల ఆదివాసీ ప్రజల జీవితాలను చక్కదిద్దడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందిని ఒక కోర్టు గత సెప్టెంబర్‌లో తీర్పునిస్తూ ఆ పని గైర్ సర్కారీ సంస్థలు చేయాలంది. ఇక్కడి ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిపట్టే కోర్టు తీర్పే అలా ఉంటే ఈ దేశంలో ఇక అలాంటి సర్కార్లు ఎందుకో ఇక ప్రజలు తేల్చుకోవలసిందే మిగిలింది.

ఇలా విదర్భ అన్ని రంగాలలో వివక్షకు గురవుతోంది, ఇక్కడి అపార వనరులు పర ప్రాంత దోపిడీదారులచే కొల్లగొట్టబడుతున్నాయి. విదర్భ ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయి ఒక వెనుకబడిన ప్రాంతంగా భారతదేశ రాజకీయ చిత్రపటంపై నిలిచి పోరాడుతోంది. ఇలాంటి పరిస్థితిలో సహజంగానే ప్రజలు పోరాడి తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని కోరుకుంటున్నారు. ఇలాంచి ప్రత్యేక రాష్ట్రాల పోరాటాలకు ఎక్కడి ప్రజలు సిద్ధపడినా అందుకు ఎంతటి త్యాగాలకైనా, నష్టాలకైనా భౌతికంగా, మానసికంగా సహజంగానే సిద్ధమవుతారు. విదర్భ ప్రజలు కూడా ఇందుకు భిన్నం కాదు. అసలే చారిత్రికంగా ఒక విడి ప్రాంతంగా కొనసాగుతూ వచ్చి, 1957లో మహారాష్ట్రలో విలీనమైనప్పటికీ వారిలో నుండి మానసికంగా తాము వేరు అనే భావన ఇంకా పూర్తిగా తొలగిపోకముందే మరింత అధ్వాన్న పరిస్థితులు వారికి ఎదురయ్యాయి. దీనితో సహజంగానే వీరిలో ఒక ప్రత్యేక ప్రాంత భావన బలంగా ముందుకు వచ్చింది. దీనిని ఇక్కడి భూస్వామ్య బూర్జువా వర్గాలు సొమ్ము చేసుకోవడానికి రంగం మీదకు వచ్చాయి.

## భిన్న పార్టీలు – భిన్న వైఖరులు

ప్రత్యేక విదర్భ విషయంలో బడా బూర్జువా రాజకీయ పార్టీల మధ్యగానీ, ప్రాంతీయ పార్టీల మధ్యగానీ ఏకాభిప్రాయం లేనే లేదు. ఇకపోతే రివిజనిస్టుల, నయా రివిజనిస్టుల వైఖరి చెప్పాల్సిన పనే లేదు.దేశంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలన్నింటిని ఈ పార్టీలు నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ అప్రజాస్వామ్య వేర్పాటు ఉద్యమాలుగా ముద్రలు వేస్తున్నవి. స్వాతంత్ర్యం పూర్వం కాంగ్రెస్ పార్టీ 1920 లో జరిగిన కాంగ్రెస్‌లో సంస్థ నిర్మాణాన్ని కూడా భాషా ప్రాతిపదికపైననే నిర్మించడానికి నిర్ణయం తీసుకొంది. ఆ తీర్మానం ప్రకారం అప్పటికి తమిళనాడు, ఆంధ్ర, కేరళ, సింధ్, గుజరాత్, మహారాష్ట్ర, విదర్భ, మహాకోసల, అజ్మీర్-మేర్వార, యునైటెడ్ ప్రావిన్సెస్, ఢిల్లీ, బీహార్, ఉత్కళ, అస్సాం, బెంగాల్, పంజాబ్, వాయువ్య సరిహద్దు రాష్ట్రాల పేర్లతో మన దేశాన్ని 18 రాష్ట్రాలుగా విభజించి కాంగ్రెసు నిర్మాణాన్ని ఆ ప్రాతిపదికపైనే నిర్మించారు. కానీ, 'స్వాతంత్ర్యానంతరం' దేశ విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ స్వచ్ఛందంగా ప్రజల ఆకాంక్షలను గౌరవించి నూతన రాష్ట్రాల నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇప్పటికి నూతన రాష్ట్రాలు ఎక్కడ వెలుగుచూసినా గొప్ప ప్రజాపోరాటాల ద్వారానే సాధ్యమైంది. ఇప్పటికీ తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని



ప్రత్యేక రాష్ట్రం కోసం ఆదివాసుల పోరాటం

బలంగా కోరుకుంటున్న వారెవరైనా పోరాట మార్గాన్ని అనుసరించక తప్పడం లేదు. ఇందుకు ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణా, విదర్భ, హరిత ప్రదేస్, పూర్వాంచల్, బుందేల్ ఖండీలు ప్రత్యక్షమైన తాజా ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇంకొంత వెనక్కి చూస్తే నూతన రాష్ట్రాలను ఏర్పర్చడానికి కాంగ్రెస్, భారత పాలకవర్గాలు ఎంత విరుద్ధమో పొరుగు దేశాలను ఒక రాష్ట్రంగా దేశంలో బలవంతంగా విలీనం చేసుకోవడంలో అంత సిద్ధహస్తులని సిక్కిం దురాక్రమణ తెలియజేస్తోంది. ఇది భారత పాలకవర్గాల విస్తరణవాదాన్ని కూడా ఎత్తిపడుతుంది. ఇలా కాంగ్రెస్ పార్టీ చరిత్రను చూస్తే ఇప్పటివరకు అది నూతన రాష్ట్రాల నిర్మాణానికి వ్యతిరేకంగానే ఉంది. అందుకే అది విదర్భ, తెలంగాణా తదితర ప్రత్యేక రాష్ట్రాల విషయంలో ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేకపోయి వ్యవహారాన్ని నాన్చుతూ వస్తూంది. ఇప్పుడైనా అది ప్రతిపక్షంలో పడిన ఫలితమే దాని వైఖరిలో అమాత్రమైనా మార్పును కలిగించిచంది. విదర్భలోని 66 మంది విధానసభ సభ్యులుగానీ, 8 మంది లోకసభ సభ్యులు గానీ నిజాయితీతో దీనికోసం పోరాడింది, పోరాడుతోంది లేదు. గత 57 సంవత్సరాలలో విదర్భకు చెందినవాళ్లు ముగ్గురు ముఖ్యమంత్రి పదవుల్లోకి వచ్చినా వారి హయాంలో చేసిందేమి లేదు. ఇప్పటికీ కనీసం ఒక ప్రత్యేక తీర్మాన్నైనా విధానసభలో ప్రవేశపెట్టడానికి సాహసించడం లేదు. కాంగ్రెస్‌లోని పలు ముఠాలు (పూర్వ ముఖ్యమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్ లాబీ ఇతర లాబీలు) ఇందుకు ఎంతగానో అడ్డుతగులుతూ తమ నిజస్వరూపాన్ని చాటుకుంటున్నాయి. అయితే, ఇదే వైఖరి మరింత ఎక్కువ కాలం కొనసాగితే నెగెటివ్ ఫలితాలు తప్పనిసరి ఎదురవుతాయనీ, కాంగ్రెస్ కోటగా పేరున్న విదర్భ బీటలు పారడం ఖాయమని, రానున్న ఎన్నికలు ఫలితాల నూహించేవారిలో గెలిచే సీట్ల విషయంలో కౌంట్ డౌన్ మొదలైంది.

ఇకపోతే భాజపా విషయానికి వస్తే చాలాకాలం ఇది 'అఖండ్ భారత్" సిద్ధాంతాన్ని వల్లిస్తూ వచ్చింది. ఇది ఒకే జాతి, ఒకే మతం అనే తప్పుడు సిద్ధాంతంపై ఆధారపడిన అఖండ మార్కెట్ సిద్ధాంతం. కానీ దేశంలో మారుతున్న పరిస్థితులను పరిగణనలోనికి తీసుకొన్న అది ఈ దేశ అధికార కళ్లాలు అందుకోవాలనే చిరకాల వాంఛతో తన అఖండ భారత్‌ను మరో రూపంలో ముందుకు తెస్తోంది. దేశ రాజకీయాల్లో ఒక ప్రధాన పాత్రను పోషిస్తూ, కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ తానే అధికారాన్ని నెరపగలిగే స్థాయికి ఎదగాలన్న ఏకైక తలంపుతో అది తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అప్పటి వరకు అది ఎవరితోనైనా ఎలాంటి పొత్తుకైనా సిద్ధపడుతూ అధికారంలో భాగస్వామ్యాన్ని ఆశిస్తోంది. పచ్చి అవకాశవాద పద్ధతుల్లో ప్రజాపోరాటాలను సొమ్ముచేసుకోవాలని చేస్తోంది. ప్రస్తుతం దాని లక్ష్యం సర్వత్రా అధికారం తన చేతిలో ఉంచుకోవడమే . అలా తాను భారత దేశవ్యాప్తంగా అధికారంలోకి రాగలిగితే దేశంలో కాషాయీకరణకు పాల్పడుతూ యదావిధిగా అఖండ్ భారత్ స్వప్నాలను ఫలించుకోవాలని చూస్తోంది. ఈ ప్రక్రియ గత ఐదేళ్ల పాలనలో ఒక రూపం తీసుకొంది.

విదర్భ విషయంలో ఇది ఇప్పటికీ ప్రత్యేక విదర్భను సమర్థిస్తున్నా నంటూనే మరోవైపు శివసేనతో పొత్తు నెరపుతోంది. విదర్భ వెనుకబాటుకు అసలు కారణం కాంగ్రెస్ అంటు విమర్శిస్తూ శివసేన విధానాలనే మనసా వాచా అమలుచేస్తోంది. గతంలో శివసేనతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పర్చిన బిజెపి ఏ ఒక్కనాడు కూడా ప్రత్యేక విదర్భ కోసం ఎలాంటి చర్య చేపట్టలేదు. ఇప్పటికీ అది మాటవరుసకే సమర్థిస్తుంది తప్ప నిజానికి అది శివసేన పార్టీకే కొమ్ముకాస్తోంది. దాని రెండు నాల్కల ధోరణి ఇతర చోట్ల కూడా (తెలంగాణ విషయంలో) ఇలాగే వ్యక్తమౌతోంది.

భాజపా వ్యవహారం ఇలా ఉంటే మహారాష్ట్రలో భూమి పుత్రుల సిద్ధాంతంతో 60వ దశకంలో ఉనికిలోకి వచ్చిన శివసేన పార్టీ మాత్రం ప్రత్యేక విదర్భను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తోంది. 105 మంది బలి దానాలతో మహారాష్ట్ర ఒక రాష్ట్రంగా ఉనికిలోకి వచ్చిందనీ, మరాఠీ ప్రజలంతా ఒక్కటేననీ, ఈ ప్రజల్లో చీలికలను సహించేది లేదనీ, చీలికను నిరోధించడానికి ఎంతటి రక్తపాతానికైనా ఒడిగట్టి తీరుతామని శివసేన నిరంతరం హెచ్చరికలు, బెదిరింపులు జారీ చేస్తోంది. తాను తొలిసారిగా అధికారంలోకి వచ్చిన వెంటనే (1994-99) విదర్భ అభివృద్ధి కోసం తగినన్ని ప్రత్యేక నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. ఇన్నేళ్లుగా కాంగ్రెస్ హయాంలో వెనుకబడిన విదర్భను పశ్చిమ మహారాష్ట్రతో సమస్థాయిలో అభివృద్ధి చేయాలంటే అందుకు కావలసిన నిధులను బ్యాక్‌లాగ్ రూపంలో అందజేస్తామన్నారు. ఇది మినహా విదర్భ వికాసానికి మరే మార్గం లేదనీ, అఖండ మహారాష్ట్ర నుండి విదర్భను విడదీయడం ఎవడి తరం కాదని హూంకరించారు. దండేకర్ సమితి అంచనావేసిన ప్రకారం 3,761 కోట్ల బ్యాక్‌లాగ్ రాశిని రెండేళ్లలో విడుదల చేసి విదర్భ వికాసానికి తోడ్పడుతామని 22.11.96నాడు ప్రకటించారు. ఇప్పటికీ వీరి వైఖరిలో ఎలాంటి మార్పు లేదు. అలాగే తమ హయాంలో ఎన్నడూ తగిన నిధులు విడుదల చేసి వికాసానికి తోడ్పడిందీ లేదు. ఈ మధ్య కాలంలో బ్యాక్‌లాగ్ మరిన్ని వేల కోట్లు పెరిగిపోయింది. ప్రస్తుతం దేశంలో ఏ రాష్ట్రానికీ లేనంత అప్పు మహారాష్ట్ర కుంది. లక్ష కోట్ల అప్పులతో మహారాష్ట్ర సతమతమవుతోంది. తెచ్చిన అప్పుల్లో 5 వేల కోట్లు మాత్రం విదర్భకు విదిలించి మిగతాదంతా పశ్చిమానికే వెచ్చించింది. ఇక ఇలాంటి స్థితిలో బ్యాక్‌లాగ్ అందిస్తానంటే విశ్వసించే దెవరు? వీరి శక్తి అంతా ఉగ్ర శివసైనికులపైనే ఆధారపడి ఉంది. ఈ శివసైనికులు మహారాష్ట్రలో ముఖ్యంగా ముంబాయి తదితర పట్టణాల్లో ఎంతటి రక్తపాతానికైనా తలపడిన, తలపడగల 'సమర్థులు'. వీరికి 'మాతోశ్రీ' (శివసేన నేత బాలథాకరే నివాసం) ఆదేశాలే శిరోధార్యం. వీరిలో అత్యధికులు లంపెన్ శక్తులే. ఈ శక్తితోనే ప్రతిపక్షాలను, ప్రజలను వీరు నిత్యం బెదిరిస్తూ పబ్బం గుడుపుకుంటున్నారు. కానీ నిజానికి ప్రజాశక్తి ముందు ఏ శక్తీ నిలవలేదన్న చారిత్రిక వాస్తవం వెలుగుచూసిన్నాడు శివసైనికులు మట్టి కరచిపోతారు.

మహారాష్ట్రలో మరో పెద్ద ప్రజా సముదాయం మహర్ సముదాయం. డాక్టర్ అంబేద్కర్ బోధనలతో చాలా తీవ్రంగా ప్రభావితమైనవారు వీరు. వీరిపై ఆధారపడి అనేక దళిత పార్టీలు పలుపేర్లతో ఉనికిలోకి వచ్చాయి. అంబేద్కర్ అనుయాయుల్లో కొందరు దళిత పాంథర్లు(దళిత పులులు), భీం శక్తి పేరుతో సంఘటితమై ఉన్నారు. అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ మొదలు అనేక మంది దళిత నేతల మధ్య ఏకాభిప్రాయం లేకుండా పోయి రోజు రోజుకు పార్టీల్లో చీలికలు పెరుగుతున్నాయే తప్ప ఐక్యత కుదరడం లేదు. కానీ విదర్భ విషయంలో మాత్రం ఈ పార్టీలన్నీ దాదాపుగా సమర్థిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ నుండి చీలిపోయి సొంత కుంపటి పెట్టుకున్నవాడు శరద్ పవార్. ఇతడు మహారాష్ట్ర రాజకీయాల్లో ఆరితేరిన వాడు. నేర ప్రపంచంతో చాలా దగ్గరి సంబంధాలు కలిగినవాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దేశ రాజకీయాల్లో కూడా తన ఉనికిని చాటుకోగలుగుతున్న రాజకీయ చతురుడు. మహారాష్ట్రలో పలుమార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టి వెలగబెట్టినవాడు. ఇప్పటికీ ఇతని రాష్ట్రవాది కాంగ్రెస్ పార్టీ (జాతీయవాద కాంగ్రెస్) కాంగ్రెస్ (ఐ)తో కలసి రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతోంది. తన హయాంలో ఎన్నడూ విదర్భ కోసం మాట్లాడింది లేకపోయినా, నేటి పరిస్థితుల ప్రభావంతో విదర్భను సమర్థిస్తున్నాడు.

విదర్భ విషయంలో పెద్ద పార్టీల పోకడ పైన తెల్పిన విధంగా ఉంటే ఇతరత్రా అనేక ప్రాంతీయ, చిన్న పార్టీలు ప్రత్యేక విదర్భ కోసం పోరాడుతామంటున్నాయి. వీటి మధ్య ఐక్యతను ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. పెద్ద పార్టీల్లో ప్రత్యేక విదర్భను సమర్థించేవాటిని

తమలో కలుపుకుంటామని ప్రకటిస్తున్నాయి. రకరకాల పేర్లతో ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి పోటీపడుతూ రానున్న విధానసభ ఎన్నికల తరుణంకోసం ఉవ్విళ్ళూరుతూన్నాయి. కరో, మరో (చేయి లేదా చావు) అనీ, ఇది అంతిమ పోరాటమనీ, ఆర్-పార్ లఢాయి (అటో ఇటో తేలే పోరాటం) అంటూ ఛాతి విరుచుకుంటూ ప్రసంగాలు చేస్తున్నారు. ప్రతిపక్షను ఎండగట్టే గణాంకాలతో ముందుకు వస్తున్నారు. ఢిల్లీకి రథయాత్రలు, విదర్భ వ్యాప్తంగా రథయాత్రలు, జనజాగరణ్ యాత్రలు, పాదయాత్రలు, బంద్‌లు, ర్యాలీలు, ప్రదర్శనలు, సభలు, సమావేశాలు ఎడతెరిపి లేకుండా సాగిస్తున్నారు. ఈ మధ్యనే వీరితో షేత్‌కారీ సంఘటన కలిసింది. ఇది మహారాష్ట్రలో చెరకు, పత్తి, ఉల్లి రైతుల గిట్టుబాటు ధరల కోసం కొన్ని మిలిటంట్ ఆర్థిక పోరాటాలు నడిపిన చరిత్రను కలిగిన ధనిక రైతుల సంస్థ. డబ్ల్యుటిఓ విధానాలను పూర్తిగా సమర్థిస్తున్న సంస్థ ఇది. ఒకనాడు భారత బడా బ్యూరాక్రట్లలో ఒకడైన శరద్ జోషి దీని నాయకుడు. ప్రస్తుతం విదర్భ నుండి వనరులను బయటకి తరలించుకుపోవడాన్ని నిరోధించాలని బొగ్గు సరఫరా నిలిపివేత పోరాటాన్ని రెండు విడతలుగా చేపట్టాలని నిర్ణయించి మొదటి విడుతగా మూడు రోజులు కొనసాగించింది. పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించుకుంది.

ప్రత్యేక విదర్భ కోసం తొలినుండి రంగంలో ఉండి 'విదర్భ వీర్'గా గణతికెక్కినవాడు విదర్భ జనతా కాంగ్రెస్ నాయకుడు జాంబవంతరావు ధోటే. ఇతడు జనతా పార్టీ నుండి బయటికొచ్చి విదర్భ కోసం ప్రత్యేక పార్టీని ఏర్పరచుకొని పోరాడుతున్నాడు. ఇతడు సైన్యం లేని సేనాని లాంటి వాడు. చివరి వరకు మాత్రం పోరాడితీరుతా నంటాడు.

పోతే మరో సిగ్గుమాలిన ఈమధ్య పరిణామం ఏమంటే, తమ జీవితాంతం కాంగ్రెస్ పార్టీలో తనవితీరా మునిగి, ఆ రాజకీయాలను నరనరాన జీర్ణించుకొని శేషజీవితంలో అంతిమ ఘడియల్లో కూడా పదవీ వ్యామోహం వదలలేని కాలం చెల్లిన నాయకులయిన ఎన్‌కెపి సాల్వే, వసంత్ సాఠేలు కాంగీని వదలి విదర్భ అంటూ దేకుతూ రావడం `బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్టే' ఉందనుకోవచ్చు.

అలాగే 'విదర్భ రాజ్య పార్టీ' నూతనంగా ఏర్పడింది. తన రాజకీయ జీవితంలో నాలుగు సార్లు అటు-ఇటు పార్టీలు మార్చి చివరకు సొంత పార్టీ పెట్టుకున్న ఒక నాగపూర్ మరాఠీ బ్రాహ్మణ పెట్టుబడిదారుడు బన్వారీలాల్ పురోహిత్ ఏర్పరచిన పార్టీ ఇది. పత్రికా రంగంలో ఇతడు భారీ పెట్టుబడులను కలిగి ఉన్నాడు. ప్రస్తుతం అన్ని పార్టీల్లోకెల్లా, నేతలందరిలోకెల్లా అంగ బలం, అర్థబలం కలిగినవాడు ఇతడే. ఇతడే కేంద్రకంగా పనిచేస్తున్నాడు. కొత్తగా `చతుష్టయ' కలయిక - పురోహిత్, ధోటే, జోషి, ప్రకాశ్ అంబేడ్కర్- తో మిగతా ఎన్నికల పార్టీలన్నీ వీలైన మేరకు పొత్తుల ఎత్తుగడలకు దిగుతున్నాయి. కానీ అసలు విషయం ఏంటంటే వీరందరిదీ ఎన్నికల స్టంటేననీ, ఎన్నికల పొత్తులేనని వీరెవరికీ ప్రజల ఆకాంక్ష పట్ల నిజాయితీగానీ, చిత్తశుద్ధిగానీ లేదని ప్రజలకు మాత్రం తెలుసు, అందుకనే వీరెవరు ఎన్ని మాట్లాడుతున్నా ప్రజలు ఎక్కడా పెద్దగా స్పందించడం లేదు, విశ్వసించడం అంతకన్నా లేదు. కాకపోతే ఉద్యోగ, నిరుద్యోగ సెక్షన్లకు చెందిన యువత వారెదుర్కొంటున్న సమస్యల్లో నుండి, అలాగే సాధారణంగా యువతలో ఉండే ఆకాంక్షల తపన నుండి కొంత వీరి వెంట ఉన్నారు. వీరే వాళ్లకు పెట్టుబడిగా, ఇంధనంగా వినియోగించబడుతున్నారు.

కాబట్టి, నేటి పార్టీలన్నింటి వైఖరులను సంక్షిప్తంగా చెప్పాలంటే, విదర్భవాసుల్లో విశ్వాసం కోల్పోయిన, రానున్న ఎన్నికలను ఒక అవకాశంగా తీసుకొని తమ పబ్బం గడుపుకోవడానికి కిందామీద పడుతున్న పార్టీలని చెప్పవచ్చు. ఏ పార్టీకి ఆ పార్టీయే విదర్భలో తామే అధికారంలోకిరావాలనే దుస్వప్నాలతో ప్రత్యేక విదర్భను నినదిస్తున్నాయి తప్పా ప్రజల ఆకాంక్షలను సొమ్ముచేసుకుంటున్నాయే తప్పా నిజమైన విదర్భను కోరుకోవడం లేదు. ఇక వ్యతిరేకించే పార్టీల విషయం చెప్పాల్సి పనే లేదు.

## విదర్భ ప్యాకేజి – ఒక జిమ్మిక్కు

ప్రతి శీతా(చలి) కాలంలో విధానసభ సమావేశాలు నాగపూర్‌లో 7 రోజులు జరుగుతాయి. నాగపూర్ మహారాష్ట్ర ఉపరాజధానిగా ప్రసిద్ధి. ఈసారి సమావేశాల సందర్భంగా విదర్భపై ఒక ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని మల్లగుల్లాలు పడ్డ మంత్రివర్గం చివరకు హై కమాండ్ ఢిల్లీలో ఒప్పుకోకపోవడంతో హతాశులైనారు. దీనితో విదర్భవాసులను జోకొట్టడానికి ముఖ్యమంత్రి షిండే ఒక విదర్భ ప్యాకేజిని ప్రకటించాడు. తీవ్రమైన సమస్యలతో కుతకుతలాడే ప్రాంతాలను చల్లార్చడానికి ప్యాకేజిని ప్రకటించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు షరా మామూలేనని బస్తర్ ప్యాకేజి, సర్గుజా ప్యాకేజి, ఈశాన్య ప్రాంతాల ప్యాకేజిలన్నీ స్పష్టం చేస్తున్నాయి లేదా ఆ ప్రాంతాల కోసం ప్రత్యేక బోర్డులను ఏర్పర్చడం కూడా చూస్తున్నాం. ఈ కోవకు చెందిందే విదర్భ ప్యాకేజి. 748 కోట్ల రూపాయిలతో ప్రకటించిన విదర్భ ప్యాకేజిని విదర్భ అనుకూల పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని పార్టీలు ఈ సొమ్ము `ఏనుగు నోట్లో జీలకర్ర బద్దగా' అభివర్ణించాయి. ఈ ప్రకటించిన నిధిలో 570 కోట్లు పాత లెక్కల్లోవేననీ, మిగిలింది 178 కోట్లేననీ చెప్పుతూ, ఈ లెక్కన బ్యాక్‌లాగ్ నింపాలంటే 166 సంవత్సరాలు పడుతుందని లెక్కలతో సహా తేల్చి చెప్పి ప్రభుత్వ స్వభావాన్ని సరిగానే ఎద్దేవా చేసాయి. కాగా, అధికార రాష్ట్రవాద కాంగ్రెస్ పార్టీ ప్యాకేజిని 1,000 కోట్లుగా ప్రకటించినా బాగుండునని నసుగుతోందంటే, ప్రత్యేక విదర్భ విషయంలో దాని సమర్థింపు ఎంతటి నిజాయితీతో కూడుకుందో దాని పశ్చిమ మహారాష్ట్రకు చెందిన బలమైన చక్కెర లాబీ నేత అయిన శరద్ పవార్ సెలవియ్యాలి. కాబట్టి ఇలాంటి ప్యాకేజీలు ఎన్ని ప్రకటించినా రానున్న ఎన్నికల్లో తిరిగి 1957 నాటి ఎన్నికల గతే కాంగ్రెస్‌కు పట్టితీరుతుందని (అప్పుడు 8 సీట్లలో రెండే సీట్లు కాంగ్రెస్ గెల్చింది) విదర్భ నాయకుల గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నిజానికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్న ప్రజలకు అది సాధించుకోవడం తప్ప మరేది వారిని సంతృప్తిపర్చలేదని ఈ నేతలకు తెలియంది గాదు. అయినా ఇలా చేయడం ప్రజలను మోసపుచ్చి తమ లాభాలు పండించుకోవడమే. నిజానికి వారు చేయగలిగింది కూడా అంతే. అదే చేస్తున్నారు. కాని ఏ ప్రజలను కూడా ప్యాకేజీలతో భ్రమింపజేయలేరు. విదర్భ ప్యాకేజీ విషయం ఇలా ఉంటే, జనవరి 2004 మూడవ వారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం తీసుకున్న నిర్ణయం కూడా ఆయా ప్రాంతాలకు కెటాయిస్తున్న ప్యాకేజీల మధ్య వ్యత్యాసాన్నే ఎత్తిపడుతోంది. ముంబాయిలో మురికివాడలుగా సుప్రసిద్ధమైన ధారవి ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ధారవి పునరావాసం పేరుతో 5,600 కోట్లు కెటాయించగలిగారు కానీ ఇక్కడ పోషకాహార లోపంతో, ఆకలి, కరువు, దారిద్ర్యంలతో నకనకలాడుతూ బతుకు పోరాటంలో పోటీపడుతూ బతుకలేక పోతున్నవారిని మాత్రం పట్టించుకోవడం లేదు. యావత్‌మాల్ ఆదివాసీల ఉపవాసాల బతుకులు, చంద్రపూర్ కోలాంల ఆకలి చావులు పాలకులకు గుర్తురావు. వారికి కావల్సింది బొంబాయిలోని బిల్డర్స్‌కు లాభాలు సమకూర్చడం. ఇదీ పాలకులకు ప్రజల పట్ల ఉన్న గౌరవం, నిజాయితీ. నిజానికి ధారవి పునరావాస పథకం కింద వెచ్చించే డబ్బుతో బిల్డర్ల లాబీని బలిపించడమేనని ముంబాయి రాజకీయాలెరిగిన వారికి విడిగా చెప్పాల్సిన పనిలేదు.

## ప్రజల విదర్భకు పరిష్కారం 'ప్రజాపోరాటం'

ప్రస్తుతం మన దేశంలో ముందుకు వస్తున్న చిన్న రాష్ట్రాల ప్రత్యేక ఉద్యమాలను అర్థం చేసుకోవడానికి ముందు మనం మన భారతదేశంలో

ఏర్పడిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పుట్టు పూర్వోత్తరాలను అర్థం చేసుకోవాలి. అలాగే భారత పాలకవర్గాల్లో బడా పెట్టుబడిదారులకూ, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధిచెందుతున్న ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య పెంపొందుతున్న వైరుధ్యాలను అర్థంచేసుకోవాలి. పోతే ఈ దేశంలో 'స్వాతంత్ర్య' పూర్వం ఉనికిలో ఉన్న 580 సంస్థానాలను, అంతకు ముందున్న శతాబ్దాల తరబడి ఫ్యూడల్ భూస్వామ్య పాలనను అర్థంచేసుకోవడం ద్వారా ప్రజల్లో తమకంటూ ఒక ప్రాంతం ఉండాలన్న భావనకు మూలాలు అర్థమవుతాయి. ఆ తర్వాత బడా పెట్టుబడిదారుల దోపిడీ విధానాల ఫలితంగా దేశంలో తీవ్రంగా ముందుకు వచ్చిన వివిధ ప్రాంతాల మధ్య అసమానాభివృద్ధి ఆ భావనను ఎలా బలోపేతం చేస్తూ వస్తుందో కూడా తెలుస్తుంది. ఈ అసమానాభివృద్ధి తొలగిపోయినపుడే ప్రజల మధ్య నిజమైన ఐక్యతకు, సర్వతోముఖాభివృద్ధికి పునాదులు ఏర్పడి జాతి సమగ్ర వికాసానికి తోడ్పడుతుంది. అప్పటివరకు ఈ ప్రజల న్యాయమైన పోరాటాలను, డిమాండ్లను చీలికవాదంగానో, వేర్పాటువాదంగానో, విఘటనకారీ ఉద్యమాలుగానో అర్థం చేసుకోకూడదు. కాబట్టి ముందు ఈ దేశంలో జరిగిన పలు చారిత్రక పరిణామాలను అర్థం చేసుకోకుండా, మూలాలు తెలుసుకోకుండా అఖండ భారత్ అన్నా, అఖండ మహారాష్ట్ర అన్నా, భూమిపుత్రుల సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చినా, విశాలాంధ్ర అని మొత్తుకున్నా, బృహత్ ద్రవిడస్థాన్ అంటూ కృత్రిమంగా ఏ వాదనలు, నినాదాలు ముందుకు తెచ్చినా అవన్నీ ప్రజల్లో నిజంగా ఒక జాతి భావనను పెంపొందించ లేవు. జాతి ప్రజల మధ్య సమభావనను తేలేవు. అవన్నీ ఆయా ప్రాంతాల్లోని బలమైన బడా బూర్జువా వర్గ ప్రయోజనాలను ఈడేర్చడానికే తోడ్పడుతాయన్నది ఒక వాస్తవం.

"ఒకే భాషా, భూభాగం, ఆర్థిక జీవితం, సంస్కృతిలో ప్రతిఫలించే ఒకే మానసిక విధానంపై ఆధారపడి చారిత్రకంగా ఏర్పాటయిన స్థిరమయిన ప్రజా సమూహమే జాతి" అన్న మార్క్సిస్టు నిర్వచనానికి లోబడి మహారాష్ట్రను ఒక జాతిగా చెప్పుకోవచ్చు. కానీ ఆ భూభాగంలో నివశించే జాతి ప్రజల మధ్య పలు ప్రాంతాలలో చోటుచేసుకున్న అనేక అసమానతల మూలంగా అక్కడి ప్రజల్లో పెల్లుబుకే నిరసన, వేర్పాటు మనస్తత్వం వారిలో తమకంటూ ఒక విడి ప్రాంతాన్ని (రాష్ట్రాన్ని) కలిగియుండడం ద్వారానే ఆ అసమానతలు తొలగిపోతాయన్న భావనను ముందుకుతెస్తూంది. అందుకు వారిని పోరాటోన్ముఖులను చేస్తుంది. ఈ పోరాటాలకు జన్మనిస్తున్నది అభివృద్ధిచెందిన ఆ జాతిలోని దోపిడి ఆధిపత్య శక్తులే. అన్ని రంగాలలో వ్యక్తమయ్యే విపరీతమైన అసమానతలే. దీనితో ఆయా ప్రాంతాలలోని వెనుకబాటుతనాన్ని, ప్రజల ఆకాంక్షలను ఆసరా చేసుకొని అక్కడి బూర్జువా శక్తులు సహజంగానే ప్రజల న్యాయమైన డిమాండ్లను ముందుపెట్టి పోరాట నాయకత్వంగా ముందుకు రావడాన్ని మనం చూస్తున్నాం. నేడు మన దేశంలో చెలరేగుతున్న చిన్న రాష్ట్రాల ఉద్యమాలు ఈ కోవకు చెందినవే. అభివృద్ధి చెందిన ప్రాంతాల బూర్జువాలకు, వెనుకబడిన ప్రాంతాల బూర్జువా శక్తులకు మధ్య పెంపొందిన వైరుధ్యాల ఫలితంగా నేడు ముందుకొస్తున్న ఈ పోరాటాలకు కార్మికవర్గం నాయకత్వం వహించడం ద్వారానే అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఏర్పడి కాలక్రమంలో తిరిగి ఒకే జాతిగా ఆ ప్రజలందరి మధ్య సమైక్యత, సమభావన వెల్లివిరుస్తుంది. జాతి వైషమ్యాలు తొలగిపోయి నిజమైన జాతి వికాసానికి తోడ్పడుతుంది. అందుకే ఈ పోరాటాలన్నింటిని జాతుల వికాసంలో తప్పనిసరి ఒక భాగంగానే చూడాలి.

అలాగే ఈ న్యాయమైన ప్రజాపోరాటాలకు సరైన (విప్లవ) కార్మికవర్గ నాయకత్వం లేకుండా ప్రజల ఆకాంక్షలు, వారి బలమైన విశ్వాసాలు ఎన్నటికీ పరిపూర్తికావు. వారు కోరుకునే వారి అభివృద్ధి దోపిడీవర్గ శక్తుల నాయకత్వం ఉన్నంతవరకుససేమిరా సాధ్యం కాదు. వీరి నాయకత్వంలో ప్రాంతాల మధ్య భౌగోళిక విభజనలు తప్ప మరేమీ సాధించలేరని చాటిచెప్పడానికి ఈ మధ్యనే ఉనికిలోకి వచ్చిన ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు తాజా ఉదాహరణలుగా ప్రజల ముందున్నాయి. అవి ఏర్పడి మూడేళ్లు దాటుతున్నా అక్కడి ప్రజల జీవితాల్లో కనీసమైన మౌలిక మార్పులకు కూడా ఎలాంటి పునాదులు ఏర్పడలేదు. దీనికి అక్కడ ఉనికిలో ఉన్న ప్రభుత్వాల వైఫల్యమే కారణం అని భావించి నిజమైన ప్రత్యామ్నాయం ఎరుగని ప్రజలు ఈ మధ్య జరిగిన ఛత్తీస్‌ఘడ్ విధానసభ ఎన్నికల్లో మరో దోపిడీవర్గ పార్టీయైన భాజపాకు అధికార పగ్గాలు అదించారు. రేపు ఝార్ఖండ్‌లోనైనా, ఉత్తరాఖండ్‌లోనైనా అసలైన ప్రత్యామ్నాయం ప్రజలకు అర్థం కానంతవరకు అధికారంలో ఉన్న ఒక పార్టీ స్థానంలో మరో పార్టీని ప్రతిష్టించే తంతే జరుగుతుంది తప్పా ప్రజల ప్రయోజనాలు నెరవేరవు. జాతుల సమగ్ర వికాసానికి గానీ, నిజమైన అర్థంలో ఫెడరల్ పద్ధతిలో ఇండియన్ యూనియన్ ఆఫ్ పీపుల్స్ రిపబ్లిక్ (భారత్ రిపబ్లిక్కుల యూనియన్) ఏర్పడడానికిగానీ దారితీస్తుంది. కాబట్టి ఈనాడు జరుగుతున్న ఉద్యమాలకు కార్మికవర్గ నాయకత్వం ఉండడం ద్వారానే ప్రజల ఆశలు, ఆశయాలు పూర్తవుతాయి.

## ఆదివాసుల సమస్య ఒక ప్రత్యేక సమస్య

మన దేశంలో ఆదివాసీల సమస్యను కూడా ప్రత్యేకంగానే గుర్తించాలి. వారు అత్యంత వెనుకబడిన ఒక సామాజిక సముదాయంగానే జీవిస్తున్నారు. విశాల భారతదేశంలో వారు గణనీయంగానే (8 కోట్ల పైన) ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో వారి సంఖ్య జనాభాలో మూడింట ఒక వంతు కూడా ఉంది. విదర్భలోని 11 జిల్లాల్లో ఆదివాసులున్నారు. కొన్ని జిల్లాల్లో ఇంచుమించు జనాభాలో సగభాగంగా కూడా ఉన్నారు. ఇంత విశాల ఆదివాసీ కమ్యూనిటీ (సముదాయం) ఉన్నప్పటికీ ఎక్కడా వారికి స్వయం పాలన (అటానమస్) ప్రాంతాలు లేవు. ప్రభుత్వం కొన్ని ప్రాంతాలను నోటిఫైడ్ ప్రాంతాలుగా గుర్తించినప్పటికీ, రాజ్యాంగంలో 5వ, 6వ షెడ్యూల్‌లో అనేక విషయాలు పేర్కొన్నప్పటికీ, బూరియా కమిషన్ సిఫారసులు అమలు చేస్తామంటున్నప్పటికీ దేశంలో ఎక్కడా ఆదివాసుల అభివృద్ధికి తోడ్పడింది లేదు. అన్నీ కాగితాలకే పరిమితమైనాయి. ఇప్పటికీ ఈ దేశంలోని ప్రాకృతిక వనరులకు, సంపదలకు ఆదివాసీ ప్రాంతాలు నిలయంగా ఉండి, అపారమైన బండారాలను కలిగియుండి భూస్వామ్య దళారీ బూర్జువాల, సామ్రాజ్యవాదుల, వారి బహుళజాతి కార్పొరేషన్‌ల నిలువుదోపిడీకి గురవుతున్నాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా వారు చేపట్టే ప్రతి పోరాటాన్ని పరమ పాశవికంగా తుపాకీ సన్నీలతో, ఉక్కుపాదాలచే పాలకవర్గాలు అణచివేస్తున్నాయనడానికి నేటి పలు ఆదివాసీ ప్రజల పోరాటాలే సాక్ష్యంగా ఉన్నాయి. ఇందుకు తాజా ఉదాహరణగా 'జాన్ దె దేంగె, జమీన్ నహీ దేంగె' (ప్రాణాలను ఇస్తాం, భూమిని ఇవ్వం) అని నినదిస్తున్న ఝార్ఖండ్‌లోని పాగుర్ జిల్లా అమర్‌పాడా ప్రాంతంలోని 50 గ్రామాల ప్రజల పోరాటాన్ని చెప్పుకోవచ్చు. మన బస్తర్‌లో ఈ నినాద స్ఫూర్తితో పోరాడి గెలిచిన హీరానార్ ప్రజల పోరాటాన్ని పేర్కొనవచ్చు. అలాగే గడ్‌చిరోలి-అమరావతి-చంద్రపూర్-బండారా-గోందియా; మధ్యప్రదేశ్‌లోని ఖర్‌గోన్, జాబువా; కేరళ, కర్నాటక, ఒరిస్సాలోని ఆదివాసీ ప్రజా పోరాటాలను కూడా పేర్కొనవచ్చు. కాబట్టి ప్రత్యేక రాష్ట్రాల ఉద్యమాలు ఎక్కడ చెలరేగినా అక్కడి ఆదివాసీ ప్రాంతాల ప్రజల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోనికి తీసుకోకుండా, వాటిని సరిగా పరిష్కరించకుండా ఆ ప్రాంతంలో భాగంగా ఉంటున్న ప్రజల సమస్యలు తీరవు. ★

# సామ్రాజ్యవాద ప్రపంచీకరణకూ, యుద్ధానికీ వ్యతిరేకంగా ముంబాయి ప్రకటన - 2004

*[ముంబాయిలో జనవరి 17-20ల మధ్య జరిగిన 'ముంబాయి రెసిస్టెన్స్-2004' (ముంబాయి ప్రతిఘటన-2004) ప్రకటనను యథాతథంగా 'ప్రభాత్' పాఠకుల అవగాహన కోసం అందిస్తున్నాం. – సంపాదక వర్గం]*

భారతదేశంలోని ముంబాయిలో జనవరి 17-20, 2004 మధ్య జరిగిన "సామ్రాజ్యవాద ప్రపంచీకరణకూ, యుద్ధానికీ వ్యతిరేకంగా ముంబాయి ప్రతిఘటన 2004" అనే అంతర్జాతీయ వేదికకు సంబంధించిన మేము, 300 పైగా సంస్థలు మరియు వేలాది మంది వ్యక్తులు పాల్గొనగా, దిగువ ప్రకటన (డిక్లరేషన్) ను ఆమోదిస్తున్నాం.

జూన్ 2003 థెస్సాలోనికి (Tessaloniki) ప్రతిఘటన సభలో అంతర్జాతీయ ప్రజాపోరాటాల సంస్థ (ఐఎల్‌పిఎస్) రూపొందించి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను సంఘటితపరచి బలోపేతం చేయడానికి విశాల ప్రాతిపదికపై సామ్రాజ్యవాద వ్యతిరేక గ్రూపులన్నింటితో ఒక అంతర్జాతీయ వేదికను ఏర్పరచాలన్న లక్ష్యాన్ని యంఆర్ 2004 (ముంబాయి ప్రతిఘటన)లో జయప్రదం గావించాం.

యంఆర్ 2004 మాలో వెలువెత్తించిన, ఉత్సాహం మరియు శక్తితో పెంపొందిన ఐక్యత, సంకల్పం, అంతర్జాతీయ సమన్వయం మరియు శక్తితో మేము ఈ క్రింది ప్రకటన చేస్తూ కార్యాచరణకు పిలుపు నిస్తున్నాం.

మేము సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మరియు యుద్ధంతో తదికంటా పోరాడతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. దీనికోసం మేము ప్రజా వ్యతిరేక నూతన దాడుల పర్యవసానంగా దురాగతాలకు వ్యతిరేకంగా నిలిచే అన్ని శక్తులతో ఐక్యమౌతాం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు దారుణంగా బలవుతున్న నిరుపేద ప్రజల పక్షాన మేము దృఢంగా నిలబడతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న వారి పోరాటాలతో మేము ఐక్యమౌతాం.

సమాజాన్ని దారుణంగా ప్రభావితం చేస్తున్న అమానవీయ పేదరికం, ప్రజల జీవన విధాన విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, మూర్ఖపు వస్తువ్యామోహ సంస్కృతి, విపరీతమైన పరాయీకరణ మరియు విషమిస్తున్న జనజీవన సాంస్కృతిక పతనాన్ని ఖచ్చితంగా వ్యతిరేకిస్తామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ శక్తులు మరియు టిఎన్‌సిలు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వ్యాపార సంస్థ లాంటి దాని సంస్థలు మరియు వారి సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం యొక్క ముమ్మరమైన దాడులు మరియు దురాక్రమణ, సంపూర్ణ యుద్ధం లాంటి చర్యలకు వ్యతిరేకంగా నిలిచి తమ సార్వభౌమత్వాన్ని కోల్పోతున్న పీడిత దేశాలతో కలసి పోరాడతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పాలకవర్గాల ఫాసిస్టు దాడులు మరియు ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని నిలపడం, మతోన్మాద ఉద్రిక్తలైన ప్రత్యేకంగా రేసిజం, జియోనిజం లాంటి ఫాసిస్టు సైద్ధాంతిక మూలాలను కల్గిన చర్యలకు వ్యతిరేకంగా నిలిచి ప్రపంచంలో మూలమూలన తిప్పికొడతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

సామ్రాజ్యవాదుల ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదుల దురాక్రమణ, ఉక్కుపాదానికి వ్యతిరేకంగా అనేక దేశాల ప్రజలతో భుజం భుజం కలిపి సంయుక్తంగా పోరాడతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

సామ్రాజ్యవాదులు మరియు అంతర్జాతీయ ద్రవ్యనిధి మరియు ప్రపంచ బ్యాంకు మొదలైన వారి సంస్థల నుండి మూడవ ప్రపంచ దేశాలు పొందిన అప్పులన్నింటి రద్దు కొరకు పోరాడుతామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం.

అమెరికా మరియు ఇతర దురాక్రమణ బలగాలను ఇరాక్ నుండి ఉపసంహరించుకునే వరకు మేము ఇరాక్ ప్రజలపక్షాన నిలిచి గట్టిగా పోరాడుతామని మేము తీర్మానిస్తున్నాం.

పాలస్తీనీయుల మరియు అంబ్ ప్రజలతో భుజం భుజం కలిపి వారి మాతృభూమి స్వాధీనానికి మరియు సార్వభౌమత్వానికై పోరాడుతామనీ; అలాగే యూదులు మరియు పాలస్తీనా ప్రజలు శాంతి, సమాన హక్కులతో జీవించాలని మేము తీర్మానం చేస్తున్నాం.

ఆఫ్ఘనిస్తాన్ నుండి మరియు ప్రపంచంలోని ఇతర దేశాలన్నింటి నుండి తన బలగాలను ఉపసంహరించుకోవాలని మరియు విశ్వవ్యాప్తంగా అమెరికా తన మిలటరీ బలగాలను రద్దు చేసుకోవాలని పోరాడతామని మేము తీర్మానం చేస్తున్నాం.

అన్ని ప్రతీఘాతుక ప్రభుత్వాలకు ప్రత్యేకించి అమెరికా మరియు దాని తొత్తు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూ జైలు పాలైన రాజకీయ ఖైదీలందరిని బేషరతు విడుదలకై పోరాడుతామని మేము తీర్మానం చేస్తున్నాం.

ప్రపంచంలోని పీడిత దేశాలలో టిఎన్‌సిల కార్యకలాపాలను మానుకోవాలని, ఐయంఎఫ్, ప్రపంచ బ్యాంకు మరియు ప్రపంచ వ్యాపార సంస్థ లాంటి బహుపాక్షిక సంస్థల రద్దుకై పోరాడుతామని మేము తీర్మానం చేస్తున్నాం.

ప్రపంచంలోని పీడిత దేశాలు మరియు సామ్రాజ్యవాదుల మధ్య కుదిరిన అన్ని అసమాన ఒప్పందాలు, మిలటరీ ఒడంబడికల తక్షణ రద్దుకై పోరాడుతామని మేము తీర్మానం చేస్తున్నాం.

ప్రపంచవ్యాప్తంగా అన్ని జాతి రాజ్యాల సర్వ సంపూర్ణ సార్వభౌమత్వాన్ని - ఆర్థికంగా, రాజకీయంగా మరియు సైనికంగా అన్ని జాతుల జాతి స్వయం నిర్ణయాధికారంకై మరియు వారి మౌలిక హక్కుల సాధనకై ఎక్కడైనా ఇవి ఏ రూపంలో నైనా నిరాకరించబడినప్పటికీ సాధిస్తామని మేము దృఢసంకల్పంతో ఉన్నాము.

**ఈ సభ జరుగుతున్న భారత దేశంలో వాటి కోసం పోరాడతామని మేము తీర్మానిస్తున్నాం:**

* 'ఆర్థిక సంస్కరణలు', ఆర్థిక వ్యవస్థ యొక్క ఉదారీకరణ, ప్రైవేటీకరణ మరియు ప్రపంచీకరణ మరియు దేశంలోకి దొడ్డి దారిన విదేశీ పెట్టుబడులు రావడానికి స్వస్తి చెప్పాలని.
* సామ్రాజ్యవాదుల నమూనాలో పాలనకు మరియు అభివృద్ధికి అంతం పలకాలి. ప్రజలు కేంద్రంగా అభివృద్ధి మరియు నిజమైన ప్రజాస్వామిక సంస్థల స్థాపన, సంపూర్ణ ఉద్యోగిత మరియు సమాన హోదాల కోసం మేము నిలబడతాం. పని హక్కు కోసం మేము పోరాడుతాం.
* రాజ్య హింస, పోటా లాంటి అప్రజాస్వామిక చట్టాలు సమ్మెలపై మరియు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలపై నిషేధం, చట్ట వ్యతిరేక హత్యలు, చిత్రహింసలు, లాకప్ అత్యాచారాలు, మాయం

చేయడం మరియు అనేక పార్టీలను, సంస్థలను నిషేధించడం లాంటి అన్ని రూపాలలోని రాజ్యహింస అంతం కావాలి.

* రాజ్యం వత్తాసు గల హిందుత్వ ఫాసిజం అంతం కావాలి. మైనార్టీల హక్కులు రక్షింపబడాలి. బాబ్రీ మసీదు విధ్వంసానికి మరియు గుజరాత్ నరమేధానికి బాధ్యులైన వారిని శిక్షించాలి.
* జాతుల ఉద్యమాలకు వ్యతిరేకంగా సైనిక చర్యలను నిలిపివేయాలి. భూటాన్‌పై ఆధారపడి పోరాడుతున్న ఉద్యమాలను నిలిపివేయడానికి అక్కడ వినియోగిస్తున్న భారత బలగాలన్నింటినీ ఉపసంహరించుకోవాలి. జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ఆమోదించాలి.
* ప్రజల సాయుధ పోరాటాలతో సహా సంఘటితమయ్యే హక్కుకోసం మరియు అందరికీ భావప్రకటనా స్వాతంత్ర్యానికై డిమాండ్ చేస్తూ అన్ని ప్రజాస్వామ్య ఉద్యమాలకు వ్యతిరేకంగా సాగుతున్న రాజ్య హింస అంతం కావాలి.
* సాధారణంగా సామ్రాజ్యవాదంచే ప్రత్యేకించి అమెరికా/ఇజ్రాయిల్‌ల మూలంగా దేశ సార్వభౌమత్వానికి మరింత ప్రమాదం వాటిల్లడం అంతం గావాలి.
* రైతాంగంపై దాడులు, చౌక దిగుమతుల ప్రవాహం, పెట్టుబడులలో కోత, కన్సెషనల్ క్రెడిట్, విద్యుత్తు, నీటి సరఫరాపై కోత, రాయితీలపై కోత, ఆచరణలో ప్రజా పంపిణీ వ్యవస్థ అంతరించిపోవడం, వ్యవసాయం కార్పొరేటీకరణ లాంటివి అంతం కావాలి.
* విద్య ప్రైవేటీకరణ, ఉద్యోగుల తొలగింపు మరియు అవకాశాలు లేకుండా గావడం, సాంస్కృతిక విలువల పతనాన్ని ప్రోత్సహించడం లాంటి విషయాలలో వ్యక్తమైన విద్యార్థి యువజనులపై దాడులు అంతం గావాలి.
* ఆదివాసీ ప్రజల అస్తిత్వానికి ముప్పు ఏర్పడడం వారిని నిరాశ్రయులను చేయడానికి దారితీసే భారీ ప్రాజెక్టులు అన్నీ రద్దు కావాలి. అటవీ భూములు, సంపదలపై వారికి హక్కుండడంతో పాటు వారికి స్వయం పాలన రావాలి.
* శ్రామిక వర్గంపై దాడులు మరియు పెరుగుతున్న నిరుద్యోగ భూతం అంతం కావాలి. శ్రమ వ్యతిరేక చట్టాలు ఎత్తివేయాలి. స్వచ్ఛంద పదవీ విరమణకు స్వస్తి చెప్పాలి. గుత్త శ్రమ విధానాన్ని నిలిపి వేయాలి.
* అన్ని రూపాలలోని కుల వ్యవస్థ మరియు నేరపూరితమైన అస్పృశ్యతా విధానం కొనసాగడం రద్దు కావాలి. ప్రత్యక్షంగా, పరోక్షంగా గాని రాజ్యం మద్దతుతో దళితులపై పెరుగుతున్న దాడులను వెంటనే నిలిపి వేయాలి. నూతన ఉదారవాద ప్రపంచీకరణ చాటున తిరిగి బలం పుంజుకుంటున్న బ్రాహ్మణ వాదానికి వ్యతిరేకంగా అన్ని పీడిత కులాల ప్రజా పోరాటాల వెంటే ఉంటాము.
* ప్రపంచీకరణ విధానాలతో భారత జనాభాలోని అత్యంత మెజార్టీ కల్గిన చేతివృత్తుల కులాల మరియు వర్గాలు అతి దారుణంగా ప్రభావితమైనాయి. వారికి ప్రత్యామ్నాయం చూపని పక్షంలో వినాశనానికి గురౌతారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడుతామని తీర్మానిస్తున్నాం.
* దళితులు, ఆదివాసులు మరియు ఇతర పీడిత కులాలపై హిందుత్వ శక్తుల సాంస్కృతిక దాడులు మరియు వారు నీచమైన హిందూ రాష్ట్ర లక్ష్యాన్ని సాధించడానికై బలి పశువులు గావించే వారి రహస్య కుట్రలు అంతం కావాలి.
* ప్రపంచీకరణ కాలంలో పెరుగుతున్న మహిళల సరకీకరణ (commoditification) ప్రత్యేకించి మహిళలతో వ్యాపారం చేయడం మరియు వ్యాపార ప్రకటనలు, పర్యటన, బూతు కళా సాహిత్యాలు మొదలైన వాటిలో మహిళా విలువలు పతనం కావడం మరియు అన్ని రకాల పితృస్వామ్య వ్యక్తీకరణలు అంతం కావాలి.
* భారత విస్తరణవాదం మరియు తమ అమెరికా యజమానుల సన్నిహిత సంబంధాలతో భారత పాలక వర్గాలచే అక్రమ వేధింపులు, పొరుగు రాష్ట్రాలతో అక్రమ ఒప్పందాలు అంతం కావాలి.
* టిఎన్‌సిల-యంఎన్‌సిల ఉత్పత్తులను బహిష్కరిస్తూ సామ్రాజ్యవాదులకు మరియు సామ్రాజ్య మార్కెట్లకు అపారమైన నష్టాలను కల్గించాలని, వారిని దేశం నుండి ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదులను అన్ని దేశాల నుండి వెళ్లగొట్టగలిగే సమరశీల ప్రజా పోరాటాలను నిర్మించాల్సిందిగా ప్రజలకు మేము పిలుపునిస్తున్నాం.

ప్రపంచవ్యాప్త అమెరికా మిలటరీ క్యాంపులకు వ్యతిరేకంగా దృఢమైన ప్రతిఘటనను నిర్మించాల్సిందిగా ప్రజలకు మేము పిలుపునిస్తున్నాం. అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాదుల సైనిక క్యాంపులన్నీ పూర్తిగా ఎత్తివేసుకొనే వరకు నిరంతర ప్రజా నిరసన ఉద్యమాలను చేపట్టాలని మేము తీర్మానిస్తున్నాం.

'ప్రపంచీకరణ' పేరు కింద కొనసాగుతున్న సామ్రాజ్యవాద దాడిని తిప్పికొట్టాలని మరియు విశ్వవ్యాప్త శ్రామిక ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కలిసిరావాలని మేము భారతదేశంతో సహా ప్రపంచ దేశాల ప్రజలకు పిలుపు నిస్తున్నాం.

సామ్రాజ్యవాద దురాక్రమణదారులు ప్రత్యేకించి అమెరికా మరియు దాని అంటకాగే వారిని దృఢమైన అంతిమ విజయంకై సాగే ప్రతిఘటనోద్యమాల ద్వారా ప్రత్యేకించి ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ మరియు పాలస్తీనా ప్రతిఘటనోద్యమాల ద్వారా నిర్మూలించాలని ప్రజలకు మేము పిలుపు నిస్తున్నాం.

రాజ్యహింస మరియు పోటా లాంటి అప్రజాస్వామిక చట్టాలు ఏ రూపంలో ఉన్నప్పటికీ వ్యతిరేకించాలని మరియు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న వారి ఫాసిస్టు ఊచకోతను తిప్పికొట్టాలని మేము ప్రజలకు పిలుపునిస్తున్నాం.

సామ్రాజ్యవాదుల అసంతృప్తులను వ్యాపింపజేసే సామ్రాజ్యవాద పథకాలను మరియు చిట్కాలను ప్రత్యేకించి ప్రభుత్వేతర సంస్థలచే మరియు సోషల్ డెమొక్రట్‌లు చేపట్టిన వాటిని తీసుకోవద్దనీ, ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదాన్నీ మరియు దాని బంటులనూ నిర్మూలించడానికి శక్తివంతమైన సమరశీల ఉద్యమాలను నిర్మించాలనీ, అందరికీ న్యాయం మరియు సమానత్వంపై ఆధారపడే నూతన వ్యవస్థ నిర్మాణానికై సోషలిజంవైపు పురోగమించే ప్రపంచానికై కృషి చేయాలని ప్రజలకు మేము పిలుపు నిస్తున్నాం.

సామ్రాజ్యవాదానికి మరియు అన్ని రకాల అభివృద్ధినిరోధకత్వానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్న ప్రజలతో సమైక్యమవుతామని సంఘీభావాన్ని వ్యక్తం చేస్తున్నాం. ఉమ్మడి శత్రువుకు అంటే సామ్రాజ్యవాదం మరియు దానితో కలగలసిన మిత్రులకు వ్యతిరేకంగా ఉమ్మడి రణ భూములను నిర్మించడంలో బలంగా సహకారాన్ని కోరుతున్నాం.

నేడు, 18 జనవరి 2004 నాడు మనమంతా సమైక్యమవుదామని పోరాటాల బాటలో పురోగమిద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రపంచ పీడిత ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తును సృష్టిద్దాం. అందుకు తొలి చర్యగా మనం మార్చి 20ని అమెరికన్-బ్రిటిష్ బలగాలు ఇరాక్‌పై దురాక్రమణకు పూనుకున్న ఈ రోజును సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా నిరసనల దినంగా మరియు సామ్రాజ్యవాదుల శక్తులకు భారత దేశంతో సహా ప్రపంచంలోని దాని ఏజంట్లందరికి వ్యతిరేకంగా సమరశీల చర్యల దినంగా పాటిద్దాం.

**సంతకాలు**

*జనవరి 18, 2004* **యంఆర్ 2004కు వచ్చిన 311 సంస్థలు**

# కోరాపుట్‌లో పిజిఏ నిర్వహించిన సాయుధ గెరిల్లా దాడిని ఎత్తిపడదాం!

## ప్రతీఘాతుక శత్రు బలగాల నుండి ఆయుధాలను గుంజుకొని ప్రజా బలగాలను సాయుధం చేద్దాం!

*ఫిబ్రవరి* ***10, 2004***

భారతదేశంలో భూస్వాముల, సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాల దోపిడీ సంకెళ్ల నుండి దేశాన్ని విముక్తం చేసే లక్ష్యంతో కొనసాగుతున్న మావోయిస్టు ప్రజాయుద్ధ చరిత్రలో ఫిబ్రవరి 6, 2004 ఒక గొప్ప పోరాట దినంగా నిలిచిపోతుంది. ఆ రోజున పిజిఏకు చెందిన ప్రత్యేక స్ట్రైకింగ్ బలగాలు కేంద్రీకృత మిలటరీ కమాండ్ నేతృత్వంలో కోరాపుట్ జిల్లాలో 10 చోట్ల ఏకకాలంలో నిర్వహించిన దాడులు ఆ రోజంతా జిల్లా యంత్రాంగాన్ని పూర్తిగా స్తంభింపజేసాయి. వీరోచిత గెరిల్లా బలగాలు నిర్వహించిన ఈ సాహసోపేతమైన సాయుధ దాడులను దేశంలో కొనసాగుతూన్న ప్రజాయుద్ధంలో సరికొత్త మైలురాయిగా సిపిఐ (యం-యల్) [పీపుల్స్‌వార్], యంసిసిఐ పార్టీల కేంద్రకమిటీలు కీర్తిస్తున్నాయి. కేంద్ర అర్ధ సైనిక బలగాలు, ఆంధ్ర గ్రేహౌండ్స్, ఆంధ్ర, ఒరిస్సా ప్రత్యేక పోలీసు బలగాలు అమలు చేస్తున్న తీవ్రమైన చుట్టివేత-అణచివేత క్యాంపెయిన్లను ఎదిరిస్తూనే విప్లవ ప్రజానీకపు క్రియాశీల మద్దతుతో ఈ ఎత్తుగడల ఎదురుదాడులు జరిగాయి.

శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో పిజిఏ/పిఎల్‌జిఏ ద్వారా 3వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్ నుండి ప్రత్యేక పోలీసు బలగాలను కదలకుండా పూర్తిగా నిలవరించారు. అదే సమయంలో పిజిఏకు చెందిన ఇతర యూనిట్లు పట్టణంలో రెయిడ్స్ నిర్వహించాయి. మరో పిజిఏ యూనిట్ పట్టణానికి 8 కి.మీ. దూరంలో ఉన్న కోలాబ్ హెడ్‌క్వార్టర్స్‌లోని సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ముందుకు రాకుండా రోడ్డును దిగ్బంధించింది. పట్టణంలోని శత్రుస్థానాలను రక్షించాలనే ప్రయత్నంలో వేగంగా వస్తున్న కేంద్ర బలగాల ట్రక్కును గెరిల్లాలు పేల్చివేయడంతో ఇద్దరు సైనికులు అక్కడే చావగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఖంగు తిన్న సిఆర్‌పిఎఫ్ బలగాలు పారిపోవడంతో పిజిఏ బలగాలు పట్టణంలో వరుసగా దాడుల్ని నిర్వహించి సురక్షితంగా తప్పుకోవడానికి మంచి అవకాశం కలిగింది. పిజిఏకు చెందిన ఇతర మూడు యూనిట్లు జిల్లాలోని మూడు పోలీసు స్టేషన్లను దిగ్బంధించి తుపాకులు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకోవడంతో మన బలగాలు సురక్షితంగా తిరోగమించడం మరింత సులువైంది. ఈ రెయిడ్లలో 500కు పైగా ఆయుధాలు, 25 వేలకు పైగా తూటాలు జప్తు అయ్యాయి. ఇందులో

## సిపిఐ (యం-యల్) [పీపుల్స్‌వార్], యంసిసిఐ కేంద్రకమిటీల సంయుక్త పత్రికా ప్రకటన

యూనిట్లను సాయుధం చేయాలనే రెండు పార్టీల కేంద్ర కమిటీల ఉమ్మడి అవగాహనపై ఆధారపడి సిపిఐ (యం-యల్) [పీపుల్స్‌వార్]కు చెందిన సియంసి (సెంట్రల్ మిలటరీ కమిషన్) ఈ నిర్ణయం తీసుకుంది. పిజిఏకు చెందిన రెండు ప్రత్యేక కంపెనీలు ఈ దాడుల్ని నిర్వహించాయి. జిల్లా హెడ్‌క్వార్టర్ పట్టణమైన కోరాపుట్‌లో శత్రు స్థావరాలు ఏడింటిపై ఏకకాలంలో జరిపిన దాడుల్లో ఎత్తుగడలపరంగా విజయం సాధించాయి. అవి జిల్లా ఆయుధాగారం/పోలీస్ హెడ్‌క్వార్టర్స్, పట్టణ, గ్రామీణ పోలీసు స్టేషన్లు, ఎస్‌పి ఆఫీసు, జిల్లా కోశాగారం, జిల్లా జైలు, ఒరిస్సా ప్రత్యేక సాయుధ బలగాలకు చెందిన మూడవ బెటాలియన్, అదే జిల్లాకు చెందిన మూడు పోలీసు స్టేషన్‌లు (కుక్కిరిగమ్మ, నారాయణపట్న, డిప్యూటి ఎస్‌పి ఆఫీసు, లక్ష్మీపురం పిఎస్)లపై జరిపిన ఈ దాడులు, శత్రువు అత్యధిక బలాన్ని కల్గియున్న స్థితిలో కూడా యుద్ధం చేయవచ్చన్న కామ్రేడ్ మావో రూపొందించిన మిలటరీ పంథాపై ఆధారపడిన గెరిల్లా ఎత్తుగడల గొప్పతనాన్ని చాటుతున్నాయి. ఆధునిక ఆయుధాలు, మంచి శిక్షణ, సంఖ్య రీత్యా ఆధిక్యతలో ఉన్న కిరాయి శత్రు బలగాలను సంఖ్య రీత్యా బలహీనంగా ఉన్నప్పటికీ, పట్టుదలా, నిర్భయత్వం, రాజకీయ లక్ష్యం కలిగిన ప్రజా సాయుధ బలగాలు "శత్రు బలగాల బలహీన అంశాల (పాయింట్స్) నిర్దిష్ట సర్వే, పరిపూర్ణమైన ప్లానింగ్, మెరుపువేగంతో సర్‌ప్రైజ్ దాడులను నిర్వహించడం" అనే సూత్రంపై ఆధారపడి దెబ్బతీయగలవని ఈ దాడులు తెలుపుతున్నాయి.

గెరిల్లాలు వివిధ రెయిడ్లు చేయడంతో పాటు తమ గెరిల్లా దాడుల ఒక సిఆర్‌పిఎఫ్ జవాను చనిపోగా జైలు అధికారి గాయపడ్డాడు. గెరిల్లా బలగాల వైపు ఒక్క నష్టం కూడా జరగలేదు.

దేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధాన్ని అణచడానికి జాయింట్ ఆపరేషనల్ కమాండ్ ఆధ్వర్యంలో 9 రాష్ట్రాల పోలీసు బలగాలు, దేశంలోని మూడవ వంతు సిఆర్‌పిఎఫ్ బలగాల సమన్వయంతో మిలటరీ దాడులు నిర్వహించడానికి ఒకదాని వెనుక ఒకటిగా వ్యూహాలు రూపొందిస్తున్న పాలకవర్గాల కుట్రల్ని మన పిజిఏ బలగాలు, ప్రత్యేక శిక్షణ కల్గిన విప్లవ ప్రతీఘాతుక క్యాంపుల మధ్యనే శత్రు సొంత స్థావరాలపైనే బలమైన దెబ్బతీశాయి. ప్రపంచ బ్యాంకు తొత్తు, విప్లవోద్యమానికి వ్యతిరేకంగా జరుపుతున్న క్రూరమైన క్యాంపెయిన్లలో ముందు నిలిచిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై గత సంవత్సరం అక్టోబర్ 1న జరిపిన సాహసోపేతమైన దాడి పిజిఏ నిర్వహించిన మొట్టమొదటి పెద్ద దాడి. అయితే వాడు ఈ దాడిలో బతికి బైటపడ్డాడు. ఫాసిస్టు నియంతా, సామ్రాజ్యవాద ఏజెంటూ అయిన చంద్రబాబుపై పిజిఏ జరిపిన వీరోచిత దాడిని కూడా మా కేంద్రకమిటీలు రెండూ ఎత్తిపడుతున్నాయి.

సిపిఐ (యం-యల్) [పీపుల్స్‌వార్], యంసిసిఐ పార్టీల నాయకత్వంలో ఒరిస్సాలోని రాయగడ, గజపతి, మల్కాన్‌గిరి, కోరాపుట్, మయూర్‌భంజ్ మరియు నయాపార, బారాఘర్, సంబల్‌పూర్, జగత్‌సింగ్‌పూర్, సుందర్‌గడ్ జిల్లాల్లో కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను అణచివేయడానికి పెద్దెత్తున పోలీసు బలగాలను మోహరించి బూటకపు ఎన్‌కౌంటర్లలో మిలిటెంట్ రైతులను *(మిగతా **17**వ పేజీలో .....)*

# ఛత్తీస్‌గఢ్ శిక్షాకర్మీల సమ్మె – నాయకత్వ విద్రోహంతో విఫలం

1991 నుండి భారతదేశంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల పేర్లతో ప్రపంచ బ్యాంకు-ఐయంఎఫ్ నిర్దేశిత వ్యవస్థాగత సర్దుబాట్ల పేరుతో సంస్కరణల అమలును ప్రారంభించింది. దీనినే నేడు కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్నాయి.

సామ్రాజ్యవాదుల బహుళజాతి కంపెనీలకు లాభాలు లభించేట్లు చేయడం, వారి ఉత్పత్తులకు మార్కెట్ తెరచి ఉంచడాన్నే, నేటి వెనుకబడిన దేశాల దళారీ నిరంకుశ బూర్జువా భూస్వాములకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు, పార్టీలు అనుసరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ నాయకత్వంలో విద్యను కూడా వ్యాపారం చేయడం, ప్రైవేటీకరించడం, ప్రభుత్వ సహాయంలో కోత విధించడం ప్రారంభించాడు. ఈ పాలసీలో భాగంగానే తక్కువ వేతనాలతో ఎక్కువ మంది టీచర్లను నియమించడం, నిరుద్యోగ యువకులలో ఉపాధి కల్పిస్తున్నట్లుగా భ్రమలు కల్పించడం ప్రారంభించాడు. ఈ పాలసీకి అనుగుణ్యంగానే 1995లో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ''శిక్షా గ్యారంటీ యోజన'ను అమలులోకి తెచ్చింది. దాని ఫలితంగానే ''శిక్షా గ్యారంటీ గురూజీ'' ఉద్యోగాలు వచ్చాయి. ఆ సందర్భంగానే మధ్యప్రదేశ్ పంచాయితీ 'శిక్షాకర్మీ నియమ్ -1977' పేరుతో ఆదేశాలు జారీచేసి ''శిక్షాకర్మీ'' అనే పేరు టీచర్స్‌కు పెట్టారు. ఇవి వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో ఉన్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ విద్యా వాలంటీర్ల పేరుతో ఈ పథకం నడుస్తున్నది. పథకం ఏదైనా సారాంశం మాత్రం ఒక్కటే. రెవిన్యూ లోటును తగ్గించడం పేరుతో ప్రభుత్వ ఖర్చు తగ్గించడం, విద్య వైద్యం లాంటి ప్రజోపయోగ, సేవా రంగాలకు ఇస్తున్న నామమాత్రపు సబ్సిడీలలో కోత విధించడం నేటి దళారీ పాలకవర్గాల పాలసీల్లో సాధారణ అంశంగా మారింది. ప్రజలను, నిరుద్యోగ యువకులను మోసం చేయడానికి ''సరళమైన బాధ్యతాయుతమైన, పారదర్శక సంస్కరణలను అమలుచేసే ప్రభుత్వం'' పేరుతో వీటిని అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత సంవత్సరం జులై-ఆగస్టులలో జరిగిన శిక్షాకర్మీల సమ్మె కనీస డిమాండ్స్‌ను కూడా నెరవేర్చుకోకుండా, ప్రభుత్వం ఇచ్చిన అల్టిమేటంకు తలొగ్గి, రాష్ట్ర స్థాయి నాయకత్వం పోరాటానికి ద్రోహం చేసిన ఫలితంగా అది విరమించబడింది. కనీస హామీలైనా పొందకుండానే (అర్ధాంతరంగా) ఘోరంగా సమ్మె ముగించారు.

ఈ సమ్మె పోరాటం జరిగిన నేపథ్యంలో, జరిగిన తీరును పరిశీలించి గుణపాఠాలు తీసుకోవలసిన అవసరం దోపిడీకి, అన్యాయానికి గురవుతున్న ఉద్యోగులందరి ముందుంది.

1995లోనే ఉమ్మడి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సర్వ శిక్షా అభియాన్ (అందరికీ విద్య క్యాంపెయిన్) పేరుతో ప్రభుత్వం కింది వర్గాలకు విద్యను అందుబాటులోకి తీసుకొస్తాం అనే దానితో శిక్షా గ్యారంటీ గురూజీలను, శిక్షా కర్మీలను నియమించడం ప్రారంభమైంది. చాలా గ్రామాలలో కొన్ని పాఠలలల్లో కొన్ని కొత్త స్కూల్స్ ప్రారంభించారు. రోజుకో స్కూల్ ప్రారంభించి లక్షలాది గ్రామీణ, పట్టణ పేదలకు విద్యను అందుబాటులోకి తెస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రచార సాధనాలు విపరీతమైన ప్రచారం చేశాయి. అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కొందరు విద్యా నిపుణులు కితాబులిచ్చారు. కానీ పేర్లు వేరువేరుగా పెట్టినా సేవలు మాత్రం మిగతా టీచర్లందరిలాగే సమానంగా అందిస్తూ అన్యాయానికి గురవుతున్న ఈ శిక్షాకర్మీలు (టీచర్లు) గత ఆరు సంవత్సరాల నుండి తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మధ్య మధ్యన పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు.

శిక్షా కర్మీలను మూడు శ్రేణులుగా విభజించి ఈ క్రించి విధంగా పే స్కేల్స్ ప్రభుత్వం నిర్ణయించింది. వేతనం స్కేల్స్‌ఈ విధంగా వున్నాయి:

వర్గ్-1 .. రూ. 3,900
వర్గ్-2 .. రూ. 3,250
వర్గ్-3 .. రూ. 2,700

అలాగే శిక్షా గ్యారంటీ గురూజీలకు నెలకు వేతనం రూ. 500/-, 1000/- పంచాయితీ డిపార్ట్‌మెంటు ద్వారా ఇస్తున్నది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది శిక్షా కర్మీలు వివిధ స్కూళ్లలో పనిచేస్తున్నారు. వీరు ''సమాన పనికి సమాన వేతనం, సమాన పదవి - ఒకే డిపార్ట్‌మెంట్'' అనే తమ డిమాండ్స్‌ను నిరంతరం ప్రభుత్వానికి విన్నవించుకుంటూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం నిత్యం పెడచెవినే పెడుతున్నది. వీరికి పెన్షన్, గ్రాట్యుటీ సదుపాయం కూడా లేదు, భవిష్యత్ నిధి సదుపాయం లేదు. డిఏ వృద్ధి సున్నా శాతం ఉంటుంది. ఒకే స్కూల్‌లో విద్యను అందిస్తున్న కొందరు టీచర్లకు ప్రభుత్వం అధిక వేతనాలు ఇస్తూ శిక్షాకర్మీలను మాత్రం కట్టు బానిసల్లాగా తక్కువ వేతనాలు ఇస్తూ దోపిడీకి గురిచేస్తున్నది. ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం టీచర్స్‌కు వేతనాల చెల్లింపు (పే స్కేల్స్) దిగువ తరహాలో ఉన్నాయి:

| | |
|---|---|
| లెక్చరర్స్ 'శ్రేణి I' | ..5500-175-9000 |
| టీచర్స్ 'శ్రేణి II' | ..5000-125-70000 |
| అసిస్టెంట్ టీచర్స్ 'శ్రేణి III' | ..4000-100-6000 |

దీనితో శిక్షా కర్మీలు సమాన పనికి సమాన వేతనం, సమాన పదవి-ఒకే డిపార్ట్‌మెంట్ అనే తమ న్యాయమైన డిమాండ్లపై అనేక సార్లు ప్రభుత్వానికి అర్జీలు ఇచ్చుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో 2003 సంవత్సరంలో తమ పోరాటాన్ని ఉధృతం చేశారు. పంచాయితీ శాఖ ఉద్యోగులుగా గాకుండా తమను విద్యాశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2003లో శిక్షా కర్మీలు రాష్ట్రవ్యాప్తంగా 16 రోజులు సమ్మె చేసి విద్యా సంస్థలలో పనిని స్తంభింప జేశారు. అన్ని జిల్లా కేంద్రాలలో, రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లో సమ్మె కొనసాగింపుగా వారు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం, టీచర్స్ డిమాండ్స్‌ను నెరవేర్చుతామని, అప్పటి ముఖ్యమంత్రి అజిత్ జోగి హామీ ఇచ్చి పంచాయితీ శాఖ కార్యదర్శి యం.కె. రావుత్ అధ్యక్షతన ఒక

కమిటీని నియమించాడు. ఈ కమిటీ జులై 2003న శిక్షా కర్మీలపై తన సిఫార్సులను ప్రభుత్వం ముందుంచింది.

యం.కె. రావుత్ కమిటీ శిక్షా కర్మీల వేతనాలపై ప్రతిపాదించిన వేతన స్కేల్ -

వర్గ్ I ..3900-50-4900

వర్గ్ II ..3250-40-4050

వర్గ్ III ..2700-30-3300

ఇందులో డిఎ సున్నా శాతం ఉంటుంది. ఇందులో భవిష్యత్తు నిధిని కట్ చేసి పెన్షన్ మరియు గ్రాట్యుటీ ఏ మాత్రం లేని సిఫార్సులను ఈ రావుత్ కమిటీ ప్రభుత్వం ముందుంచింది. శిక్షాకర్మీల డిమాండ్లను ఆమోదిస్తే ప్రభుత్వ టీచర్స్‌తో సమానంగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. దీనితో 76 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందని ప్రభుత్వ వాదన. కానీ శిక్షా కర్మీల సంఘం తమకు కూడా 5వ వేతన సంఘం సిఫారసులను అమలుపరచి, తమ వేతన స్కేల్స్‌ను సవరించాలని డిమాండ్ చేసింది. ఐదవ వేతన సంఘం సిఫారసులను అమలు చేసినప్పటికీ ప్రభుత్వానికి ఖర్చు కేవలం 34 కోట్ల రూపాయలే అవుతుంది. కావున ప్రభుత్వ ఖజానాకు పెద్ద లోటు రాదని కూడా శిక్షాకర్మీల సంఘం అంకెల సాక్ష్యంగా సూచించింది. కానీ వారి డిమాండ్లను పెడచెవిన పెట్టి ప్రభుత్వం ఘోరంగా రావుత్ కమిటీ సిఫారసులను ముందుకుతెచ్చింది. దీనితో ఆశించిన తమ డిమాండ్స్‌ను తుంగలో తొక్కినందుకు శిక్షాకర్మీలు రావుత్ కమిటీ ప్రతిపాదనల కాపీకి జులై 23న నిప్పంటించి తమ తీవ్ర నిరసనను తెలియజేశారు. జిల్లా కలెక్టర్లకు తమ డిమాండ్ల పత్రాలను సమర్పించారు. ప్రభుత్వం విద్యను వ్యాపారం చేయడాన్ని ఖండించారు. ఒకే పనిని నిర్వహించే టీచర్స్‌ను ప్రభుత్వం శిక్షక్, శిక్షా కర్మీ, సంవిదా శిక్షక్ మొదలైన పేర్లు పెట్టి, వివిధ శ్రేణులుగా విభజించి, అసమాన వేతనాలు ఇస్తూ నిరుద్యోగ యువకుల భవిష్యత్‌తో ఆడుకోవడాన్ని నిరసిస్తూ 'సమాన పనికి సమాన వేతనం' అనే తమ ఏకైక నినాదాన్ని డిమాండ్‌గా ముందుంచారు.

జులై 2003 నుండి సమ్మెను కొనసాగించారు. అన్ని జిల్లా కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మొదటిసారి శిక్షా కర్మీలకు మద్దతుగా విద్యార్థులు, వారి తల్లితండ్రులు కూడా ర్యాలీలు నిర్వహించారు. న్యాయమైన తమ దిగువ –

1. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

2. వార్షిక వేతన వృద్ధి కావాలి.

3. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి.

4. ముందే వేతన బత్తా ఇవ్వాలి.

5. తమను విద్యా శాఖ మరియు ఆదివాసీ సంక్షేమ శాఖ ఉద్యోగుల జాబితాల్లో చేర్చాలి.

– అనే డిమాండ్లతో పాటుగా 5వ వేతన సంఘం సిఫారసులను అమలుపరచాలని, పెన్షన్, డిఎ సదుపాయం ఉండాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేశారు. శిక్షా కర్మీల సమాన పనికి సమాన వేతనం డిమాండుకు మద్దతుగా రాష్ట్రంలోని 6 జిల్లాల్లో 7 జిల్లా పంచాయతులు, 16 జనపద్ పంచాయతులు తీర్మానాలు చేశాయి. మెజారిటీ ఉద్యోగ కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. శిక్షాకర్మీల కుటుంబ సభ్యులు, పిల్లలు, పల్లెలూ పట్టణాలలోని ప్రజలు కూడా వీరికి మద్దతుగా ర్యాలీలు, ప్రదర్శనలు జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాలలో శిక్షా కర్మీలు రోజుల తరబడి రిలే నిరాహార దీక్షలు చేసినందుకు ఆరోగ్యం క్షీణించినందువల్ల 11,900 మందిని హాస్పిటల్‌లో చేర్పించారు. మొక్కవోని ధైర్యంతో శిక్షా కర్మీలు వారి చరిత్రలో మొదటిసారి చాలా విస్తృతంగా సమ్మెను కొనసాగించారు. సమ్మెకు అన్ని వర్గాల మద్దతు పొందారు. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగానే సమ్మెకు మద్దత్తుగా అన్ని జిల్లా కేంద్రాలలో బంద్ పాటించాయి. ఆగస్టు 16న బీజాపూర్ బంద్, ఆగస్టు 20న జగ్దల్‌పూర్ బంద్ పాటించారు. నారాయణపూర్, దంతెవాడ, కాంకేర్‌లలో అలాగే బడ్‌గాం, పఖంజూర్, ధమ్‌తరీ, జాగబరా ... ఇలా చిన్నా పెద్దా బ్లాక్ కేంద్రాలలో దాదాపు అన్ని జిల్లా కేంద్రాలలో బంద్ పాటించారు. రైతాంగం ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు కూడా వీరి సమ్మెకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. ప్రభుత్వం బహుముఖ అభివృద్ధిని సాధిస్తున్నామని, ఆదివాసీ ప్రాంతాలలో ప్రత్యేక ప్యాకేజీలు (బస్తర్ ప్యాకేజి, సర్గుజా ప్యాకేజి) ప్రకటించి ఆశ్రమ స్కూలు పద్ధతి ద్వారా అక్షరాస్యతలో వృద్ధి సాధిస్తామని బూటకపు ప్రకటనలను జోరుగా గుప్పించి, దళారీ నిరంకుశ పాలక వర్గాలు న్యాయమైన శిక్షా కర్మీల డిమాండ్‌లను పెడచెవిన పెట్టాయి. వాస్తవ విరుద్ధంగా, హేతుబద్ధంకాని వేతన స్కేల్స్ రావుత్ కమిటీ సిఫారసులు ప్రకటించిన ప్రభుత్వం సమ్మెను ఉక్కుపాదంతో అణచడానికి పూనుకొంది. గత సంవత్సరం జులై 25 నుండి కొనసాగుతున్న శిక్షాకర్మీల సమ్మెను అజిత్ జోగి మంత్రివర్గం సానుభూతితో పరిశీలించకపోగా, విద్యా శాఖా మంత్రి అసలు శిక్షాకర్మీలకు సమ్మె చేసే హక్కు లేదనీ, వారు విద్యాశాఖ ఉద్యోగస్థులే కాదనీ, పంచాయతీ శాఖకు సంబంధించిన దిన వేతన కూలీలనీ పేర్కొంటూ అని పత్రికల్లో వ్యాసం రాశాడు, ప్రకటనలు ఇచ్చాడు. శిక్షా కర్మీలతో చర్చలు చేసేది లేదని ప్రకటించాడు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రముఖ బూర్జువా పత్రికలైన దైనిక్ భాస్కర్, నవభారత్‌లు శిక్షాకర్మీల సమ్మె అనుచితమనీ, హేతుబద్ధం కాదనీ, తమిళనాడులో జయలలిత ప్రభుత్వోద్యోగులపై తీసుకున్న చర్య నుండి వీరు గుణపాఠం తీసుకోవాలనీ, సుప్రీంకోర్టు 'సమ్మె రాజ్యాంగ విరుద్ధం' అని ప్రకటించిన విషయం వీరికి గుర్తు లేనట్లున్నదనీ, అధిక వేతనాలు డిమాండ్ చేయవద్దనీ, ప్రభుత్వం ఎంత జీతం ఇస్తుందో అంతే తీసుకోవాలనీ, సమాన పని-సమాన వేతనం డిమాండ్ హేతుబద్ధం కాదనీ అంటూ తమ ప్రజా వ్యతిరేక అభివృద్ధి నిరోధక భావాల విషం కక్కుతూ వార్తలు ప్రచురించాయి. మొదటిసారిగా ప్రతి పార్టీ, వర్గం తమ వైఖరులు ప్రకటించాయి. నిజానికి అది ఎన్నికల సందర్భం గావడంతో అన్ని బూర్జువా పార్టీలు వారిని పక్కదారి పట్టించడానికీ, ఓట్లు దండుకోవడానికీ ప్రయత్నించాయి.

కాంగ్రెస్, బిజెపి పార్టీల ప్రభావంతో శిక్షాకర్మీల రాష్ట్ర నాయకత్వం సమ్మె పోరాటాన్ని విశాల ప్రజల మద్దతుతో మిలిటెంట్‌గా కొనసాగించలేదు. అజిత్ జోగి ప్రభుత్వం 'సమ్మె' విరమించుకోకుంటే శిక్షా కర్మీలను ఉద్యోగాల నుండి తొలగిస్తామనే అల్టిమేటమ్ (ఆగస్టు 19న) ఇవ్వగానే, అప్పటివరకు గంభీర ఉపన్యాసాలు ఇచ్చిన సంజయ్ శర్మ (శిక్షాకర్మీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు) ఆగస్టు 21న ప్రభుత్వ అల్టిమేటంకు తలవొగ్గి చాలా నిస్సహాయంగా, బేషరతుగా సమ్మె విరమిస్తున్నట్టు రాయపూర్‌లో ప్రకటించాడు. దాదాపు 25 రోజులు చేసిన సమ్మెను ఏ డిమాండ్ కూడా సాధించుకోకుండా ఇంత నిస్సిగ్గుగా విరమించడానికి అనేక జిల్లాల్లోని కిందిస్థాయి సంఘాలు సమ్మతించలేదు. చిత్తశుద్ధి కలిగిన, దృఢమైన నాయకత్వం లేనందున పోరాటాన్ని అర్థాంతరంగా విరమించుకున్నారు. కానీ సాధారణ

శిక్షా కర్మీల మనసుల్లో ప్రభుత్వపు నిరంకుశ దోపిడీ, అహంభావపూరిత ప్రవర్తన పట్ల తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇంతేకాదు, సమ్మెలో గట్టిగా నిలబడిన ఉద్యోగులను వారి ఉద్యోగాల నుండి ప్రభుత్వం తొలగించినప్పటికీ పట్టించుకోని నాయకత్వం పట్ల వారు తమ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సమ్మె గుణపాఠాలు

సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల మద్దతుతో కొనసాగించారు. పిల్లలు, విద్యార్థులు, సాధారణ ప్రజలు, వాపారస్థులు ఈ సమ్మెకు మద్దతుగా ర్యాలీ, ప్రదర్శనల్లో బంద్‌ల్లో పాల్గొన్నారు. విశాల బస్తర్‌లోని విశాల రైతాంగం శిక్షా కర్మీల సమ్మెకు మద్దతుగా వీధుల్లోకి వచ్చారు. బేర్‌పాల్‌లో 3 వేల మందితో, బాసగూడలో 4 వేల మందితో, కాంకేర్ జిల్లాలోని కొన్ని పట్టణాల్లో వేలాది రైతాంగం శిక్షా కర్మీలకు సమర్థనగా ఆగస్టు 3వ వారంలో ర్యాలీలు నిర్వహించారు. ఇంత పెద్ద ఎత్తున ప్రజల మద్దతున్న సమ్మెను నాయకత్వం విరమించుకొనడం ఏ ఉద్యోగికీ నచ్చలేదు. కానీ ప్రత్యామ్నాయం తెలియకపోవడంతో వాళ్లు తమ నాయకత్వాన్ని నిరసిస్తూనే విధులకు హాజరైనారు.

డిసెంబర్ 1న జరిగిన ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల్లో నెగెటివ్ ఓటుతో గెలిచిన బిజెపి రమణ్‌సింగ్ నాయకత్వంలో తమ ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. అయితే ఎన్నికలకు ముందు ఓట్లు దండుకోవడానికి 'సమాన పనికి సమాన వేతనం' అన్న శిక్షా కర్మీల ప్రధాన డిమాండ్‌కు మద్దతు ప్రకటించిన బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ. 100/- జీతం పెంచి చేతులు దులుపుకుంది. శిక్షా కర్మీల ప్రధాన డిమాండ్‌ను తుంగలో తొక్కింది. ఉద్యోగాలు కోల్పోయిన బిలాస్‌పూర్ శిక్షాకర్మీల నాయకులకు మారిన బిజెపి సర్కార్ కూడా తిరిగి ఉద్యోగాలు ఇవ్వకుండా కోర్టుల చుట్టూ తిప్పుతోందంటే కాంగీకి, బిజెపికీ మధ్య ఎలాంటి తేడా లేదని ఈ పాటికి అన్ని రకాల ఉపాధ్యాయులూ, అన్ని శాఖల్లోని ఉద్యోగులూ గ్రహించే ఉండాలి. ఎందుకంటే బిజెపి సామ్రాజ్యవాదులు నిర్దేశించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను తు.చ. తప్పకుండా అమలుపరచేదే. ఇంతేకాదు, బిజెపి అధికారంలోకి వచ్చిన నెల లోపునే బాల్కోను పూర్తిగా ప్రైవేటీకరించడానికి నిర్ణయం తీసుకున్నది. అజిత్ జోగి హయాంలో ఒక్క రాయపూర్‌లోనే 20 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు తెరిస్తే నేటి భాజపా విద్యను కాషాయీకరణ చేయడంతో పాటు వ్యాపారంగా మార్చడంలో మరో అడుగు ముందుకు వేసింది. విద్యను వ్యాపారీకరించడంలో, విద్యా శాఖ నిధులలో కోత విధించడంలో భాజపా, కాంగ్రెస్, జాతీయవాద కాంగ్రెస్, రివిజనిస్టు సిపిఐ సిపియంలు, తెలుగుదేశం పార్టీ ...అన్నీ ఒక్కటేనని ఏ రాష్ట్ర తీరు చూసినా తెలుస్తూనే ఉంది.

ప్రపంచీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా ఒకవైపు విద్యా వ్యాపారీకరణ, మరోవైపు ఆ విధానాలన్నింటిని పూర్తిగా సమర్థిస్తూ వెలువడుతున్న అత్యున్నత న్యాయస్థానాల తీర్పులను శిక్షా కర్మీలూ, అన్ని శాఖల్లోని ఉద్యోగులూ అర్థం చేసుకొని తమ పోరాటాలను మరింత దృఢంగా నిలబడతారని ఆశిద్దాం. శిక్షా కర్మీలు గత 7 ఏళ్లుగా తమ నాయకత్వాన్ని పూర్తిగా విశ్వసిస్తూ వారు సమ్మె పిలుపులిస్తున్న ప్రతిసారీ వీధుల్లోకి వచ్చి తమ న్యాయమైన డిమాండ్లపై నిలబడి పోరాడుతున్నప్పటికీ ప్రధాన నాయకత్వం మాత్రం అల్పాతి అల్పమైన ప్రభుత్వ హామీలతో లేదా బెదిరింపులకు జడుసుకొని సమ్మెకు తిలోదకాలిస్తూ శిక్షాకర్మీల పోరాటచేవను నీరుకారుస్తోంది. నిరుద్యోగ భూతం పట్టి పీడిస్తున్న ఈ సమాజంలో ఉద్యోగాలు పోతే తిరిగి జీవిక ఎలా అన్న బెంగను వదలి విశాల ప్రజారాశుల మద్దతుతో సమరశీల పోరాటాలకు మీరు ఉద్యమిస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదు. ప్రజలు మీ వెంటే ఉన్నారని మీ సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా లభించిన మద్దత్తే తెలియజేస్తోంది. కాబట్టి అధికారాన్ని చేపట్టే ఏ పార్టీలైనా సారాంశంలో ఒక్కటేనన్న వాస్తవాన్ని ఇప్పటికైనా గ్రహించి అన్ని సెక్షన్ల ఉద్యోగుల మద్దత్తును మరింత కూడగట్టుకుంటూ, రాష్ట్రవ్యాప్త ప్రజామద్దతును పొందగలుగుతూ నాయకత్వ విద్రోహానికి గురికాకుండా మీ న్యాయమైన డిమాండులపై మీరు దృఢంగా నిలిచి సమరశీల పోరాటాలకు ధైర్యంగా దిగి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి వాటిని సాధించి తీరుతారని ఆశిస్తున్నాం. ★

---

*(..... 30వ పేజీ తరువాయి)*

కొనసాగుతున్న ఈ విధానాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగం. నిజానికి మీ సమస్యలు కూడా ఒక పెద్ద విషవలయంలో భాగం. దీని వెనుక సామ్రాజ్యవాదంతో పాటు, మన దేశంలోని భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాలున్నాయి. కాబట్టి మీరు మీ సమస్యల వరకే పరిమితం కావద్దనీ, మొత్తం సమాజంలో నెలకొన్న మౌలిక సమస్యలన్నిటితోనూ వాటిని జోడించి అర్థం చేసుకోవాలనీ మేం విజ్ఞప్తి చేస్తున్నాం. నేడు భూస్వామ్యాన్నీ, దళారీ పెట్టుబడినీ, సామ్రాజ్యవాదాన్నీ సమూలంగా అంతం చేసే ఒక విశాలమైన పోరాటం జరగకుండా ప్రజల సమస్యలేవీ శాశ్వతంగా పరిష్కారం కావు.

మీ డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవి. మీ పోరాటాలను మా పార్టీ హృదయపూర్వకంగా సమర్థిస్తోంది. మా పోరాట ప్రాంతాలలోని ప్రజలు నిరుటి మీ పోరాటానికి సంఘీభావంగా అనేక చోట్ల ఊరేగింపులు జరిపారు. ఇంకా అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మీ పోరాటం పట్ల ఇక్కడి రైతాంగం ప్రదర్శించిన సమైక్యతా, సంఘీభావాలు ఎంతో హర్షించదగ్గవి. మీరు దోపిడీ నాయకుల, దోపిడీ పార్టీల బూటకపు వాగ్దానాలను అసలే నమ్మకండి. ప్రభుత్వ బెదిరింపులకూ, పోలీసు నిర్బంధానికీ భయపడకుండా నిలబడండి. మీరు మీ డిమాండ్లకు మద్దతును తెలిపే కార్మిక-కర్షకులపైనా, తదితర పీడిత సెక్షన్ల ప్రజలపైనా మాత్రమే నమ్మకం ఉంచుకోండి. ఉపాధ్యాయ, విద్యార్థి సెక్షన్లన్నిటితోనూ మీరు సమైక్యం కండి. ఏ పోరాటమైనా సమర్థవంతమైన నాయకత్వం ఉంటేనే జయప్రదమవుతుందని మీరు ప్రత్యేకించి గుర్తుంచుకోవాలని కోరుతున్నాం. కాబట్టి మీరు విద్రోహకర, అమ్ముడుపోయే, రాజీవాద నాయకత్వాన్ని పక్కన పెట్టండి. నిజమైన సమరశీల నాయకత్వాన్ని ఎన్నుకొని ఉద్యమాన్ని శక్తివంతంగా కొనసాగించండి. మేమూ, మా దండకారణ్య పీడిత ప్రజలందరమూ మీతోనే ఉన్నాం.

*విప్లవాభినందనలతో...*

**స్పెషల్ జోనల్ కమిటీ,**

**సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]**

**తేదీ : *ఫిబ్రవరి 23, 2004*** **దండకారణ్యం**

*డిమాండ్లు నెరవేరే దాకా పోరాటాన్ని కొనసాగించండి!* *బూటకపు ఎన్నికలను బహిష్కరించండి!!*

## శిక్షాకర్మీలారా, గురూజీలారా !

## రాజీవాద నాయకత్వాన్ని తిరస్కరించి సమరశీల పోరాటమార్గాన్ని చేపట్టండి !

**మిత్రులారా !**

నేడు దేశంలో నలువైపులా "ఫీల్ గుడ్ ఫ్యాక్టర్" అనే భ్రమ వ్యాపించింది. దేశమంతా ఆనందమయంగా ఉందని బిజెపి డబ్బా వాయిస్తోంది. కానీ ఇదెంత అబద్ధమో శిక్షాకర్మీల, శిక్షా గ్యారంటీ గురూజీల స్థితిగతులను పరిశీలిస్తే సులువుగానే బోధపడుతుంది. ఛత్తీస్‌గఢ్‌లో 28 వేల శిక్షాకర్మీలు (విద్యా ఉద్యోగులు) పని చేస్తున్నారు. వీళ్లు అనేక ఏళ్లుగా తక్కువ వేతనంపై పని చేస్తూ ప్రభుత్వాల నిర్లక్ష్యానికీ, బూటకపు వాగ్దానాలకూ బలవుతూ, మోసపోతూ ఉన్నారు. వీళ్లు "సమాన పనికి సమాన వేతనం" కావాలనే తమ ఏకైక డిమాండుతో పలు మార్లు ఉద్యమం నడిపారు. కానీ వీళ్ల డిమాండు నేటికీ నెరవేరలేదు. శిక్షాకర్మీలు ఉద్యమం నడిపిన ప్రతి సారీ లేదా ఊరేగింపో, ధర్నానో జరిపిన ప్రతి సారీ పోలీసుల లాఠీ దెబ్బలకు గురవడమో లేదా ఇతర రూపాల నిర్బంధానికి గురి కావడమో జరుగుతూ వస్తోంది.

శిక్షాకర్మీల ఉద్యమానికి అసమర్థ, రాజీవాద నాయకత్వం ప్రతి సారీ ద్రోహం చేస్తూనే వచ్చింది. పోరాటాన్ని సమరశీలంగా ముందుకు తీసుకుపోవడానికి బదులుగా ప్రభుత్వ బెదిరింపులకో లేదా కల్లబొల్లి వాగ్దానాలకో వీళ్ల నాయకత్వం తలవంచుతూ వచ్చింది. గత సంవత్సరం శిక్షాకర్మీలు బ్రహ్మాండమైన పోరాటం నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ శిక్షాకర్మీలు ఆమరణ నిరాహారదీక్షకు పూనుకున్నారు. సమాజంలోని అన్ని సెక్షన్ల ప్రజలూ వీరి ఉద్యమానికి హృదయపూర్వక మద్దతునందించారు. ఎన్నికలు దగ్గరలో ఉన్నందున రాజకీయ పార్టీలన్నీ శిక్షాకర్మీల సమ్మెకు తమ మద్దతును తెలిపాయి. తాను అధికారంలోకి రాగానే శిక్షాకర్మీల సమస్యలన్నీ పరిష్కరిస్తానని బిజెపి ఢంకా బజాయించి మరీ చెప్పింది. ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న శిక్షాకర్మీలను పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి ఆసుపత్రులలో చేర్చారు. ప్రభుత్వం శిక్షాకర్మీలను ఉద్యోగాల్లోంచి తొలగిస్తానని బెదిరింపులు జారీ చేసింది. దీనితో శిక్షాకర్మీల నాయకత్వం లొంగిపోయి సమ్మెను విరమించింది. ఈ విధంగా అది 28 వేల మంది శిక్షాకర్మీలకు తీరని ద్రోహం చేసింది.

ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలకు మూల్యం చెల్లించక తప్పలేదు. కాంగ్రెస్‌ను ఓడించడంలో అజిత్ జోగి నిరంకుశ పాలనతో పూర్తిగా విసిగిపోయిన శిక్షాకర్మీల పాత్ర కూడా ఉంది. బిజెపి ప్రభుత్వం ఏర్పడితే తమకు న్యాయం జరగగలదని అనేక మంది శిక్షాకర్మీలు ఆశించారు. కానీ అట్లా ఏమీ జరగలేదు. రమణ్ సింగ్ ప్రభుత్వం బిచ్చం వేసినట్లుగా వేతనంలో 100 రూపాయల పెంపుదలను ప్రకటించి చేతులు విదిల్చింది. పైగా శిక్షాకర్మీలు ఓరిమి వహించాలనే ఉచిత సలహా కూడా ఇచ్చింది. ఆరేడు నెలల పాటు వేతనాలు దొరకక, ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ సమానమైన వేతనం లేక కడుపు మండుతున్న వాళ్లకు రమణ్ సింగ్ "ఓరిమి వహించాలని" బుద్ధులు నేర్పుతున్నాడు. ఈ "ఓరిమి వహించాలనే" సలహా కూడా రానున్న లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇస్తున్నదేనన్న విషయాన్ని గమనించాలి. దీని ద్వారా బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ తోడుదొంగలేనన్న విషయం మరోసారి రుజువయ్యింది. ఈ రెండింటి విధానాల్లో తేడా ఏమీ లేదు. రెండు పార్టీలూ కూడా భూస్వాములవే, బడా పెట్టుబడిదార్లవే.

మరోవైపు రాష్ట్రంలోని 7 వేల శిక్షా గ్యారంటీ గురూజీలు ఈ మధ్యనే తమ డిమాండ్‌తో నిరాహారదీక్షకు దిగారు. మొత్తం 5,700 పాఠశాలల్లో పని చేస్తున్న ఈ గురూజీలు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు రెండున్నర లక్షల మంది పిల్లలకు చదువు చెబుతున్న ఈ గురూజీల పరిస్థితి శిక్షాకర్మీలకంటే హీనంగా ఉంది. చాలా తక్కువ వేతనంపై వీళ్లు చాలా ఏళ్లుగా పని చేస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఫిబ్రవరి 10 లోగా నెరవేర్చనట్లయితే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు దిగుతామని వీళ్లు అల్టిమేటం ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా కాలేదు. దానితో వీళ్లు తప్పనిసరై ఇప్పుడు ఆందోళనకు దిగాల్సి వచ్చింది.

**శిక్షాకర్మీలారా, గురూజీలారా !**

నిజానికి కాంగ్రెస్, బిజెపి మొదలైన దోపిడీ పార్టీలన్నీ ప్రపంచ బ్యాంకు వంటి సామ్రాజ్యవాద సంస్థలు నిర్దేశిస్తున్న విధానాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి. ప్రభుత్వాలన్నీ విద్యారంగంపై ఖర్చులో కోత విధిస్తూ విద్యను పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా నడుస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్రైవేటు కాలేజీలకూ, ప్రైవేటు విశ్వవిద్యాలయాలకూ విచ్చలవిడిగా అనుమతి మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాన్ని నిలుపు చేసి శిక్షా గ్యారంటీ యోజన, శిక్షాకర్మీలు మొదలైన పేర్లతో తాత్కాలిక నియామకం చేయడమనేది ప్రపంచ బ్యాంకు విధించిన షరతుల్లో భాగమే. ఒక్క విద్యారంగమే కాకుండా, అన్ని రంగాలనూ ప్రైవేటుపరం చేసే ప్రక్రియ చాలా వేగంగా కొనసాగుతోంది. ప్రభుత్వ కంపెనీలన్నిటినీ దళారీ పెట్టుబడిదార్లకు లేదా బహుళజాతి కంపెనీలకు కారుచౌకగా తెగనమ్మివేస్తున్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ఖర్చులో కోత విధిస్తున్నారు. ప్రతి రంగంలోనూ కొత్త ఉద్యోగాల నియామకాన్ని నిలిపివేశారు. కంపెనీలలో నుండి కార్మికులను పెద్ద ఎత్తున బర్తరఫ్ చేస్తున్నారు. ప్రపంచమంతటా *(మిగతా 29వ పేజీలో .....)*